
ఆంధ్ర
సచిత్ర
వార
పత్రిక
11-2-83



ఆకర్షణీయం

నటి సుహాసిని ముఖచిత్రంతో వెలువడిన 31—12—82 ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాలా ఆకర్షణీయంగా ఉంది. "దేముడున్నాడు" కథ వాస్తవానికి దగ్గిరగా చాల బాగుంది. "నన్ను క్షమించు రాజ్యం ..." కథ ఒక మాదిరిగాఉంది.

విజయ ప్రసాద్ (విశాఖపట్నం)

ప రి ష్కా ర ం

నటి "స్వప్న" ముఖచిత్రంతో వెలువడిన 14.1.83వ తేది ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముఖచిత్రం ఏమి బాగాలేదు పరిష్కారం కథ నాకు ఎంతగానో నచ్చింది. ఇటు పరువు అటు మనిస్పర్థలు కలగకుండా నగ పరిష్కారం చేసిన శ్రీనివాసయ్య గారి తీరు మా హృదయాన్ని ఆకట్టుకొంది.

కె. సి. రామసుబ్బయ్య (వైదుకూరు)

"అధిక ప్రసంగం ..."

7—1—83 వారపత్రికలో ధర్మపథం శీర్షికలో వేసిన "అధిక ప్రసంగం" చదివాను. దీనిలో అమితభాషులు ఎదుర్కొనే సమస్యలు చక్కగా వివరించారు. నేను దీనిని గుర్తించి యింత చక్కగా ఎందుకు వ్రాస్తున్నానంటే, నేనుకూడా చాలవరకు మితభాషినైనందున. మా ఇంట్లో కూడా వీడు ముచ్చువాడు మాట్లాడడు అని హేళన చేస్తూంటారు. కాబట్టి అమితభాషులకు చక్కటి గుణపాఠం చెప్పినందుకు శ్రీ బులుసు వేంకటరమణయ్యగారికి హృదయపూర్వకాభివందనలు తెలుపుచున్నాను.

వై. భగవద్దాస్ (ఆదోని)

క్యాలెండర్ కథ

సినీనటి స్వప్న ముఖచిత్రం చూడ ముచ్చటగా ఉంది. మరియు యువత మెచ్చే నటి శ్రీదేవి ఫోటోగల క్యాలెండర్ అద్భుతంగా ఉంది. క్యాలెండర్ కథలో క్యాలెండర్ గూర్చి తెలియని ఎన్నో విషయాలు తెలియపర్చారు.

ఎస్. సుజనాదేవి (మహబూబాబాద్)

సీరియల్ నవలలు

14 1.83 నాడు వెలువడ్డ ఆంధ్ర సచిత్ర వారపత్రిక నటి స్వప్న ముఖచిత్రం చాలా బాగుంది రాగాగ్ని, నీలాకాశం సీరియల్స్ చాల బాగున్నవి మరియు ఇది సంధ్యా సమయం అయిపోయినందుకు చాలా నిరాశకలిగింది.

ఎం. సుశీల (చీర్లవంచ)

ఇది సంధ్యాసమయం

ఇది సంధ్యా సమయం (పెద్ద కథ) ప్రారంభం నుంచి ముగింపు వరకు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకొంది.

కుర్రి గంగాధరరెడ్డి, కుర్రి విజయలక్ష్మి (పాతమల్లాయపాలెం)

జీవన్మృతులు

"జీవన్మృతులు" సీరియల్ రసవత్తరముగా సాగుచున్నది. గత సంచికలో సీరియల్ సస్పెన్సులో పెట్టినారు. కొలను వెంకట దుర్గాప్రసాద్‌కు నా ధన్యవాదములు. జి గోపినాద్ (సిద్దవటము)

న్యూ ఢిల్లీ లేఖ

కృష్ణ ముఖచిత్రంగా వెలువడిన పత్రిక చాల బాగుంది. ప్రచురించిన కథలన్ని బాగున్నాయి.

న్యూఢిల్లీ లేఖ చాల బాగుంది ఆసియాడ్ ఆటల విషయంలో ఖచ్చితమయిన అభిప్రాయాలు వెలువరించినందుకు సంతోషం.

'లోకం పోకడ' పత్రికకే హైలైట్. ఉమెన్ గారికి అభినందనలు.

కె ప్రమోద్‌కుమార్ (నిజామాబాద్)

* * *

7—1—83 సంచికలో డా. జయ్ దుబాషి గారు "న్యూఢిల్లీ లేఖ"లో "ఆసియాడ్ ఆటల ఆడంబరం" చక్కగా వివరించారు. వారికి నా ధన్యవాదములు ఈ దేశ నేతలు, తమకు లాభంచేకూరే ఏ పనియైనా వెనుకంజవేయకుండ చేస్తారు. ఇది వాస్తవం "రొట్టె ఇవ్వలేకసర్కస్ చూపించడం" నూరుపాళ్ళు నిజం

యన్ వి రామరాజు (గూర్కొలా)

* * *

"న్యూఢిల్లీ లేఖ"లో ఆసియాడ్ ఆటల ఆడంబరం శీర్షికలో జయ్‌దుబాషిగారి ఆసియాడ్‌కు సామాజిక లక్ష్యం అంటూ ఏమీ లేదు అన్న అభిప్రాయముతో విచక్షణగల ఏ వ్యక్తి అయినా అంగీకరించక తప్పదు. సామాన్యుడి బుర్రకు పదును పెట్టి ఆలోచింపజేసే డాక్టర్ జయ్‌దుబాషిగారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనములు.

సి. జయప్రకాశ్‌మూర్తి (తిరుపతి)

* * *

7.1.83 ఆంధ్ర సచిత్ర వారపత్రిక ముఖచిత్రం నా అభిమాన నటుడు కృష్ణతో చాల బాగుంది. పత్రికలో మీరు వేస్తున్న న్యూఢిల్లీ లేఖ చాలా బాగుంది. బి. సత్యనారాయణ (హైదరాబాద్)

* * *

పత్రికలో మొదట చదివేది న్యూఢిల్లీ లేఖ. 7.1.83 ఆసియాడ్ ఆటల విషయంలో డా. జయ్‌దుబాషిగారు వ్రాసింది చాలవరకూ నిజమే ననిపిస్తుంది.తరువాతఇక్కడఉండేదిచాలవరకు సెంట్రల్ గవర్నమెంటుఉద్యోగస్తులు.వాళ్ళకు 70శాతం ఉండడానికి ఇల్లు లేవు. ఎన్నో బాధలు అనుభవిస్తున్నారు. మన ప్రభుత్వం 1000 కోట్లు ఆసియాడ్‌కి ఖర్చుపెట్టారు. అందులో వీళ్ల కోసం కనీసం 5 కోట్లు ఖర్చుపెట్టినా ఏ యిబ్బందీ ఉండేదికాదు. ఆసియా ఆటలు మనదేశంలో జరగడం మనకు గర్వకారణమే. కాని ముందు ప్రజల అవసరాలు తీర్చినతరువాత ఆసియాడ్ ఆటలు నిర్వహించి ఉండవలసింది మన ప్రభుత్వం.

కె. జి. కృష్ణ,విజయ,మణిప్రియ (న్యూఢిల్లీ)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
శుక్రవారం : 11–2–'83
దుందుభినామ సం. పుష్య-మాఘ. బ. చతుర్దశి
సంపుటము 75 : సంచిక 24
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ


*

విడి ప్రతి వెల	రు. 1–50
ఆరుమాసాల చందా	రు. 42–90
పోస్టులో ఏడాది చందా	రు. 85–80

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

* లోకం పోకడ — ఊమెన్ *



శ్రీమతి గాంధీ పార్టీ పతనానికి కారణం?

న్యూఢిల్లీ లేఖ


డాక్టర్ జయ్ దుబాషి

గోడమీద రాసిన దానిని చదవలేని రాజకీయవేత్త లందరూ గోడ దగ్గరికి వెళ్ళగానే ఆగిపోతారు. ఒక్క రాజకీయవేత్తలేకాదు; ఈ విధంగా చదవలేని వారెందరో ఉన్నారు. ఒక పత్రిక మొన్న జరిగిన ఎన్నికల గురించి శ్రీమతి గాంధీకి ఆంధ్రప్రదేశ్‌లో మెజారిటీ సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. శ్రీ ఎన్. టి. రామారావుకి 100 సీట్లు రావచ్చని అన్నది. ఇందులో తప్పు ఎక్కడ ఉన్నది? ఈ ఎన్నికల శాస్త్రవేత్తలు కంప్యూటరుని నిందించారు. వారికి అది ఒక తృప్తి. ప్రస్తుతం అవి గతించిన విషయాలు. ఇప్పుడవి మార్గదర్శకం కాజాలవు. భారత దేశం ప్రగతి పథంలో నడుస్తున్నది. అందువల్ల పాత నిర్ణయాలు భవిష్యత్తుకి మార్గం చూపలేవు.

ఈ మధ్య రెండు దక్షిణాది రాష్ట్రాలకి ఎన్నికలు జరిగిన రోజున నేను బొంబాయి నుంచి ఢిల్లీకి రైలులో ప్రయాణం చేస్తున్నాను. నేను ఎక్కిన పెట్టెలో పురుషులు, స్త్రీలు, పిల్లలు అన్ని రాష్ట్రాలకి, అన్ని భాషలకు చెందినవారు దాదాపు 100 మంది ఉన్నారు. అంతా తలా రు. 225 లు పెట్టి టిక్కెట్లు కొన్నారు. దాదాపు పాతికేళ్ళ క్రితం అనుకుంటాను, మొట్ట మొదటిసారిగా ఢిల్లీ నుంచి బొంబాయికి డీలక్స్ రైలు ప్రవేశ పెట్టారు. అప్పుడు టిక్కెట్టు వెల రు. 45 లు మాత్రమే. రేట్లు అయిదు రెట్లు పెరిగినా సీట్లు ఇరవై రెట్లు ఎక్కువైనా ఒత్తిడి మాత్రం రోజురోజుకీ పెరిగి జన ప్రవాహంలా కనిపిస్తూనే ఉంది. ప్రజల దగ్గర ఎక్కువ డబ్బు ఉండటమే కాకుండా వాళ్ళు దాన్ని స్వేచ్ఛగా ఖర్చు చెయ్యడానికి కూడ అలవాటు పడ్డారు.

భారతీయులు పూర్వం కన్న ఎక్కువగా చదువుకుంటున్నారు. రైలుపెట్టె అంతా వార్తా పత్రికలు, వార, మాస పత్రికల మయంగా ఉంది. ఒక్కొక్కళ్ళు కనీసం పది, పదిహేను రూపాయలు వాటికోసం ఖర్చుచేసి ఉంటారు. 20 ఏళ్ళ క్రిందట ఒక వార్తాపత్రిక, మహా ఉంటే మరో మాస పత్రిక ఉండేవి. బొంబాయిలో ప్రజలు బస్సులుదిగి దగ్గరలో ఉన్న పుస్తకాల షాపుకి వెళ్ళి, మోయలేనన్ని పత్రికలు కొంటారు ఢిల్లీలో కూడా అంతే. ఒక పత్రికలమ్మే కుర్రాడు కొద్దిదూరంతిరిగి రోజుకి రు 250 విలువగల పత్రికలమ్ముతున్నానని చెప్పాడు.

ఇంకొక విషయం ఏమంటే పూర్వంలా కాక ఇప్పుడు హిందూ కుటుంబంలో పురుషుని ఆధిక్యత తగ్గింది పట్టణాలలో స్త్రీలు ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదిస్తున్నారు. అన్ని సమయాలలో వారు తమ ఆర్జనని భర్తలకు ఇవ్వరు. వారే తమ ఇష్టంవచ్చినట్లు ఖర్చు చేస్తారు. అది వారిలో పూర్తి స్వేచ్ఛని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. దాదాపు గత 10 సంవత్సరాలుగా బాగా చదువుకున్న మధ్య తరగతి వారు ఎక్కువగా ఉంటున్నారు. ఇలాంటి మధ్యతరగతే రెండు ప్రపంచ యుద్ధాల మధ్యలో ఆవిర్భవించి స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించింది. ఇప్పటి మధ్యతరగతి అప్పటిలా పురుషాధిక్యత కలది కాదు. అయినా నైతికంగా, రాజకీయంగా కూడా జాగృతం అయి ఉన్నటువంటిది. ఈ వర్గంవారే ప్రభుత్వాలని మార్చగలిగినవారు.



పట్నాలకైనా పల్లెటూర్లకైనా దాదాపు ఒకటే సూత్రం వర్తిస్తుంది. గ్రామాల లోని ప్రజలు దుర్భర దారిద్ర్యంతో, అజ్ఞానంతో ఉన్నారన్నది వట్టి భ్రమ — ఎప్పుడూ పట్నాలు దాటి బయటికి అడుగు పెట్టని రిసెర్చి స్కాలర్లు అలవాటుగా చెప్పే మాట. పల్లెలలో కూడ కొంత చదువుకున్నవాళ్లు ఉన్నారు. పట్టణాలలో లాగా వారిలో కూడ దిన, వారపత్రికలు నడిపే వారున్నారు. వారికి పట్టణాలలో ఉండే పెద్ద తలకాయలనే వారికన్నా ఎన్నోవిధాలుగా ఎక్కువ పలుకుబడే ఉంటుంది.


ఏ సమాజంలో అయినా ఎక్కువ డబ్బు కలవారు తక్కువ నీతిపరులుగా ఉంటారు

కష్టాలలో పడినప్పుడు వాటినుంచి తప్పించుకోడానికి వాళ్ళకి కావలసినంత డబ్బు ఉంటుంది. వాళ్ళకి సహాయపడి ప్రతిఫలాన్ని తీసుకునే రాజకీయ వాదులు, ప్రభుత్వాధికారులు ఉంటారు. ఇక మధ్యతరగతి వారి విషయానికి వస్తే వారు వెనుకటి వారికంటె ఎంతో మెరుగు. చాలా జాగ్రత్తగా ఉంటారు నియమ విరుద్ధంగా వారు ద్రవ్యాశకి లోబడరు మధ్యతరగతివారే, నీతి నిజాయితీలు లేని రాజకీయాలు విశ్వాసం లేని వివాహం లాంటివని అంటారు. ఈ వర్గం వారే శ్రీమతి గాంధీ పార్టీకీ, వారు అనుసరించే లజ్జారహితమైన రాజకీయాలకీ చరమగీతం పాడారు.

ఈ మధ్యతరగతి వారే రాజీవ్ గాంధీని ద్వేషించారు. వారే అంతూలే, గుండూరావు, జగన్నాథ మిశ్రా వంటి కొత్త రకం నేరస్తులకి శ్రీమతి గాంధీ ఎంత సన్నిహితంగా ఉన్నారో గమనించారు. కాంగ్రెసు (ఐ) రాజకీయాలు ఇలాంటి కొత్త రకం నేరస్తుల వర్గంపై ఆధారపడి నడుస్తున్న వైనాన్ని గుర్తించారు. ఈ దుశ్చర్యల వలననే ఆమె ప్రతిసారి లక్షలాది ఓట్లను పోగొట్టుకుంటున్నారు. ప్రగతిని సాధిస్తున్న మధ్యతరగతి వారు చక్కని సంస్కృతి, విద్య కలిగినవారు. వారు అంతా ధర్మబద్ధంగా ఉండాలని ఆశిస్తారు. సంజయ్‌గాంధీ మీదా, అంతూలే మీదా వారికి విశ్వాసం లేదు వాళ్ళు ప్రభుత్వాధికారాలని దుర్వినియోగం చేశారని వీరి అభిప్రాయం. అంతూలే, మిశ్రా వంటి వారు ఎంతకాలం ఉంటారో అంతలోతుగా తన గోతిని తనకు తానే ఆ పార్టీ త్రవ్వుకున్నట్లు లెక్క!

అరుణ్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ మంచి వాళ్ళే కావచ్చు, వారు సదుద్దేశ్యంతోనే రాజకీయాలలో ప్రవేశించి ఉండవచ్చు. కానీ వారు బాధ్యతలేని అధికారం చెలాయించడం చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా రాజకీయ తంత్రంలో వీరు తెర వెనుక ఉండి ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఇది తప్పు. అందువలననే శ్రీమతి గాంధీ పార్టీకి పతనం సంభవించింది. ఆమె నీతి నిజాయితీలు గల ప్రభుత్వాన్ని స్థాపించనట్లయితే ప్రజలు సరైనవారికోసం చూస్తారు. వారు సినీ తారలైతే మాత్రం నష్టం ఏమిటి!? ★





కామాక్షి కోరిక

విమల రామం

కామాక్షికి చిన్నాళ్ళ నుంచో తీరని కోరిక ఒకటుంది ...

లోకంలో కొందరికి కోరీ కోరక ముందే కొన్ని కోరికలు చటుక్కున తీరిపోతుంటాయి. మరికొందరికి ఏదో ఒకనాడు తీర్చుకొనే అవకాశాలు వస్తుంటాయి ... కాని, చాలా మందికి చాలా చాలా కోరికలు ఏ నాటికీ తీరనివిగానే మిగిలిపోతుంటాయి !

తీరని కోరికల్లో మూడు రకాలున్నాయి. తీర్చుకోటానికి అశక్యమని తెల్సుండీ కూడా అత్యాశకు పోయి కోరుకొనేవి ఒక రకం — తీర్చుకోగలిగే శక్తి వున్నా దానికన్నా ముఖ్యమైనది మరొకటి వుందని తమంతట తాము వాయిదాలు వేసుకొనేవి రెండోరకం — తన కున్నంతలోనే తన చిన్న కోరిక తీర్చుకోవాలని తపన పడుతుంటే — అనుకోని ఆటంకాలు వచ్చి ఆ ముచ్చట తీరకుండా పోవటం మూడోరకం !

ఈ మూడవ తరగతికి చెందినది కామాక్షి కోరిక !

ఏలాగయినా తన కోరిక తీర్చుకోవాలన్న పట్టుదల మినహా ఆమె వూహలెప్పుడూ ఆ మూడతరగతి హద్దులు అధిగమించలేదు ! అందరాని ఎత్తులకి ఎగరలేదు !

ఏదిగీ ఏదగని వయసులో బడిగోడల మీద చదివిన 'దురాశ దుఃఖమునకు చేటు' అన్న మాటలకి అర్థం అప్పుడు తెలుసుకోలేక పోయినా ... ఏదిగాక ఆ మాటలనే కాదు 'ఎంత చెట్టుకంత గాలి'అన్న మరో సామెతని కూడా బాగా అర్థం చేసుకుంది ఆ తర్వాత అలాంటి సూక్తులెన్నో జీవితంలో అన్వయించుకోవటమూ నేర్చుకుంది !

ఐదవ క్లాసుకి మించి చదవలేక పోయినందుకు ఆమె ఎవర్నీ నిందించలేదు. పల్లెటూర్లో పుట్టి పెరిగింది తను. అక్కడ అందరి లాంటిదే తను అని సరిపెట్టుకుంది. సిల్కు పరికిణీలు కట్టనందుకు కన్నవాళ్ళను సాధించి పోయలేదు ...ఈ మాత్రం బట్టలు కూడా లేని వాళ్ళెంతో మందున్నారని ఎవరూ చెప్పకుండానే తెల్సుకుంది. గొప్పింటి కోడలు కాలేదని చిన్నబుచ్చుకోలేదు. గుమాస్తా భార్యనయితేనేం పట్నంలో కాపురమే ఒక గొప్పని మురిసిపోయింది. పెళ్ళయి పద్దెనిమిదేళ్ళయినా పట్టుచీరొకటి మగడు కొన్నాడు కాడని అసంతృప్తి పడలేదు ... నేతచీరయినా క్రొత్త చీర కొన్ననాడే పండగ చేసుకొని సంబరపడింది ! ... ఇదీ అదీ అనియేమిటి ? జీవితంలో అందిన దాంట్లోనే ఆనందం అందుకొని సంతృప్తి పడింది. భర్త అమర్చిపెట్టిన దాంట్లోనే అష్టయిశ్వర్యాలు చవిచూసింది !

మరయితే కామాక్షికి తీరని కోరిక యేమిటి ?

ఒకే ఒక బంగారు గాజుల జత చేయించుకోవాలని కాదు. నేతవే అయిన ఒక్కసారిగా పెట్టెనిండా చీరలు కొని పెట్టుకొని కన్నుల విందు చేసుకోవాలని కాదు మరి కాస్తంత పెద్ద పెద్ద గదులున్న అద్దెయింట్లోకి మారాలనీ కాదు ... ఇలాంటి సర్వసాధారణమైన సగటు కోరికలేవీ కావు

కొందరికి తమకున్నది పుష్టి. తమకుంటేనే సంతుష్టి. కాని కామాక్షిలాంటి ఒంటి మన్నెపు గుష్టాలు లేవు. సమిష్టిగా ఆత్మీయులతో కలిసి ఆనందంలో ఒక పాలు పంచుకోవటంలోనే ఆమెకు తృప్తి ఉంది

కొందరు తమకు చిన్నావాడు తీర్చుకోలేని ముచ్చట్లు తమ పిల్లలకి తీర్చిపెట్టి మురిసిపోతుంటారు కామాక్షికి ఆ కోరిక కూడా తీరనిది కాదు తను కట్టలేకపోయిన సిల్కు పరికిణీలు తన పిల్లలచేత కట్టిస్తోంది. కొడుకులతోపాటు కూతుళ్ళనీ హైస్కూల్లో చదివిస్తోంది.

ఇంకయితే కామాక్షికి తీరకుండా మిగిలిపోయిన ఆ కోరిక యేమిటి ?

ఏవరయినా వింటే నవ్వుతారన్న జంకుతో ఆమె ఎవరికీ చెప్పలేదు చివరకి భర్త శంకరానికి కూడా చెప్పింది కాదు అతనికి ముందు తెలిస్తే అతను ఒప్పుకోడేమో అన్న అపనమ్మకం ఒకవైపు — ముందు చెప్పకుండా హఠాత్తుగా ఈ ముచ్చట తీర్చుకుని అతన్ని ఆశ్చర్యపర్చటంలోనే ఒక థ్రిల్ ఉంటుందని ఊహ మరొకవైపు ... ఆమె పెదవిని దాటి ఈ సంగతిని బయటకు రాకుండా చేసాయి.

ఆమె అలా భావించడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. కారణం ... ఆమె కోరిక ఆమె భర్తకి సంబంధించినది కావటమే !

ఆమెకు పెళ్ళికాక పూర్వమే ఈ కోరిక పుట్టింది ! కమ్మని కలలు కనే కన్నెవయసది ...ఎదురింట్లో ఒక పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళికి వెళ్ళింది కామాక్షి. పెళ్ళికొడుకుని చూసింది ఇదివరకు చాలా మంది పెళ్ళికొడుకుల్ని చూసింది కాని అలాంటి ముస్తాబులో ఎవర్నీ అంతవరకు చూసి యెరుగదు ! అదే మొదటి సారేమో ... ఆ దృశ్యం ఆమె మనస్సుకి హత్తుకు పోయింది !

సూటు వేసుకోవటం వల్ల ఆ పెళ్ళికొడుకు అందంగా కనిపించాడో, అతని వొంటి మీద వున్నందుకు ఆ సూటుకే అందం వచ్చిందో ఆమె వూహా కందలేదు !

తనకు రాబోయే పెళ్ళికొడుకు కూడా అంత చక్కగా వుండాలన్న కోరిక ఆమె కానాడే పుట్టింది ! కాని, పెళ్ళిచూపులనాడే కాదు ... పెళ్ళి వేళ కూడా శంకరం అలాంటి బట్టలు వేసుకోలేదు ! సంబరపడేవేళ ఆడంబరాలకు పరిమితి లేదనే కదా ఈ అలంకారాలు అని ఆమెకా చిన్న వయసులోనే అనిపించింది! ఇప్పుడు కాకపోతే మరింకెప్పుడు ... ఎందరో వేసుకోవటంలేదా ... అని కూడా అనిపించింది.

ఆ మాట పెళ్ళయిన తర్వాత భర్తతో అననే అంది కూడా ! ... 'మీ నాన్నగారు కొని పెడితే వేసుకోనన్నానా ?' అని మేలమాడాడు శంకరం. తన తండ్రి కొనలేక పోయాడనేగా ఈ యెత్తిపొడుపు ... అని ముఖం ముడుచుకుంది అప్పుడు. కాని, ఆ తర్వాత అత్తవారింట్లో పరిస్థితులు కూడా అంతంత మాత్రంగా ఉండటంచేతనే భర్త సూటు కొనుక్కోలేక పోయాడని అర్థం చేసుకుంది.

పెళ్ళికి ఆరేళ్ళ ముందు పుట్టి పెరిగిన కోరిక పెళ్ళినాడు తీరనందుకు ఎంతో నిరుత్సాహం కలిగినా ... అప్పుడే తీరాలని యేముంది ? ఆ తర్వాత మాత్రం తీర్చుకో కూడదా అని అప్పటికి సరిపెట్టుకుంది.

తను కాపురం పెట్టుకున్నాక ఒక సూటు కుట్టించుకోమని భర్తతో ఒకటి రెండుసార్లు అంది. 'ఎందుకు ? వచ్చే సంక్రాంతికి మా అత్తారింటికి వెడుతున్నాగా !' అని పరిహాసం చేసాడు శంకరం. కాని, ఆ తర్వాత ... ప్రతినెలా తన జీతం నుంచి కొంత డబ్బు తండ్రికి పంపటం అతనికి తప్పనిసరి కావటం చూసాక మళ్ళీ ఆ మాట అడగటానికి ఆమెకు నోరు రాలేదు !

సరే, ఏదో ఒకనాటికి పరిస్థితులు అనుకూలించినప్పుడు అతని చేత తప్పకుండా కొనిపిస్తుంది. ఫుల్ సూటులో తన భర్తను చూసుకొని తను మురిసి పోతుంది.

కామాక్షి అలాంటి కలలు కంటూండగానే నెలలు గడిచి సంవత్సరాలలోకి అడుగు పెట్టాయి. ఆమె కోరిక తీరే అవకాశం మాత్రం ఆమెకు కనుచూపు మేరలో కనిపించకుండా పోయింది !

కామాక్షి కోరిక

మొదట్లో రెండుమూడు సార్లు తన పుట్టింటి వాళ్ళిచ్చిన దయితేవే, ఇంటిఖర్చులు మిగిల్చి దాచిపెట్టిన దయితేవేం కొంతడబ్బు పోగుచేసింది. మరికొంత వేసి అతన్ని సూటు కుట్టించుకోమని అడుగుదామను కుంది. అంతలోనే మరేదో అత్యవసరం వచ్చి అతనే ఆమెనడిగి డబ్బు పుచ్చుకున్నాడు. ఆ తర్వాత మరోసారి సరాసరి తన చెల్లెలు పెళ్ళికే వెళ్ళవల్సి వచ్చింది. ఇంకోసారి కాలేజీ ఫీజు కట్టాలని తిన్నగా ఆమెకే ఉత్తరం వ్రాసాడు మరిది. రెండుమూడు సార్లు హఠాత్తుగా వచ్చారు ఆడబడుచులు ... ఇలా రాసుకుంటూ పోతే భర్తకి సూటు కొనాలని ఆమె చేసిన ప్రయత్నాల పట్టిక కన్న ఆమెకు వచ్చిన ఆటంకాల జాబితా పెద్దదిగా తయారవుతుంది. అయితే, అడుగడుగునా అలా జరుగుతున్నందుకు ఎంత నిరుత్సాహం కలుగుతూ వచ్చిందో ... అలాంటప్పుడు ఆ డబ్బు గండాలు గడిపినందుకు అంత సంతృప్తిగానూ వుండేది ఈ రిలీఫ్ మూలంగానే కాబోలు ఆమె మనస్సులోని కోరిక బలహీనమవటం అంటూ ఎప్పుడూ జరగలేదు!

చాలామందికి కొన్ని కోరికలు తీరనయినా తీరతాయి. తీరకపోతే కాలక్రమేణా అవి అణగారిపోతాయి. కాని, కామాక్షి కోరిక ఆమె మనస్సులో బలపడుతూ వచ్చిందే కాని ఏ నాడూ ఆమె మనస్సుని వదలిపెట్టి పోలేదు! ఒదో ఒక నాటికి తీర్చుకు తీరాలను కుంటూ వచ్చిందేకాని ఆ కోరిక మీద విరక్తి మాత్రం కలగలేదామెకు

చివరకి ఇలా అనుకోవటమే ఒక పరిపాట వటం ... ఎన్నటికీ ఇది తీరని దవటం జరిగేదేమో! కాని, రెండేళ్లనాడు తన చెల్లెలు పెళ్లికి వెళ్లినప్పుడు తన మరిదిగారిని ఫుల్ సూటులో చూసాక ఈ వాయిదాలకిక ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకుంది!

ఊరి నుంచి తిరిగి రాగానే భర్త ముందు ఓ తీర్మానం తెచ్చింది. "...దేనికి, ఎందుకు అని అడగద్దు ప్రతినెలా నాకో పదిరూపా యిలు యివ్వండి:"

"నా జీతమంతా నీకే తెచ్చిస్తున్నానుగా? కావల్సినంత తీసుకో!" అని నవ్వాడు శంకరం.

"అహఁ! అలాక్కాదు. అచ్చంగా నాక్కావాల్సింది పది ఈ డబ్బిలో మీరే వెయ్యండి. ఎంత అవసరమొచ్చినాసరే ఆ డబ్బు ముట్టుకో కూడదు అలా కాకపోతే నాకిచ్చిన మాట మీరు తప్పినట్టే!"

ఏదో పరిహాసానికి భార్య అనలేదని గ్రహించాడతను. అతనూ నవ్వుతాలకి సరే ననలేదు. చిత్తశుద్ధితో ఆమె కోరిక తీరే అవకాశం కల్పించాలని అంగీకరించాడు. అన్నట్టుగానే ప్రతినెలా పదిరూపాయలనోటు ఆమె డబ్బిలో వేయసాగాడు. ఆ తర్వాత చాలా సార్లు నెలాఖరు రోజుల్లో, డబ్బు అవసరం వచ్చేది. బయట వివరి దగ్గరో అప్పయినా చేసాడు కాని...ఆమె కిచ్చిన మాట మాత్రం తప్పలేదు ఆ డబ్బి ముట్టుకోలేదు. చూస్తుండగా రెండు సంవత్సరాలు దాటి పోయాయి.

తన కోరిక తీర్చుకోవటానికి కామాక్షి పెట్టుకున్న గడువు దగ్గరపడింది. సూటుకి ఎంత బట్ట కావాలి, ఎంత ఖరీదవుతుంది ... వాకబు చేసుకుంటోంది అంత డబ్బు డబ్బిలోకి చేరిందా అని లెక్కలు వేసుకుం టోంది.

ఇటీవలి జీతం వచ్చినరోజున పదిరూపా యిలు డబ్బిలో వేస్తూ 'ఇంకా ముహూర్తం పెట్టలేదా?' అని నవ్వుతూ అడుగుతున్నాడు శంకరం. ఇంతకాలం వస్తుంది వస్తుంది – అనేది, ఈ మధ్య వస్తోంది – దగ్గరికి వస్తోంది అనటం మొదలు పెట్టింది కామాక్షి.

ఓ రోజున "ఎందుకీ డబ్బు దాస్తున్నావో నాకు తెల్సితే!" అన్నాడతను అసలామె కోరిక ఏమిటో తెల్సుకోవాలని అతని ఉద్దేశ్యం కాని, అన్నేళ్ళు భద్రంగా గుండెలో దాచుకోగలిగిన సంగతి .. అందులో భర్తకి సంబంధించిన సంగతి చటుక్కున ఎలా చెపుతుంది? అతని వూహకి అందదని తెలిసాక మరింత గుట్టుగా దాచిపెట్టుకుంది ఆమె

ఆ వేళ జీతాలు తీసుకొనేరోజు ప్రొద్దున్న ఆఫీసుకు వెళ్లేటప్పుడు అలవాటుగా "ఏమయినా కావాలా?" అని అడిగాడు శంకరం.

కామాక్షి రెప్ప వేయకుండా అతనివైపు చూసింది. "కావాలి వచ్చే పదోతారీఖున మీరు శలవు పెట్టాలి!"

అతను చిత్రంగా చూసాడు "ఏమిటి కథ? మన పెళ్లిరోజు కాదుగా!"

"కాదు, నా పుట్టినరోజు!"


అతను నవ్వాడు "ఇన్నాళ్ళకి నీకు పుట్టినరోజు పండుగ చేసుకోవాలనిపించిందా?"

కామాక్షి కళ్ళు వింత కాంతితో తళ తళ లాడాయి.

"ఆ వేళ నీకేం కొనిపెట్టను?" అని ప్రేమగా అడిగాడు

"నాక్కావల్సింది నేను కొనుక్కుంటాను ఇన్నాళ్ళూ మీరిచ్చిన డబ్బు చాలు దానికి"

(59 వ పేజీ చూడండి)



వారఫలం

11-2-1983 శుక్రవారం మొదలు
17-2-1983 గురువారం వరకు

♈ మేషం: ధనలబ్ధికి అవకాశ మున్నది. రాజకీయంగా కొందరకు మేలు జరగటం గమనిస్తారు. ప్రసిద్ధులను కలిసి కొంటారు. విలువగల వస్తు వాహనాలు చాలమందికి చకూరుతాయి. స్త్రీలకు: నూతన విషయాలు తెలిసి కోవటం, నూతన మిత్ర సాంగత్యం, వృత్తిలో మేలు.

♉ వృషభం: మీకు చెంద వలసిన ధనం చేతికి రాదు. అధికారులను మెప్పించి ఉద్యోగ వ్యాపారాలలో మెలగటం ఎంతైనా న్యాయం. చాల మందికి విలువగల వస్తువులు సేకరించే అవకాశం చిక్కుతుంది. స్త్రీలకు: ఆరోగ్యం, ఆనందం, కార్య జయం గలవారం.

♊ మిథునం: మీ తాలూకు వస్తువులు పోతాయేమో! గమనించి మెలగండి. అధికారుల మూలాన జరుగ వలసిన పనులు నెరవేరుతాయి. ప్రసిద్ధులను కలిసికో గలుగుతారు. వ్యాపారం సానుకూలం. వస్తుసామాగ్రి చేకూరే అవకాశ మున్నది. స్త్రీలకు: వృత్తిలో మేలు, ఉద్యోగంలో అభివృద్ధి, నూతన విషయాలు తెలిసికొనే అవకాశాలుంటాయి.

♋ కర్కాటకం: కళా సాహిత్య రంగాలలో చాలమందికి సదవకాశా లుంటాయి. కొందరకు ఆశించినట్లు 'ట్రాన్స్ఫరు' ఆర్డరు చేతికి అందుతుంది. ముఖ్యంగా కార్మిక వర్గానికి, భారీ వ్యాపారస్థులకు అనుకూలం. స్త్రీలకు: రాజకీయ సంబంధం గల వారికి, స్థిరాస్తి ప్రయత్నం చేసే వారికి అనుకూల వారం.

♌ సింహం: 'వారం వారం యింతేనా' అని అనుకో రాదు. ఈ వారం అన్ని విధాలా క్షేమదాయకం. వృత్తిలో అభివృద్ధి దాయకం. ఆదాయం ఆశింప దగిన వారం. అప్పులైనా వసూలవుతాయని గ్రహింప గలుగుతారు. స్త్రీలకు: బంధు తాకిడి, విందు భోజనాలు, సభా గౌరవం లభ్యం.

♍ కన్య: మీతో సన్నిహితులైన వారితో పేచీలు రాగల అవకాశ మున్నది. మిత్రులతో, బంధువులతో అతి జాగ్రత్తగా మెలగ వలసిన వారం. సినీ రంగానుభవం గలవారికి నూతన సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు: ప్రజ్ఞకు తగిన సదవకాశాలు లభించటం, నలుగురిలో ప్రతిష్ఠ యినుమడించటం గమనించ గలరు.

♎ తుల. కోరిక నెరవేరిందని సంతోష పడుతారు. రాజకీయంగా మీకు మేలు చేకూరిందని కూడా గ్రహింప గలుగుతారు. చాలమందికి భూ సంపాదనకు అవకాశం గలవారం. స్త్రీలకు, భోగ భాగ్యాలకు అవకాశం గలవారం.

♏ వృశ్చికం: ఆదాయ ముంటుంది. అవకాశ వాదులు చుట్టు చేరుతారు. నూతన వ్యాపారం చేసే అవకాశం గలవారం. ప్రత్యర్థులతో కీచులాటలకు అవకాశ మున్నది. దూర బంధువులు యింటికి రాగల అవకాశా లుంటాయి. స్త్రీలకు: ఉద్యోగ రీత్యా రాజకీయంగా మేలు చేకూరుతుంది.

♐ ధనుస్సు: చాలమందికి ప్రయాణావకాశా లుంటాయి. కొందరకు నూతన వ్యాపార ప్రయత్నాలు సుకరంగా నెరవేర గలవు. లాభదాయకమైన వారంగా గ్రహించాలి. స్త్రీలకు ఆదాయం, ఉద్యోగాభి వృద్ధికి అవకాశ ముంటుంది.

♑ మకరం: అనేక విధాల మీ ప్రయత్నాలు ఫలవంతం కాగలవు. రాజకీయంగా చాలమందికి మేలు చేకూర గలదు. అవకాశ వాదుల నుండి జాగ్రత్తగా తప్పించు కోవాలి. దూర ప్రాంతాల నుండి ఉత్తరాల మూలంగా అనేక విషయాలు తెలిసికో న్నారు. స్త్రీలకు: వస్తు వాహన సేకరణకు అవకాశం గలవారం.

♒ కుంభం: ధన సేకరణకు, రాజకీయ వ్యవహారాలకు, సుఖ శాంతులకు, చాల కాలంగా రాని ధనం చేతి కందుటకు అవకాశ మున్నది. గృహ సంబంధ మైన చిక్కుల నుండి తప్పించుకో గలరు. స్త్రీలకు అనేక విధాల మేలు చేకూరుతుంది. ఉద్యోగస్థులకు సదవకాశా లుంటాయి.


♓ మీనం: కోర్టు వ్యవహారాలు సుకరంగా నెరవేరుతాయి. అంటే దావా తగాదా లుంటే, పరిష్కారం అయ్యే అవకాశ మున్నది. నూతన వ్యవహారాలలో కొందరకు జోక్యం ఏర్పడుతుంది. స్త్రీలకు ఆదాయం, వృత్తిలో అభివృద్ధి, ఉద్యోగంలో పైఅంతస్థుకు పోయే అవకాశం చేకూరుతుంది.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి★

వ్యక్తిగతం



భారత జాతీయ చదరంగం పోటీలలో గెలిచిన జూనియర్ ఛాంపియన్ సుధాకర్ బాబు. ఈ బాబుది బెంగుళూరు.



ఎక్కడనుంచయినా గెలవగలనని రెండుచోట్ల నుంచి పోటీచేసి ఓడిపోయారు కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి శ్రీ గుండురావు.



డిక్ స్ప్రింగ్ పెద్ద రగ్బీ (ఫుట్‌బాల్) ఆటగాడు. అంతేకాదు, ఐర్‌లాండ్ లేబర్ పార్టీ నాయకుడు కూడా. పద్దెనిమిది నెలలుగా మాత్రమే పార్లమెంటు సభ్యుడుగా ఉంటున్నాడు. వయసు 32 ...

పెద్దకథ

తొణకని స్వప్నం

కోమలాదేవి

మాధవ్ కళ్ళు తెరిచి చూచేటప్పటికి అమల గులాబి మొక్కల్లో వాడిన పూవులను కత్తిరించి పారేస్తోంది

"అమలా ఇక వెళ్తాను."

"అలాగే. . రండి" అంది – తను దారితీస్తూ.

తోటలోంచి బైటికి తీసుకెళ్ళింది. వారిద్దర్నీ చూచి డ్రైవర్ కార్ తీసుకొచ్చాడు.

అంతలో ఆమెకు జ్ఞాపకం వచ్చింది "ఒకసారి లోపలికి రండి" అంది లోపలికి వెళ్తూ.

మాధవ్ ఆమెతో వెళ్ళాడు ఆమె లోపలికి వెళ్ళి ఒక చిన్న పేకెట్ తెచ్చి ఇచ్చింది. "డబ్బు"

"ఓ మర్చేపోయాను.. ఐదు వేలు చాలు .. మీరే అకౌంట్ రాయండి" అని ఐదు వేలు లెక్కబెట్టి తీశాడు

మాధవ్ డబ్బును పాకెట్‌లో భద్రం చేసుకుని ఆమెకు చెప్పి కార్లో కూర్చున్నాడు.

కారు విద్యుద్దీప తోరణాలను దాటుకుంటూ మెత్తగా సాగిపోయింది.

మెత్తగా ఒత్తుగా ఉన్న కుషన్లు – పాకెట్‌లో ఐదువేల రూపాయలు . అమల ఆఖరున సూచించిన మార్గం ఆతడి హృదయాన్ని పూవులా తేలిపో చేసింది ఇంత సులభంగా ఈ సమస్య పరిష్కార మౌతుందని తను ఏనాడు అనుకోలేదు. అమలకు మనసులోనే థాంక్స్ చెప్పుకున్నాడు.

డ్రైవర్ అడిగాడు "సార్ పెళ్ళెప్పుడు ?" ఆతడి గొంతుకలోని ఆత్రాన్ని గుర్తించి "ఏం – నీకు తొందరగా ఉంది ?" అన్నాడు.

"ఔన్సార్. . మా అమ్మాయి పెళ్ళికూడ అమలమ్మగారి పెళ్ళితోపాటు జరిపిస్తారు. ఖర్చంతా అయ్యగారిదే. అందుకే" అన్నాడు డ్రైవర్.

"ఓ.. " అని నవ్వుకున్నాడు

మాధవ్‌కు నవ్వు వచ్చింది... "పెళ్ళి ఖర్చు ఏముంటుంది ?" అని కాస్త ముందుకు వంగి ఆతడి చెవిలో ఏదో ఊదాడు... డ్రైవర్ చటుక్కున బ్రేక్ వేశాడు

"సార్. . నిజమా ? .. ఒద్దుసార్" అన్నాడు వేడికోలుగ.

"ఫరవాలేదు. ముందర చూడు... పోనియ్."

డ్రైవర్ విధిలేక కార్‌ను పోనిచ్చాడు. ఆమెకు మాట ఇచ్చినట్లు తీవ్రంగా ఆలోచిస్తూ ఇల్లు జేరాడు.

(గత సంచిక తరువాయి)

మరుసటిరోజు ఉదయానికిగాని తండ్రితో ఏకాంతంగా మాట్లాడటానికి సమయం చిక్కింది కాదు. మాధవ్ ముఖంలో చాలరోజులుగా కనబడని ప్రశాంతత ఈనాడు పునఃకానవస్తోంది తల్లి దండ్రులు దాన్ని శుభసూచకంగా భావించారు చిన్నవాళ్ళు కాలేజీలకు వెళ్ళిపోయారు మాధవ్ తండ్రి దగ్గర కూర్చున్నాడు. జేబులోంచి ఐదువేలు తీసి లెక్కబెడ్తూ అన్నాడు "రవీంద్రకు ఇస్తామని ఒప్పుకున్న డబ్బు తెచ్చాను. ఆతడికి ఇచ్చి ముహూర్తం పెట్టించుకుని రండి. ఇప్పటికే ఆలస్యమైపోయింది "

గోపాల్రావు విస్తుపోయి చూస్తున్నాడు.

"నీకు ఈ డబ్బు ఎక్కడినుండి వచ్చింది ?" గంభీరంగా అడిగాడు

"మీరు ఇలాగే ఆలస్యం చేస్తే ఆ సంబంధం కూడ దాటిపోతుందని తెచ్చాను" మాధవ్ భయం భయంగా నాన్చుతూ మాట్లాడలేదు.

"ఎక్కడినుండి తెచ్చావ్ ?"

"ఎక్కడి నుండి తెస్తాను. ఇస్తామన్నవారి నుండి. రాజేంద్రప్రసాద్‌గారిచ్చారు" అదెంతో మామూలు విషయంలా అన్నాడు.

"నువ్వు ఇంతనే తీసుకున్నావా ?" గాభరాగా అడిగాడు.

"ఔను. ప్రస్తుతం మనకు కావలసింది ఐదువేలు" అన్నాడు ధృతంగా. "ఇంటి రిపేర్ కోసం ఇరవైవేలు రెడీగా ఉంచమన్నాను సాయంత్రం బేల్‌దార్‌నుగాని మేస్త్రీనిగాని పిల్చుకుని వస్తాను అంచనా వేస్తాడు."

తండ్రి ముఖంలో మారుతున్న రంగుల్ని చూచి మాధవ్ ముఖం చిట్లించాడు. "నాన్నా అట్లా చూస్తారేం ?"

"నువ్వు ఈ విషయాల్లో జోక్యం కల్గించుకో నన్నావు ఏమైనా చేసుకోండి – పొండి అన్నావు ఇట్లా ఉన్నట్లుండి ఈ విధమైన శ్రద్ధ చూపు తుంటే ఆశ్చర్యంగా ఉంది."

"ఓ .. అదా" అని – అతి తేలికగా నవ్వేశాడు

"మా ఫ్రెండ్స్ అంతా ఒకటే గోల – ఎంత తీసుకుంటున్నావ్ – అని. తెలీదంటె నమ్మలేదు. నన్ను పిచ్చివాడిక్రింద లెక్కగట్టారు. చివరికే మన్నారో తెలుసా ? . " అన్నాడు తండ్రివైపు అదోలా చూస్తూ – ఆ జవాబు ఏమిటో ఊహించి గోపాల్రావు భయపడిపోయాడు.

"ఇంటికి పెద్దవాడవై ఉండి డబ్బు విషయంలో బాధ్యతలు నువ్వు తీసుకోకుండా మీ నాన్నగార్కి ఇచ్చావా ? ఇంతవరకు ఆయన బండిని లాగారు. ఇక నువ్వు లాగు" అన్నారు. వాకు సబబుగా తోచింది. ఈ విధంగా నేనా ఆలోచించకుండా అంతా మీపై రుద్దటం నా అవివేకం. మీకు ఇంకా ఈ రిపేర్ బాధ్యతలు పెళ్ళి బాధ్యతలు అప్పగించటం నా కిష్టంలేదు కొన్ని పంచుకోవాలనుకున్నాను. అంతే "

కొడుకు మాటల్లో ఎంత యదార్థం ఉన్నదో ఆతడి మేధకు అందలేదు ! "ఒద్దు– నేనే చూచు కుంటాను ఇదేమీ బరువైన పనికాదు" అని అనలేదు– ఎందుకంటే తను మొన్నమొన్నటి వరకూ ఈ బాధ్యతల్ని ఒదిలించుకు పారిపోవాలనేవాడు లేమిలో – అప్పుల్లో ఉన్నవాడు అట్లా అనటం సహజమేకదా. ఊరకుంటే ఈ అవకాశం కూడా చేజారిపోతుందని తెచ్చికోలు నవ్వు ఒకటి బిగ్గరగా నవ్వాడు

"నిజమే నువ్వు పంచుకోవాలి. అంతకన్నా నేను కోరేదేం లేదు కాని డబ్బుంటే పని చేయించ టానికి నాకు ని సహాయం అక్కర్లేదు మాధవ్ పనివాళ్ళుంటారు నీ కెందుకీ బాధ్యతలు– ఇప్పటి నుంచి– నాలో శక్తి " మాధవ్ చెప్పనివ్వలేదు

"అలాగేలెండి. మీరే చేయించండి. అన్నీ కొనితెచ్చి పడేయిస్తాను. మరి సాయంత్రం వెళ్దామా– రవీంద్ర ఇంటికి ?"

ఆయన తల అడ్డంగా ఆడించారు "అక్కర్లేదు కట్నం డబ్బు పుట్టడం కష్టంగా ఉందని– కొన్నాళ్ళు ఆగాలనీ, ఆగలేకపోతే వేరే సంబంధం . "

"నాన్నా .. చివరికి మీరుకూడ . ఎప్పుడు రాశారు ?" అన్నాడు. ఆతడి కళ్ళు నిప్పులు చెరుగు తున్నాయి.

"నిన్నరాసి పోస్ట్ చేశాను నీ కెందుకంత కోపం. తండ్రిగా– కుసుమకు ఎలాంటి సంబంధం బావుంటుందో నాకు తెలుసును."

"ఔన్నాన్నా–తండ్రిగా ఎటువంటి సంబంధాలు మీ పిల్లలకు బావుంటాయో మీకు తెలుసును నేను కాదనటంలేదు. కాకపోతే నేను అమ్ముడుపోతున్నది మన కష్టాలు తీరటానికి. అప్పులు తీరడానికి – ఈ సొంత ఇల్లు మీదే– అని చెప్పకోకల్గటానికి– అంతే గాని దర్జాలకు సరదాలకు– గొప్పలకు కాదు మీరు ఊ అంటే ఇప్పుడేవెళ్దాం. ఇంకా మీకు నా మాటలు నచ్చకపోతే– సరే ఉత్తరం చేరి ఉండదు. డబ్బు పట్టుకుపోతే. "

"ఒద్దు ." అన్నాడాయన.

తండ్రి ఇంకా ఏదో అనకముందే– "సరే...మీ ఇష్టం" అంటూ డబ్బు జేబులో పెట్టుకుని లేచాడు. అమల చెప్పినట్లు చేయటానికి ఆదిలోనే హంసపాదమైందని బాధపడ్డాడు.

కాని తను పంతాలకుపోయి తను వేసిన ప్లాను చేతులారా పాడుచేసుకోకూడదు.

తనకు టైం కావాలి. మామూలు వాతావరణం కావాలి. కుసుమ పెళ్ళి విషయం ఏమీ జరగనట్లే రెండు రోజులు వ్యవహరించాడు. మరుసటి రోజు

ఆదివారం తండ్రితో ఏం మాట్లాడాలో నిర్ణయించుకున్నాడు.

మొదట ఇల్లు విడిపించాలి.

మరుసటి రోజు భోజనానంతరం తండ్రిని అడిగాడు తాకట్టు విడిపించటానికి ఎంత కావాలని– "బ్యాంక్ వాళ్ళనడిగి తెలుసుకున్నారా ?"

"ఆ. ఆమధ్య వెళ్ళి కనుక్కున్నాను ముప్ఫై ఒక్కవేల చిల్లర అయింది."

"బాపురే" అని సన్నగా విజిల్ వేశాడు మాధవ్.

"సాయంత్రం వెళ్ళి తెస్తాను రేపే వెళ్ళి కట్టేసి మన పత్రాలు తెచ్చుకుందాం" అన్నాడు హుషారుగా.

"ఇద్దరం వెళ్దాం మర్యాదగా ఉంటుంది"

"డబ్బు తీసుకువేవాళ్ళం – మనకేం మర్యాద నాన్నా ఆయన ఆరాలు తీసేరకం– మీరు మెల్ల మెల్లగా చెప్పేసేరకం మీరు ఊరుకోండి. నేను తెస్తాను. అంత డబ్బు ఇంటికితేను. ఎంత అయింది మొత్తం పైసలతోసహా అంకె ఇవ్వండి. చెక్ రాయించుకుని తెస్తాను"

విధిలేక ఆయన అంకె చెప్పాడు

మాధవ్ బ్యాంక్ వివరాలు – అంకె రాసుకుని కాగితాన్ని భద్రంగా జేబులో పెట్టుకున్నాడు

గోపాలరావుకు బాధగా ఉంది, తను ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు– వీడు ఇలా మారపోయాడేమిటి ? వాడి స్నేహితులంతా అంతే– డబ్బు గలవారు– కాదు కట్నాలు గుంజుకుని దర్జాగా ఉన్న వాళ్ళు

కాని మరుసటి రోజు తన చేతకి తన తాతలనాటి ఇంటి పత్రాలు రాగానే అతడి కళ్ళు చెమ్మగిల్లాయి ఆ క్షణంలో కొడుకుమీద కోపం పోయింది ఏం చేస్తాడో అన్న అనుమానం పటాపంచలైంది

మరో మాట కూడా తండ్రి చెవిన వేశాడు. "నాన్నా రాజుకు ఇవ్వవలసిన డబ్బు ఇచ్చేశాను అతడి బాకీ కూడా తీరిపోయింది"

"మంచిదే" అన్నాడు పొడి పొడిగా

తండ్రి అలా ఉదాసీనంగా ఉండటం అతడికి నచ్చలేదు "ఏం నాన్నా– అలా ఉన్నారు ?"

"ఈ వ్రతం . చేతికొస్తే . అన్నాడు అర్ధంగా.

"ఓ. అదా ఔను . అలాగే ఉంటుంది లెండి" అన్నాడు సర్దిచెబుతున్నట్లు కారణం అది కాదని మాధవ్‌కు తెలుసు ఇద్దరు బైటకొచ్చారు

అప్పుడు అడిగాడు మాధవ్ "అమ్మ గొలుసు కూడ విడిపిద్దాం నాన్నా"

"పద ఆ పై వీధిలోనే ఉంది సేఠ్ దుకాణం"

సేఠ్ లెక్కగట్టినదాన్ని వీళ్ళు అర్థం చేసుకుని డబ్బు కట్టి గొలుసు తీసుకుని దాన్ని పరీక్ష చేయించి తూకం వేయించి అంతా సరిగా ఉందని నిర్ధారణ చేసుకుని బైటకొచ్చేసరికి గంట పైగానే అయింది

"డబ్బు అవసరం అలాంటిది నీకు ఆ రోజు డబ్బు కావలసివచ్చి – ఇది పెట్టి తెచ్చాను అప్పుడు ఎనిమిది వందలిచ్చాడు రెండంతలు కట్టి తెచ్చుకుంటున్నాము"

గొలుసు విడిపించిన ఆనందం ఆ ఒక్క మాటలో తుడిచిపెట్టుకుపోయింది 'ఆరోజు నీకోసం!'

మాధవ్ ఇంకేం మాట్లాడలేదు "ఈ అప్పులన్నీ తనకోసమేనా ?"

గొలుసు పత్రాలతో తండ్రిని ఆటో ఎక్కించి



కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగా వుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడం జరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతి కించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥

తౌణకవి స్వప్నం

కొంత చిల్లర అతడి చేతిలో ఉంచి మాధవ్ వెళ్ళిపోయాడు

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళి తల్లి మెడలో ఆ గొలుసు చూచి ఆనందించాలి అనుకున్నాడు

కాని తల్లి కాఫీ అందిస్తోంటే అదే జిడ్డు ఓడుతున్న త్రాడు కనబడింది "అమ్మా గొలుసేది?" అని ఆత్రంగా అడిగాడు

"కుసుమ మెడలో ఉంది"

"ఈ జిడ్డు ఓడుతున్న త్రాడు బాగు లేదమ్మా," అన్నాడు

"ఔను పోనీ క్రొత్తది చేయించరాదా మాధవ్" అంది

మాధవ్ చకితుడయ్యాడు

వీళ్ళంతా ఎందుకిట్లా మారిపోయారు?

తను యాచకుడైపోయాడు — ఎవరికోసం?

తను అమ్ముడుపోయాడు — ఎవరికోసం?

తను అడుక్కునిరావాలి — వీళ్ళ సరదాలు తీర్చాలి — దర్జాగా ఉండటానికి డబ్బు ఇవ్వాలి.

మాధవ్ బైటకెళ్ళిపొయ్యాడు

అతడికి పదే పదే ఒక విషయం గుర్తుకు వస్తోంది.

కొందరు తల్లిదండ్రులు డబ్బుకోసం ఆడపిల్లల్ని పడుపు వృత్తిలోకి దింపి వారిద్వారా తమ అవసరాలు తీర్చుకుంటారు అలాంటివారు కూడా ఉంటారా అనిపిస్తుంది. కాని తన పరిస్థితి మాత్రం ఏం మెరుగు? తనను ఎరచూపి డబ్బు తీసుకుని వారి సరదాలు, అవసరాలు తీర్చుకోవాలనుకుంటున్నారు. ఇంకా వీళ్ళ కోరికలు ఎలా ఉంటాయో?

రాత్రి భోజనానంతరం కేశవ్ సరదాగా అన్నాడు "అన్నయ్యా అప్పులన్నీ తీర్చేశావటగా? నాకొక స్కూటర్ కొనిపెట్టు."

"స్కూటర్ నీకిప్పుడనవసరం చక్కగా చదువుకో. మంచి ఉద్యోగం అయితే నువ్వే కొనుక్కోవచ్చును" అన్నాడు సీరియస్‌గా. అన్న నుంచి అటువంటి జవాబు ఆశించని కేశవ్ కనుబొమలు ముడివడినై.

ఆ తరువాత మరెవ్వరు మాట్లాడలేదు.

మరునటిరోజు ఇంటి మరమ్మత్తు పని ప్రారంభమైంది. రాజేంద్రప్రసాద్ పలుకుబడిలో సిమెంట్ బస్తాలు దొరికినై. మరమ్మత్తు చేసి ఆ ఇంటిని ఒక రూపానికి తేవటానికి పదిరోజులు పట్టాయి. సున్నాల పని మాత్రం మిగిలిపోయింది. సిమెంటు ఆరాలన్నాడు మేస్త్రి.

మాధవ్ అంచనా సరిగానే వేశాడు, ఇరవై వేలకు కాస్త తక్కువ అయింది.

గోపాలరావు పైపైకి అతిశ్రద్ధగా సూపర్ వైజ్ చేస్తున్నలా ఉన్నా అంతరాంతరంలో అతనిలో బాధగా ఉంది. కొడుకు తనను కట్టిపడేశాడు. రాజేంద్రప్రసాద్‌ను కలుసుకోవద్దని — డబ్బు తీసుకోవద్దని చెప్పేశాడు తన చేతిలో పెట్టుకుని రిపేర్ చేయించటంలో అతడి ఉద్దేశం అనిపెట్టేశాడు. అందంగా ఉన్న కొడుకును ముందరపెట్టి బాగా డబ్బు గుంజాలనుకున్నాడు. మాధవ్‌ను అమాయకుణ్ణిచేసి — మిగతా ముగ్గురు పిల్లల్ని

సీసపుగాజు!

అణుధార్మిక శక్తి నుండి రక్షణ కల్పించగల కొత్త సీసపుగాజును పశ్చిమ జర్మనీలో తయారుచేశారు దీనిలో 65 శాతం వరకు సీసపు ఆక్సైడు ఉంటుంది చూడటానికి ఇది మామూలు గాజు వలె పారదర్శకంగా ఉంటుంది దీనిని, విమానాశ్రయాల్లో లగేజిని తనిఖీ చేసే ఎక్స్‌రే పరికరాల్లో ఉపయోగిస్తున్నారు ప్రస్తుతం వైద్య, ఇంజనీరింగ్ శాఖల్లోనూ, పరిశోధనల్లోనూ అణుధార్మిక శక్తి విరివిగా ఉపయోగిస్తున్నారు ఈ సీసపుగాజు పనిలో ఉద్యోగులకు, శాస్త్రవేత్తలకు పూర్తి రక్షణ కల్పించగలదని భావిస్తున్నారు

బాగా పైకి తేవాలనుకున్నాడు కాని తన ఆశలన్నీ అడియాశలైపోయాయి

ఆ సాయంత్రం ఇల్లంతా ఓ మారు తనిఖీచేసి ఎంతో సంతోషంతో అన్నాడు "సున్నం కొట్టిన తరువాత చాల చక్కగా ఉంటుంది నాన్నా పాతకాలం ఇల్లు కాబట్టి గదులు విశాలంగా ఉన్నాయి మూరు ఎత్తుగా ఉంది కిటికీలే చిన్నవిగా ఉన్నాయి"

"ఔను ఆ ప్రక్క మీకోసం గదులు కట్టించాలనుకున్నాను. అప్పుడు పెద్ద కిటికీలు పెట్టించుకోవచ్చును"

"ఒద్దునాన్నా ఇరుకుగా ఉంటుంది నేను వేరేగా చిన్న ఇల్లు తీసుకుంటాను"

"అద్దెకా?" అన్నాడు ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుంటూ గోపాలరావు

"ప్రస్తుతం అద్దెకే"

"ఐతే వేరుగా వుంటావన్నమాట."

"ఔను. . అంతా కలిసి వుండటం కష్టం ఈ ఇల్లు చాలదు అందరం ఒకచోట వుంటే ఏవో మనస్పర్థలు వస్తుంటాయి" కాఫీ త్రాగటానికి వెళ్ళిపోయాడు

అయిపోయింది. తను అనుకున్నంత అయింది.

ఈ వారం రోజుల్లో మాధవ్ చిన్న చిన్న అప్పులు కూడ తీర్చేశాడు ఇంట్లో అత్యవసర వస్తువులన్నీ కొన్నాడు అతడి బాధ్యతలన్నీ అయిపోయినై ఇక అందరినీ ఒదిలించుకుంటాడు అంతే.

కాఫీ త్రాగి బైటకెళ్ళిపోయాడు

"మాధవ్ మారిపోయాడండీ" అంది తల్లి భర్తతో

"ఔను దీన్ని మోసం అంటారు. స్వార్థంతో మనం మన ఉన్నతిని గూర్చి ఆలోచించుకున్నాం. అతణ్ణి అతడి భార్యను అలా దూరంగా ఉంచేయొచ్చనుకున్నాం."

ఆమె ఖండించింది "అట్లా అని మనం అనుకోలేదు" అని. అతడు చిత్రంగా నవ్వాడు "ఇష్టంలేని పెళ్ళాంతో ఏం సంసారం చేస్తాడు! భార్యను నిర్లక్ష్యం చేస్తాడు మన మాట వింటూ మన పాటకు తాళం వేస్తాడు, మనచేతిలో డబ్బంతా ఉంటుంది. అతడికి ఏదీ పట్టకుండా స్వేచ్ఛగా

ఉండేలా చేయాలనుకున్నాము ఇదంతా పైకి మనం అనుకోలేదు. కాని భార్య అనామకురాల్లా పడి ఉంటే ఆమెపై ద్వేషం పెంచుకుంటూ మన చెప్పుచేతల్లో ఉండకపోతాడా అనుకున్నాం కాని అతడికి స్నేహితులు బాగానే నూరిపోశారు .. నాకు ఒక్కటే దిగులు పట్టుకున్నది కుసుమకు సుమారైన సంబంధం తేవటం ఎట్లా అని ''

''అంతగా అయితే ఇల్లు అమ్మేద్దాం ''

అతడు పెదిమలు విరిచి తల ఆడించాడు ''అమ్మటానికి వీల్లేదు అమ్మితే ఎక్కడ ఉందాం అనుకుంటున్నావు ?''

''చిన్న ఇల్లు అద్దెకు తీసుకుందాం ''

''మంచి సలహాయే కాని ఇది నేను కట్టించిన ఇల్లు కాదు. నీకు ఒక విషయం చెప్పటానికి మర్చిపోయాను ఈ ఇల్లు నా పేరునలేదు తాతగారు పోయేటప్పుడే వీళ్ళిద్దరి పేరున పెట్టారు మా నాన్న చిన్నవయసులో పోవటం — నాది చిన్న ఉద్యోగం అని ఈ పని చేశారు అమ్మే ఆలోచన లేకుండా జేశారు'' ఆమె గుక్కపట్టి చూస్తోంది

''చెల్లి పెళ్ళికోసం ఒక పాతికవేలు ఇవ్వలేడా ?''

''ఇవ్వడు వాడికి ఉన్నట్టుండి ఎక్కడలేని తెలివి పుట్టుకొచ్చింది. రవీంద్ర సంబంధాన్ని వద్దన్నామని కోపం బైటికనడు.''

''కట్నం డబ్బు అందుకున్నప్పుడు .. ''

అతడు ''పిచ్చి'' అని బిగ్గరగా నవ్వాడు. ''తనే తీసుకుంటాడట నన్ను ఆయన దగ్గరకెళ్ళనే వద్దన్నాడు.''

ఆమె అవాక్కయి నోరు వెళ్ళబెట్టుకుంది

''వాళ్ళే దాచేశారు వాడిని తమవైపుకు తిప్పుకున్నారు డబ్బు ఎగేస్తారేమో ''

''నిస్సందేహంగా.''

ఇరువురు చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. ఎవరి ఆలోచలు వారివి. కాని ఒకందుకు ఆనందించారు. ''అప్పులన్నీ తీర్చాడు. ఈ ఇంట్లో విశ్రాంతగా ఉండొచ్చు .''

* * *

మాధవ్ అమల దగ్గరకు వెళ్ళి పక్షంరోజులైంది ఆ రోజు అమల తలిదండ్రులు — అమల మాట్లాడుకున్నారు

''మాధవ్ మోసం చేస్తాడా తల్లీ ! మొత్తం ఎంతైంది ?''

''డెబ్బైకి దగ్గర'' అంది అమల.

ఆయన ఆలోచిస్తూ తల పంకించారు

''నీకేమనిపిస్తోంది అతడు మోసం చేశాడంటే ఈ డెబ్బైవేల కోసం దేవుళ్ళాడటం అవమానకరం. నిన్న ఫోన్ చేసి చెప్పాడు. చిన్న ఇంటికోసం ప్రయత్నిస్తున్నాడట'' రాజేంద్రప్రసాద్ అన్నాడు

తల్లి అంది ''కొంటానికా ?''

''కాదు అద్దెకు ''

అమల లోలోపల ఆనందించింది. తను చెప్పినట్లు చేస్తున్నాడు. అసలు విషయం తలిదండ్రులకు తెలియదు పెళ్ళియ్యాక తెలుస్తుంది అప్పుడు ఒద్దు అనలేరు

''ఇక ఆలస్యం దేనికి . త్వరగా చేసేద్దాం'' అంది తల్లి.

''ఔను రేపు రమ్మని ఫోన్ చేస్తాను.''

ముగ్గురు భోంచేసి అవతలికి వచ్చారు లక్ష్మి హడావిడిగా వచ్చింది — ''బాబుగారు వచ్చారమ్మా''

అది చెప్పేతీరులో తెలుసుకున్నారు. బాబుగారు — అనటం — అమలకే చెప్పటం. అప్రయత్నంగా వాల్‌క్లాక్ కేసి చూశారు ఎనిమిదిన్నర

ముగ్గురు ముందరి గదిలోకి వచ్చారు. ఆతడి నమస్కారాన్ని అందుకుంటూ ''కూర్చో ..కూర్చో . నూరేళ్ళు ''

''పత్తాలేడనుకున్నారా ?'' ఓరగా అమలవైపు చూచాడు.

పెద్దవాళ్ళిద్దరు వెకిలిగా — తేలికగా నవ్వేశారు

అమల తల వంచుకున్నది మాధవ్ ముఖం గంభీరమైంది

''ఒక విషయం చెప్పటానికి వచ్చాను మీకు షాకింగ్‌గా ఉంటుంది కాని తప్పదు ''

భార్యాభర్తలు పరస్పరం చూచుకున్నారు గంభీరంగా ఉండిపోయారు

అమల తనలో అణువణువున ఉన్న శక్తినంతా కూడదీసుకుని — తన హృదయం ఆతడు చెప్పే దారుణమైన విషయాన్ని భరించటానికి — కవచాన్ని తయారు చేసుకుంటోంది ఆతడు చెప్పబోయేది తనకు తెలుసును. అయినా తలిదండ్రులు ఎంతగా బాధపడ్తారో అన్న ఆందోళన ఆమెలో ఉధృతమైంది.

మాధవ్ చటుక్కున లేచి నుంచున్నాడు

''నేను అమలతో ఏకాంతంగ మాట్లాడాలి ''

వాళ్ళిద్దరు అవాక్కయి చూస్తున్నారు

అమల మెల్లగా నుంచుని లోపలికి దారితీసింది

జేబులోంచి ఒక కవరు తీసి మెల్లగా రాజేంద్రప్రసాద్ ఎదుట ఉంచి గబగబ అమలతో లోపలికెళ్ళాడు

''అమలా మీ గదిలోకి వెళ్దాం ''

ఆమె మౌనంగా నడుస్తోంది అడుగు దూరంలో ఆమె వెనకాతలగా నడుస్తున్నాడు చామనచాయకన్నా మెరుగైన ఆమె రంగుకు ముక్కుపొడుం రంగు పాలియెస్టర్ చీర బాగా నప్పింది మెడలో సన్నటి గొలుసు మెరుస్తోంది ఆమె చెవుల్లో రవ్వల దుద్దులున్నాయిగాని — తనకు దాని వెనుక భాగం మర మాత్రం కనబడుతోంది

వెనకాతలగా ఎంతో బావుంది కాని ప్చ్ అనుకున్నాడు

గదిలో అడుగు పెట్టగానే ఆమె లైట్ వేయబోయింది.

''అమలా . అట్లాగే నుంచో నేను చెప్పేది విను నేను వెంటనే నిన్ను రిజిస్టర్ మేరేజి చేసుకోవాలనుకుంటున్నాను . సరేనా ?'' అన్నాడు ఆత్రంగా


ఆతడి చేతులు ఆమె భుజాలను పట్టుకున్నాయి ఆ మాటలకు— ఆమె ఆశ్చర్యం నుండి తేరుకోక ముందరే ఆతడి స్పర్శ ! ఆమె శరీరం బిగిసినట్లు అయింది

''అమలా. . ఊ అను''

ఆమె భూమిని అంటుకున్నట్లు గట్టిగానుంచుని మెల్లగా ''ఊ'' అంది.

ఆతడు ఆమెను ఒక్క ఊపున తన వైపుకు త్రిప్పుకున్నాడు. ఆమెను హృదయానికి హత్తుకున్నాడు. ఆమె చేతులు ఆతడి మెడను అల్లుకుపోయాయి ఆతడి అనురాగ వెల్లువలో ఆమె కరిగిపోయింది.

[ఇంకా వుంది]





డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

కె. పి. కె. - యలమంచిలి

నా వయస్సు 25 సంవత్సరములు గత 6 నెలలుగా నేను మల వ్యాధితో బాధపడుతున్నాను. ఫలహారముగాని, భోజనంగాని చేసిన వెంటనే విరోచనములు అవుతున్నవి మల పరీక్ష చేయిస్తే దానిలో రౌండ్‌వర్మ్స్, టేప్‌వర్మ్‌స్ ఎక్కువగా వున్నాయని తేల్చారు

★ రౌండ్‌వర్మ్స్ ఉన్నవారు హెల్మాసిడ్ విత్ సెన్నా అనే మందుని రోజుకి ఒక ఔన్సు వంతున రెండు రోజులు వరుసగా రాత్రిపూట తీసుకోవాలి టేప్‌వర్మ్‌లను పోగొట్టడానికి వైద్యుల పర్యవేక్షణలో ఫీలిక్స్‌మాస్, అటెబ్రిన్ వంటి మందులు వాడవలసి ఉంటుంది

ఆర్. ఎస్. - విశాఖపట్నం

తల్లిదండ్రులలో ఏ ఒక్కరికైనా ఫిట్సు ఉంటే పుట్టబోయే పిల్లలకి వచ్చే అవకాశం ఉందా? పెళ్లి ముందు స్త్రీకిగాని, పురుషుడికిగాని ఫిట్సు ఉంటే వివాహం జరిగితే తగ్గుతాయంటారు, పిల్లలు కలిగిన తర్వాత పూర్తిగా పోతాయంటారు నిజమేనా? స్త్రీకి ఫిట్సు వుంటే పురుడు రావడం కష్టం అంటారు నిజమా ?

★ తల్లిదండ్రులకి ఫిట్సు ఉన్నంత మాత్రాన వారి పిల్లలకి వచ్చే అవకాశం లేదు. కొన్ని రకాల ఫిట్సు కాలగతిలో తగ్గిపోవటం జరుగుతాయి వివాహమయిన దానివల్ల పిల్లలు పుట్టిన తర్వాత తగ్గటం అనేది ఇన్సిడెంటల్ మాత్రమే అని చెప్పాలి ఫిట్సు వచ్చే స్త్రీలకి కాన్పు కష్టమవుతుందనేది నిజం కాదు. ప్రసవ సమయంలో కొన్ని కారణాలవల్ల (ఎక్లాంప్సియా) కొందరికి ఫిట్సు వస్తాయి వారికి ప్రసవం కష్టతర మవుతుంది

ఎం. పి. ఎల్. - వర్గొండ

నా వయస్సు 20 సంవత్సరములు పెళ్ళయి 5 సంవత్సరములయినది సంతానములేదు 7, 8 సంవత్సరములనుండి వైట్ డిశ్చార్జి అవుతున్నది నేను ఈ విషయం సిగ్గువలన ఎవరికీ చెప్పలేదు దీనికి పిల్లలు పుట్టకపోవటానికి ఏమైనా సంబంధం వున్నదా ?

★ వైట్ డిశ్చార్జి అవటానికి, పిల్లలు కలుగక పోవటానికీ పెద్దగా సంబంధంలేదు ప్రతి స్త్రీకి కొంతవరకు వైట్ డిశ్చార్జి సహజమనే చెప్పవలసి ఉన్నది ముందుగా మగవారు తమ వీర్యంలో వీర్య కణాలు (స్పెర్మ్స్) ఎన్ని వున్నాయో లెక్కింపజేసు కోవాలి ఆ సంఖ్య మామూలుగానే ఉన్నదని నిర్ధారణ అయిన తర్వాత స్త్రీలు డి అండ్ సి, ట్యూబ్ టెస్టింగ్, మొదలయిన పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది

కె. ఎస్. ఆర్. – చేతుచెర్ల

★ నా వయస్సు 16 సం॥లు నాకు ఎప్పుడూ తలనెప్పి వస్తూ ఉంటుంది పడుకొనేటప్పుడు, తల వంచినా, పరిగెత్తినా, చాలా వేగంగా నరాలు కొట్టుకొంటాయి చదువుటకు చాలా యిబ్బందిగా ఉన్నది కళ్ళజోడు వాడినా, సూదులు, మందులు వాడినా తగ్గలేదు ?

★ మీకు వ్యాయామం అవసరం రోజా ప్రొద్దున, సాయంత్రం కనీసం 1 కి మీ దూరం నడవండి ఆహారం క్రమబద్ధంగా తీసుకొంటూ, రండి. మల్టి విటమిన్ మాత్రలు పూటకి ఒకటి వంతున రోజుకి రెండు పూటలుగా వరుసగా ఒక నెలపాటు వేసుకోవటం మంచిది

ఏ. పి. బి. - దోహా-ఖతార్ (గల్ఫ్)

ఇక్కడ ఒక అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేయవలసి వస్తున్నది


ఇప్పుడు నేను భయంతోను, ఆందోళన తోను నిమ్యమ్నత భావంతోను, చదువుకున్న వేవియు జ్ఞాపకం లేకుండా, ఆత్మస్థైర్యాన్ని పూర్తిగా కోల్పోయి చావలేక బ్రతుకుతున్నాను నాకు ఈర్ష్య భావం, ఎందుకూ పనికి రాకుండా పోతున్నానని, జీవితం ఎలా సాగుతుందో అనే బాధతో ఎప్పుడు ఆలోచనలతో, అవమానంతోను రోజులు గడుపు తున్నాను


★ మీరు మీదేశంలో ఉన్న సైకియాట్రిస్టులను వెంటనే సంప్రదించండి షైజోఫ్రీనియా లక్షణాలు మందుల ప్రభావం వల్ల తగ్గే అవకాశం ఉంది

జి. వి. వి ఎస్. – రాజమండ్రి

నా వయస్సు 16 సం॥లు. నాకు పంట్లనుండి కొంత కాలంగా రక్తం వస్తున్నది ఇలా ఎందుకు జరుగుతుంది ఏఏ ఆహారపదార్థాలు తీసుకోవాలి ?

★ విటమిన్ సి – లోపంవల్ల చిగుళ్ళనుంచి రక్తం కారుతుంది. రాచ ఉసిరికాయలో విటమిన్ 'సి' ఎక్కువగా ఉంటుంది. అలాగే నిమ్మకాయ, నారింజకాయ, ఆరంజి, బత్తాయి మొదలయిన వాటిలో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది ★







ఆఖరి పేషంట్ కూడా వెళ్ళిపోయాక డాక్టర్ అనూరాధ తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ రిలీఫ్‌గా వెనక్కి వాలింది

పార్వతి వచ్చి 'ఒంటిగంట అవుతోంది డాక్టర్. పేషంట్లంతా వెళ్ళిపోయారు' అంది, ఇంటికి వెళ్ళి పోవాలనే ఆత్రుతతో

''సరే'' అనూరాధ ఆ రోజు వచ్చిన డబ్బు లెక్కజూసి సొరుగులో సర్దుతుంటే వినోద్ ఫోటో కనిపించింది

బాగా క్రిందికి దిగిన మీసాలు, చురుకైన కళ్ళు, నుదుటిమీద పడుతున్న క్రాఫ్! కొద్దిగా విచ్చుకున్న పెదవులమధ్య కనిపిస్తున్న చక్కని పలువరస!

శబ్దం అవటంతో ఉలిక్కిపడి చూసింది పార్వతి ముఖం తిప్పుకుని ముసి ముసిగా నవ్వుకుంటోంది

అనూరాధ సిగ్గుపడి చప్పున సొరుగు మూసేసింది

అన్నీ సర్దుకుని స్టెత్ అందుకుని లేవబోతుంటే గుమ్మంలో అలికిడయింది.

పార్వతి వచ్చి ''డాక్టర్ ఎవరో వచ్చారు'' అంది.

అనూరాధ మళ్ళీ కుర్చీలో కూర్చుంటూ ''పంపించు'' అంది

రెండు నిముషాల తర్వాత చేతిలో సూట్‌కేస్‌తో అడుగుపెట్టిన స్త్రీని ''రండి! ఇలా కూర్చోండి'' అంది

ఆ స్త్రీ కుర్చీలో కూర్చుంది

''చెప్పండి '' ఏదో అనబోతున్న అనూరాధ తెల్లబోయింది కళ్ళల్లో ఆశ్చర్యం కదలాడుతుండగా ''మై గాడ్! శారదా! నువ్వా'' అంది

శారద ముఖం బాగా పాలిపోయి ఉంది. ఎండలో వచ్చినందువల్లనేమో ముఖంమీద చెమటలు కళ్ళు ఏడ్చినట్టుగా బాగా వాచి ఉన్నాయి అలసి పోయినదానిలా టేబిల్‌మీదికి ఒరిగిపోయింది

అనూరాధ అదిరపడి చప్పునలేచి ''శారదా! ఏమైందే? అలా ఉన్నావేం ఇంత మిట్ట మధ్యాహ్నం ఊడిపడ్డావేం'' అంది తలమీద చెయ్యివేసి

''అనూ! బైట రిక్షా ఉంది రెండు రూపాయలు'' అంది బొంగురుపోయిన గొంతుతో

శారద గొంతులోని మార్పు గమనించి విస్తుబోయినా, హాండ్‌బాగ్ తెరిచి రెండు రూపాయలు తీసుకుని గుమ్మంలో నిలబడ్డ రిక్షావాడికిచ్చి తిరిగి వచ్చింది

నిస్సత్తువగా టేబిల్‌మీద వాలివున్న శారదని, ప్రక్కనే ఉన్న సూట్‌కేస్‌ని చూసి అనూరాధ నొసలు ముడివేస్తూ ''ఏమిటే శారూ విషయం? పెట్టె, బేడాతో దిగావు నీ పతి దేవుడితో గానీ దెబ్బలాడి రాలేదు గదా'' అంది కొంచెం హాస్యంగా.

జవాబుగా వెక్కిళ్ళు వినిపించాయి బాగా ఏడుస్తున్నట్టుగా శారద భుజాలు ఎగిరెగిరి పడుతున్నాయి

అనూరాధ నిశ్చేష్టురాలిలా చూడసాగింది. ''ఏమైంది? శారద ఎందుకేడుస్తోంది!

అనూరాధ తెప్పరిల్లి శారదచేత బలవంతాన మంచినీళ్ళు త్రాగించి రిక్షాలో ఇంటికి తీసుకువచ్చింది

తల్లి ఆరాగా ఏదో అడగబోతున్నా వారించి శారదని కూర్చోబెట్టి, ఫ్యాన్‌వేసి ''ఇప్పుడు చెప్పవే'' అంది.

శారద మెల్ల మెల్లగా, అనూరాధ బుజ్జగిస్తుంటే జరిగిందంతా చెప్పి వెక్కి వెక్కి ఏడవసాగింది

శారద భర్త మోహన్ కాస్త కఠినుడనే తెలుసుగానీ ఇంత దుర్మార్గుడని తెలియదు అనూరాధకి అనుమానం మనిషి శారదని ఫ్రీగా తిరగనిచ్చేవాడు కాదు. ఎవరిళ్ళకీ పంపేవాడు కాదు. ఎవరైనా ఇంటికి వస్తే ఒప్పుకునేవాడూ కాదు!

'మైగాడ్' అనూరాధ నిర్ఘాంతపోయింది.

అందుకే తను శారదని కలుసుకోవడం కూడా మానేసింది ఎప్పుడూ హాస్పిటల్, ఇల్లూ, తీరికుంటే వినోద్ ఉత్తరాలు చదువుకోవటం

''చివరికి ఈ రోజు లేనిపోని నిందలువేసి విడాకులిచ్చేస్తానన్నారు ఇంట్లోనుండి గెంటేశారు తన జాతకంలో తన కసలు పిల్లలే లేరట'' శారద ఏడుస్తోంది

''నేను మోహన్‌ని పిలిపిస్తాను. మాట్లాడతాను'' అని అనూరాధ ఎంత చెప్పినా శారద వినలేదు

''ఆతనితో నేనిక కాపురం చెయ్యలేను విసిగిపోయాను అనూ! నాకిక చావే శరణ్యం.''

"నీకా అవసరం ఎప్పుడూ రాదు శారూ ! నీకు అండగా నేను నిలబడతాను నీ పాపకోసమైనా నువ్వు బ్రతకాలి"

శారదలో ఆశారేఖ ! బ్రతకాలనే తపన !

అనూరాధ ఆరోజే వినోద్‌కి ఉత్తరం వ్రాసేసింది శారద గురించి

"నీకేం ఫరవాలేదే శారూ ! నీ పాపకి రక్షణ నేనున్నాను నీకు బ్రతుకుతెరువు కల్పిస్తాను ఛాలెంజిగా బ్రతుకుదువుగానీ"

అనూరాధ ధైర్యం నూరిపోస్తూనే ఉంది

శారద అనారోగ్యం ఏమాత్రం తగ్గలేదు బాగా నీరసించిపోయింది మొదటినుండి మెత్తటి మనిషయిన శారద ఈ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేకపోయింది

"దిగులు పడకే శారూ వినోద్ అమెరికా నుండి రాగానే నర్సింగ్‌హోమ్ ఓపెన్ చేస్తాము. నీకు జీవితాంతం నేను రక్షణగా ఉంటాను మోహన్‌ని పిలిచి నీకు అప్పగిస్తాము కూడా"

"అనూ" శారద శుష్కహాసం చేసింది

"భార్యా, భర్తల తగవులు ఒకరు తీర్చేసి కావు అనూ నీకు తెలీదు ఆయన రారు నేనెప్పటికీ ఇలా ఉండిపోవాలి జీవచ్ఛవంలా"

అనూరాధ ఖండిస్తున్నట్టుగా అంది — "ఒక్కసారి జరిగిపోయిన వివాహ తంతులో ఏమీ లేదు శారూ ! భార్యా, భర్తలుగా నిర్ణయించే వివాహ మంత్రాలు కేవలం పగటి కలలు నీ నిర్మలమైన ప్రేమను తృణీకరించి నిన్ను గెంటేసిన భర్తకోసం 'నీతి' అనే పదానికి అర్థం మర్చిపోయిన ఆ అనుమానం మనిషికోసం, నీ జీవితాన్నంతా బలవంతంగా "బలి" పెట్టుకుంటూ పాడుచేసుకుంటావా ?"

శారద అవునన లేదు ! కాదనలేదు! మౌనంగా ఉండిపోయింది

తొమ్మిది నెలలు నిండగానే శారదకి వెంటనే పురుడొచ్చింది అనూరాధ శారదని లీలా నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్ళింది

శారద కోరికపై మోహన్‌కి ఫోన్ చేసింది వెంటనే రమ్మని

శారదని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసికెళ్ళే ముందు అంది — "అనూ ! ఈ ఆపరేషన్ అయినా నేను బ్రతుకుతాననే నమ్మకం లేదు నా పాపని నువ్వు పెంచుతానన్నావు ఆ మాట మర్చిపోకు. నువ్వు వినోద్‌తో సుఖంగా, కలకాలం నాలాంటి అనాథలకి ఆశ్రయం ఇచ్చి, కాపాడుతూ ఉండాలనే కోరుకుంటున్నాను. నా మాటగా ఒకవేళ మోహన్ వస్తే చెప్పు ఆయన జాతకంలో పిల్లలున్నారని చెప్పు లేనిదల్లా భార్య ఒక్కతే"

అనూరాధ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి

* * *

మోహన్ ఫోన్ పెట్టేశాడు ఆరు నెలలుగా జాడ తెలియకుండా పోయిన శారద అనూరాధ ఆశ్రయంలో ఉందని తెలిసి నిశ్చేష్టుడైపోయాడు.

శారదకు అనూరాధ అనే స్నేహితురాలు ఉందని ఒకటి రెండుసార్లు విన్నాడు తనింకా ఆ అనూరాధ

బలి

ఫారెన్‌లో ఉందనుకున్నాడు అందుకే పట్టించుకోలేదు.

మోహన్ కళ్ళల్లో కొత్త ఆశలు అడుగులు పెట్టినయి ఈ ఆరు నెలలుగా అతను ఎన్ని చిత్రహింసలు పడాలో అన్నీ పడ్డాడు అతన్ని నెత్తిన పెట్టుకునే వాళ్ళు కూడా, ఇప్పుడు చూడగానే తప్పుకుని వెళ్ళిపోతున్నారు

మొన్నటికి మొన్న టైపిస్ట్ వనజ మాట్లాడబోతే "నాకు మగవాళ్ళతో మాటలు పెంచుకోవడం ఇష్టంలేదు సుమండీ ! వాళ్ళ మూలానా మా స్త్రీ జాతి ఎన్ని కష్టాల పాలవుతుందో తలచుకుంటే జన్మలో పెళ్ళి వద్దురా బాబూ అనిపిస్తోంది" అంది

చెప్పు తీసుకు కొట్టినట్టుగా ఉన్న ఆ సమాధానం విని తన కొలీగ్స్ అంతా నవ్వుతూంటే తను ఎంత దహించుకుపోయాడు అవమానంతో !

చిన్నప్పటి నుండీ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో తను బాధపడుతూనే ఉన్నాడు, అది వయసుతోపాటు పెరిగిందే తప్ప తరగలేదు

ఒక ఆడ, మగ కలిసి మాట్లాడుకుంటేనే తన మనసు పిచ్చి ఆలోచలతో వెర్రిగంతులు వేసేది. ప్రతి విషయాన్ని వక్ర దృష్టితో చూడటం తప్ప, ఏ ఒక్కసారి, ఏ విషయాన్ని వాస్తవంగా ఆలోచించలేకపోయాడు

మోహన్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి !

తన నోటి ధాటికి అమాయకురాలైన శారద ఎంత బాధపడేదో ! ఆ బాధ చూసి, పైశాచికమైన ఆనందంతో మురిసిపోయేవాడే తప్ప, మానవత్వం గల మనిషిగా "అయ్యో ఎంత పని చేశాను" అని ఎన్నడూ అనుకున్న పాపాన పోలేదు.

తను కోపంతో మండిపోతూ ఒక్కసారి చావగొట్టేవాడు మౌనంగా ఏడ్చిందే తప్ప ఎదురు తిరగలేదు !

పొరబాటున గుమ్మంలో నిలబడ్డా, పాలవాడితో రెండు నిముషాలు మాట్లాడినా, కూరలు బేరం చేస్తూ కాస్త ఆలస్యం చేసినా "వాడితో ఆ కబుర్లేమిటి" అని ఛడామడా తిట్టేసేవాడు

శారద నేరకపోయి ఓసారి కాబోలు "పాలవాడికి లెక్క చెప్తున్నానండీ. ఈ మధ్య రెండు, మూడు సార్లు పాలు ఎక్కువ పోయించుకున్నాం కదా మీ అన్నగారు వచ్చినప్పుడు వాడేమో మూడు లీటర్లు అంటున్నాడు అందుకని " అంది

భార్య అంతటితో వెళ్ళిపోక ఎదురు సమాధానం చెప్పేసరికి తిక్కరేగి "రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా అని పైగా సమర్థింపు కూడానా!" అంటూ గుండెల్లో తూట్లు పొడిచాడు

శారద గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ మౌనంగా వంట గదిలోకి వెళ్ళిపోయింది

మోహన్ కర్చీఫ్‌తో చెంపల మీదికి జారిన కన్నీటిని గట్టిగా తుడుచుకున్నాడు

దీని కంతటికీ కారణం ఆ ప్రసాద్ తనలో ఈ విష బీజాలు నాటిందికూడా ప్రసాద్‌గాడే కాలేజీలో చదువుకునే రోజుల్నుండీ వాడితో స్నేహం నిజానికి ప్రసాద్‌కి లేని అలవాటు లేదు తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నా తను వినేవాడు కాదు

ప్రసాద్ మాటే వేదవాక్కు ప్రసాద్ నంది అంటే నంది, పంది అంటే పంది అనేవాడు తను ప్రసాద్ ఆకర్షణ నుండి తను తప్పుకోలేక పోయేవాడు

ప్రసాద్ వదిన పరమ గయ్యాళి నోటికి హద్దు అనేది లేదు భర్తకి కూడా తూచి తూచి పెట్టేది ఆవిడ, ఇక మరిదికేం పెడుతుంది ఫలితం ప్రసాద్ హాస్టల్ పాలయ్యాడు పైగా తలకు మించిన స్నేహాలు ఎన్నెన్నో అలవాట్లకు దారితీసినాయి

ప్రసాద్ స్నేహాన్ని తను వదులుకోలేకపోయాడు కానీ, తల్లిదండ్రుల భయంవల్ల అతని మార్గంలోకి మాత్రం వెళ్ళలేకపోయాడు

"కాసు విసిరితే ఎంతటి ఆడవాళ్ళయినా దిగి రావల్సిందే గురూ" అనే ప్రసాద్ మాటలు తన గుండెల్ని గాఢంగా నాటుకుపోయి 'ఆడది' అంటే ఓ చులకన భావం ఏర్పడ్డానికి కారణమయ్యాయి

ప్రసాద్‌కి పెళ్ళయింది భార్యని బందిఖానాలో ఉంచినట్టు గుమ్మం బైటికి రానిచ్చేవాడు కాదు చివరికి ఆ అమ్మాయి పారిపోయింది ఆ మాట ఎవరితో అనలేదు. ఆరోగ్యం బాగాలేక పుట్టింటికి వెళ్ళిందని ప్రచారం చేశాడు.

"అమ్మో ! ఆడవాళ్ళకి స్వేచ్ఛ ఇవ్వకూడదు" అని తను ఆనాడు మనసులో దృఢ నిశ్చయం చేసుకున్నాడు.

అటువంటి సమయంలో తను శారదని పెళ్ళి చేసుకున్నాడు "ఎంతో కట్నమిచ్చి పిల్లనిస్తామంటుంటే ఈ దిక్కుమాలిన సంబంధంచేసుకుంటానంటావేమిట్రా" అని తల్లీ, తండ్రీ, అన్నయ్య విస్తుపోయారు చివాట్లు పెట్టారు అయినా తను వినలేదు

శారద కట్నం తేలేదు చిన్నప్పుడే తల్లిదండ్రులను పోగొట్టుకుని, మేనమామ పెంపకంలో అత్తయ్య ఆదరణలో పెరిగింది

అందరూ ఆశ్చర్యపోయారుకూడా తను చేసిన పనికి ప్రసాద్ భార్య గొప్పింటి బిడ్డ పుట్టింటికి

ముందే మేలుకో

చేతులు కట్టుకు కూర్చుంటే
చేతకాని వాడంటారు
లేచి నిలుచుంటే
శక్తి వంతుడంటారు
కుక్క ఎగబడుతుంటే—
అదిలించనైనా అదిలించాలి కదా !
పిల్లి ఇంట్లో కొస్తే—
బెదిరించి నపుడే కదా పారిపోయేది !
అందుకే అనుభవంతో
అంటున్నాను బ్రదర్—
అలా అలా వుండిపోతే
అమాయకు డంటారు
తీరా మేల్కొనే టప్పటికే
తిని పోతారు నిన్ను
నిన్ను నిర్జీవిని చేయకముందే
వెన్ను తట్టి మేలుకో !

— కాణిపాకం లింగన్న

మోహన్ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి, ఇన్ని అవమానాల మధ్య, ఇన్ని అవహేళనల మధ్య. నలిగిపోయిన అతని మనస్సు శారద సాంగత్యంకోసం తహతహ లాడుతోంది

మోహన్ డాక్టర్ అనూరాధ క్లినిక్ వెతుక్కుంటూ వెళ్ళాడు శారదని అనూరాధ లీలా నర్సింగ్ హోమ్‌కి తీసుకు వెళ్ళిందని చెప్పారు

మళ్ళీ ఆటోలోపడి అక్కడికి పరిగెత్తాడు.

శారదకి ఎలా ఉందో? తను ఒక్కసారి శారదని చూసి క్షమాపణ కోరుకోవాలి తన మూర్ఖత్వం మూలంగా శారద బలైపోయింది.

అతను వణుకుతున్న కాళ్ళతో, పరుగులాంటి నడకతో నర్సింగ్‌హోమ్‌లోకి వెళ్ళాడు.

శారద బాధా పూరితమైన కేకలు వినిపిస్తున్నాయి కానీ అప్పటికే ఆలశ్యమైంది. ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసుకున్నాయి

* * *

అనూరాధ నిశ్చలంగా కూర్చుండి పోయింది. ఎదురుగా ఆ రోజు పోస్ట్ ఉంది. పేపర్ వెయిట్ క్రింద రెపరెప లాడుతున్న వినోద్ ఉత్తరం ఉంది ఒంట్లో ఉన్న సర్వశక్తుల్నీ కూడగట్టుకుని ఆ ఉత్తరంలోని సారాంశాన్ని జీర్ణించుకోడానికి ప్రయత్నిస్తోంది

డియర్ అనూ!

నీ ఉత్తరం పూర్తిగా చదివాను ఆదర్శం అన్నావు! దీన జనోద్ధరణ అన్నావు అన్నింటినీ ఓ.కే చేశాను చివరికి నువ్వు భర్తని వదిలేసి వచ్చిన ఆడదానికి కూడా ఆశ్రయం ఇచ్చి కాపాడుతున్నావు

నీ ఈ ఆదర్శం ఒక్క శారదతోనే ఆగిపోతుందా? వాళ్ళ సంతానానికి కూడా అండగా నిలబడాలంటావు రేపు ఖర్మకాలి శారదకి ఏదైనా అయితే ఆ బిడ్డని పెంచడానికి కూడా సిద్ధపడతావు.

నేనూ డాక్టర్నే! నాకూ పరువు, ప్రతిష్ఠ అన్నీ కావాలి. నా తల్లిదండ్రులకు ఇష్టంలేక పోయినా, మన మధ్య ఏర్పడిన ఆకర్షణని పెళ్ళితో ముడిపడాలని ఉబలాటపడ్డాను

ఇక్కడ మా డాడీ ఫ్రెండ్ కూతురు స్వాతి పరిచయమైంది నేనంటే ఎంతో ఇంట్రస్ట్ చూపిస్తోంది డాడీ నాకు, స్వాతికి పెళ్ళి చేయాలని ఉబలాటపడుతున్నారు. మధ్య నేను నలిగిపోతున్నాను

నేను ఇండియా రాదలుచుకోలేదు నీకు నేను కావాలనుకుంటే ఆ హాస్పిటల్ మూసేసి అమెరికా వచ్చెయ్యి ఆ వయసులో ఆదర్శాలని, పేదవాళ్ళకి ఉచిత సేవచెయ్యాలని ఆరాటపడ్డ మాట మాత్రం వాస్తవమే కానీ ఇప్పుడు ఆలోచిస్తే అర్థంతా ఒట్టి సిల్లీ అనిపిస్తోంది.

ఆదర్శాలు కూడుపెట్టవు అంతస్థు పెంచదు గౌరవాన్నివ్వదు అదే నేను తెలుసుకుంది. నువ్వూ తెలుసుకుంటావనే ఆశిస్తాను. ప్లీజ్ రిప్లై సూన్.

వినోద్

కొండంత ఆశ ఎవరో డైనమైట్‌తో పేల్చేస్తున్న అనుభూతి!

వినోద్‌మీద ఆకాశంలో అనంతంగా పెంచుకున్న నమ్మకం ఒక్కసారి ఫెళఫెళా రావాలతో కూలి నెత్తిమీద పడ్డట్టు!

సముద్ర గర్భంలో ఫెటేలున ప్రేలిన అగ్ని పర్వతం!

ఎన్నెన్నో నమ్మకాలతో ఆశయాలతో, చేపట్టిన డాక్టర్ వృత్తి విషసర్పంలా బుసలు కొడుతోంది!

మంచు పొరలు కరిగిపోయిన సూర్యోదయంలా వినోద్ మనసు కనిపిస్తోంది.

స్వాతికి, తనకీ ఛాయిస్ ఇస్తున్నాడు!

ఇది ప్రేమా?! కావచ్చు!

ఆ మాటకొస్తే, మోహన్‌ది కూడా ప్రేమే!

వినోద్‌తో పరిచయం, వినోద్‌తో కబుర్లు, వినోద్‌తో షికార్లు, వినోద్‌తో కలిసి నిర్మించుకున్న రమ్యహర్మ్యాలు, వినోద్‌తో కలలుగన్న ఆశయాలు, ఆదర్శాలు ఈ చిన్న ఉత్తరం ముక్కతో సుడిగాలికి ఎగిరిపోయి, దుమ్మూ ధూళిలో కలిసిపోయి నామరూపాల్లేకుండాపోయినాయి

శారద నిష్క్రమణతో కృంగిపోయిన మనసు ఇప్పుడు పూర్తిగా శూన్యమైపోయింది. తన కెందుకింత ఆరాటం! ప్రపంచంలో మనషులే లేరా! తను ఒప్పుకోవాలేగాని డాక్టర్ రాజా ఈ క్షణాన పెళ్ళి చేసుకుంటాడు. మరి తనకెందుకీ దిగులు? అలజడి.! ఈ నరకానికి భాష్యం చెప్పే కవిగానీ, రచయితగానీ ఎవరున్నారు?

శారద అహర్నిశలు ఎందుకు కృంగిపోయిందో ఇప్పుడు అనుభవానికి వస్తోంది!

"డాక్టర్"

అనూరాధకి వినిపించలేదు పిలువు

"డాక్టర్"

అనూరాధ తలెత్తి చూసింది

మోహన్! భార్య పోయిన తర్వాత భార్య విలువ తెలుసుకున్న మోహన్!

"నేను వెళ్ళిపోతున్నాను"

"మంచిది" నిర్లిప్తంగా ఉంది

"పాపని తీసుకు వెడతాను"

అనూరాధ చివ్వున తలెత్తింది "పాపనా" అన్నట్టున్నాయా చూపులు

మోహన్ కళ్ళు వాల్చుకుని అన్నాడు "క్షమించండి డాక్టర్! నా కసాయి తనానికి శారద బలైపోయింది నేను మూర్ఖుడిలాగే ప్రవర్తించాను అందుకే శారదని పోగొట్టుకున్నాను కనీసం పాపలోనైనా నా శారదను చూసుకుంటాను పాపని"


అతని కళ్ళల్లో నీళ్ళు ఇంకా ఏదో అనబోతున్నవాడు ఆగిపోయాడు.


అనూరాధలో చలనం వచ్చింది బ్రపని చేయడంతో చివాలున చూసి "సారీ మిస్టర్ మోహన్! ఇప్పటి వరకూ పాపని మీకివ్వాలనే అనుకున్నాను ఈ క్షణంలో ఆ ఉద్దేశం మార్చుకున్నాను రేపు కాకపోతే ఎల్లుండి అయినా మీరు పెళ్ళి చేసుకుంటారు ఈ పాపని నిర్లక్ష్యం చేస్తారు. శారదకి మాట ఇచ్చాను శారద ఆత్మ శాంతి కోసమైనా సరే ఆ పాపని మీకివ్వను నేను పెంచుకుంటాను మీరు పాప తండ్రి అని మర్చిపోండి క్షమించండి. మీరిక వెళ్ళిపోవచ్చు."

అనూరాధ గుండెలు ఎగిసి పడుతున్నాయి!

మోహన్‌కి తెలుసు అనూరాధ నిర్ణయానికి తిరుగుండదు ఆ క్షణంలో అతనిలో ఏ వైరాగ్యం ప్రవేశించిందో ఏమో! మెల్లగావె నక్కి తిరిగి గుమ్మం దాటి వెళ్ళిపోయాడు.

ప్రక్కగదిలో పాప ఏడుపు, ఆయా సముదాయింపు వినిపిస్తోంది అనూరాధ నిస్సత్తువగా టేబిల్ మీదికి ఒరిగి మోచేతి వంపులో తలదాచుకుంది. అప్పటి వరకూ నిశ్శబ్దంగా ఏడుస్తున్న గుండె మూసుకున్న కనురెప్పల చాటు నుండి బైటకి వచ్చింది ★





జెనెటిక్ ఇంజనీరింగ్ వివాదస్పదమైనదా?

డాక్టర్ సమ్మమారు రమేష్‌బాబు


(గత సంచిక తరువాయి)


"జెనెటిక్ మేకప్" వల్ల పురుష "క్రోమోజోమల్ సెటప్" మాత్రమే ఉన్న ఉత్తమ రకపు గోధుమ మొక్కలను తయారు జేయగలిగారు. ఆశ్చర్యకరంగా 5 నుంచి 6 సంవత్సరాలున్న "బ్రీడింగ్ పీరియడ్"ను 1 నుంచి 2 సంవత్సరాలకు తగ్గించడం చెప్పుకోవలసిన విశేషం. పైగా పొట్టిరకం మొక్కలు దృఢతరంగా తయారై బలమైన గాలి విసుర్లనుండి, పెద్ద పెద్ద వర్షాలనుండి రక్షణ పొందేటట్లు రూపొందడం ఒక అద్భుతంగా చెప్పుకోవచ్చును యావత్ప్రపంచం ఆహారంకోసం గోధుమపైనో, మొక్కజొన్నపైనో, బియ్యంపైనో ఆధారపడిన మాట వాస్తవమైతే– "జెనెటిక్ ఇంజనీరింగ్" ధర్మభిక్ష పెడుతోందని నిర్ధారించవచ్చు.

"జెనెటిక్ ఇంజనీరింగ్" వల్ల "వైరస్"ల ద్వారా మొక్కలకు సంక్రమించే వ్యాధిని గుర్తించవచ్చు. వ్యాధిగ్రస్తమైన మొక్కలను వేరుచేసి రోగవ్యాప్తిని అరికట్టవచ్చు. బంగాళాదుంపలకు "పొటాటో స్పిండిల్ ట్యూబర్ వైరాయిడ్" అనే "వైరస్" వల్ల విపరీత లక్షణాలున్న వ్యాధివస్తుంది. ఈ జబ్బువల్ల బంగాళాదుంపలు బాగా సన్నపడి కదురు ఆకారానికి చేరుకొని లోతైన చాళ్లను కలిగి ఉంటాయి. ఈ వ్యాధి నిరోధానికి ఇంతవరకు సరియైన మందులేదు వ్యాధిగ్రస్తమైన మొక్కలను ఏరివేయడమే గత్యంతరము "వైరస్"ను గుర్తించడానికి "జెనెటిక్ ఇంజనీరింగ్"ను ఆసరాగా తీసుకొంటారు. "వైరస్" ఆర్. యన్. ఏ. కు ("వైరస్"లో ఆర్ యన్. ఏ యే డి యన్. ఏ. లాగా వ్యవహరిస్తుంది!) ప్రత్యామ్నాయ డి.యన్ ఏ ను ప్రయోగశాలలో తయారుచేసి "ఎస్కరీచియా కోలై" "బ్యాక్టీరియమ్"లో ప్రవేశపెట్టి, డి. యన్. ఏ అణువుల సంఖ్యను పెంచి ఒక "రేడియో ఆక్టివ్ మేకర్"తో కలిపి, వ్యాధి ఉందా లేదా తెలుసుకొనేందుకై మొక్కలలో ప్రవేశపెడతారు. వ్యాధి ఉండడాన్ని "రేడియేషన్" తెలుపుతుంది. వ్యాధిని గుర్తించడానికి "జెనెటిక్ ఇంజనీరింగ్"ను ఉపయోగించే తీరును క్రింది రేఖా చిత్రం (1) లో వివరించడం జరిగింది

విలక్షణమైన, బలవర్ధకమైన మొక్కల తయారీలో "జెనెటిక్ ఇంజనీరింగ్" పాత్ర ఎంతో విశిష్టమైనది. అత్యధికమైన వ్యాధి నిరోధక శక్తిని, ఎక్కువ మాంసకృత్తులున్న పరిపోషక శక్తిని, ఆత్మ పరాగసంపర్క శక్తిని, జీవన ఆయుర్దాయాన్ని పెంపు చేసుకోగల శక్తిని, ప్రకృతి పరమైన ఇబ్బందులను నిలద్రొక్కుకొనే శక్తిని కలిగి ఉన్న ధాన్యపు మొక్కలను "జెనెటిక్ ఇంజనీరింగ్" ఆధారంగా ఉత్పన్నం చేయగలుగుతున్నారు కారణభూతమైన జన్యువును "ప్లాస్మిడ్" ద్వారా మొక్క కణంలోకి పంపుతారు. అంటే ఈ జన్యువును ముందుగానే కావలసిన విధంగా మార్పుచేసి ఉంటారన్నమాట. ఇలాంటి కణాల సముదాయం వల్ల (వీటిని "ప్రోటోప్లాస్ట్"లని పిలుస్తారు) మొక్కల జవాభా రూపొందుతుంది ఈ మొక్కలు వ్యాధి నిరోధక శక్తిని, క్షామ నిరోధక శక్తిని, క్షారజలాన్ని భరించగలిగే శక్తిని కలిగి ఉండి, దృఢతరంగా, పౌష్టికంగా మంచిస్థాయిలో ఉండి, ఎక్కువ జీవన ప్రమాణాన్ని కలిగి ఉంటుంది ఇంతేకాకుండా వ్యాధి కారకమైన "వైరస్"ను ఆరోగ్యవంతమైన మొక్కలోకి పంపి "వ్యాక్సిన్"లను, మందులను, నిరోధకాలను తయారుచేసారు(చిత్రం–2).


వ్యవసాయరంగానికి వరంగా చెప్పుకొనే నత్రజని స్థిరీకరణ ("నైట్రోజన్ ఫిక్సేషన్)" "జెనెటిక్ ఇంజనీరింగ్" ద్వారా ఉధృతం చేయబడింది. ప్రాధమికంగా రైతు సహోదరులు సోయాచిక్కుడు కాయలను, "ఆల్ఫాల్ఫా"ను, కొన్ని మొక్కలను నత్రజనికోసం ఉపయోగించేవారు. వేరుశనగ మొక్కల్లో అయితే "రైబోచియమ్" అనే "బ్యాక్టీరియమ్" బుడిపె వేర్లలో ఉండి నత్రజనిని సమకూరుస్తుంది. ఇలాంటి సమకూర్పు గోధుమ, జొన్న, బియ్యం మొక్కలకూడా సమకూడాలని "జెనెటిక్ ఇంజనీర్"ల ఆరాటం! నత్రజనిని సమకూర్చే "బ్యాక్టీరియమ్"లో ఆ ప్రక్రియకు కారణభూతమైన జన్యువును మార్పుచేసి, ఇతోధిక ప్రోత్సాహం కోసం "ఇండోల్ ఆసెటిక్ ఆసిడ్" అనే పెరుగుదల "హార్మోన్"ను అందించితే, నత్రజనిని స్థిరీకరించే చర్య త్వరితమవ్వడమే కాక అధికంగా స్థిరీకరింపబడడం జరిగింది. ఇలాగే మరొక "బ్యాక్టీరియమ్"–"క్లెబ్సియెల్లా న్యూమోనియో" లో ఈ నత్రజని స్థిరీకరణ విధానాన్ని ఉధృతం చేసినారు. ఇందులో ఈ స్థిరీకరణచర్యకు తోడుపడే పదేడు రకాల జన్యువులను "ఎస్కరీచియా కోలై" అనే "బ్యాక్టీరియమ్"కు కనుక అందిస్తే, ఆ "బ్యాక్టీరియమ్" కూడ నత్రజని స్థిరీకరణలో పాల్గొనడం జరిగింది. ఈ విధంగా "జెనెటిక్





ఇంజనీరింగ్'' ద్వారా నత్రజనిని మొక్కలకు విరివిగా సరఫరా చేయవచ్చును.

మొత్తంమీద ఈ "జెనెటిక్ ఇంజనీరింగ్" అనే శాస్త్రవ్యవస్థను సమీక్షించినప్పుడు ఒక విషయం స్పష్టమౌతుంది. ఇది అందరూ అనుకొంటున్నంత వివాదాస్పదమైంది కాదని. "డేర్ డెవిల్"లను, "సూపర్‌మ్యాన్"లను "జెనెటిక్ మేకప్" ద్వారా సృష్టించే ప్రశ్న అప్రస్తుతం. ఆ సందర్భం కూడ! ప్రాణికోటికి నేడెన్నో సమస్యలు ఎదురౌతున్నాయి. అందులో ప్రధానమైనది ఆహార సమస్య! ఈ "జెనెటిక్ ఇంజనీరింగ్" ద్వారా సస్య విప్లవాన్ని సాధిస్తే అంతేచాలు! కోట్ల కోట్ల "డాలర్"లు అంతరిక్ష పరిశోధనలకు పెట్టి సాధించే ఫలితాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఈ "జెనెటిక్ మ్యానిపులేషన్" విధానం ఎంతో ఉత్తమమైందని పిస్తుంది తక్కువ ఖర్చు, ఎక్కువ ప్రయోజనం అని



అనుకొంటే ఈ పద్ధతి ఎంతో నచ్చుతుంది పైగా ప్రక్రియ చాల సులభం నిరపాయకరమైనది కావలసిన ముడిసరుకులు (సేంద్రియ పదార్థాలు) ఎంతో విరివిగా లభ్యమయ్యేవే! ముఖ్యంగా ఎరువులు, మందులు, క్రిమిసంహారకాలు — ఇత్యాది కాలుష్యం బాపతు వాతావరణాల నుండి మనల్ని మనం రక్షించుకోడానికి మనకు అందుబాటులో ఉన్న ఆయుధం "జెనెటిక్ ఇంజనీరింగ్"! మన ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకుని, మన సమస్యలను మనస్సుకు పట్టించుకొని, ఆరోగ్య ప్రమాణాలను అంచనా వేసుకొని, ఆలోచించినట్లైతే ఈ "జెనెటిక్ ఇంజనీరింగ్" ఒక ఆశాజనకంగా కనిపిస్తుందే కాని వివాదాస్పదమైన అంశంగా కనిపించదు నామటుకు ఈ "జెనెటిక్ ఇంజనీరింగ్" క్లిష్టదశలో ఉన్న మానవాళికి ఒక పెద్ద ఓదార్పు! వినియోగించుకోవలసిన విజ్ఞత మాత్రం మానవునిదే!

ఆలోచించగలరు!!


[అయిపోయింది]●

సీరియల్

జీవన్మృతులు

ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్

స్వేచ్ఛానువాదం: కొలను వేంకట దుర్గాప్రసాద్



జరిగిన కథ – 13 : మిస్ మీనామ్రే, మిస్ లూసీ ఒకరికొకరు తమ తమ విషయాలను ఉత్తరాల ద్వారా తెలియపర్చుకొంటారు. క్విన్సీ పి. మోరిస్‌కు ఆర్థర్ హోల్మ్‌వుడ్ తన దగ్గర వళ్లు జలదరించే కబుర్లు వున్నాయని, తనకోసం ఎదురుచూడమని టెలిగ్రాం ఇస్తాడు. మిస్ మీనా తన డైరీలో, జోనాథన్ దగ్గరనుంచి ఎటువంటి సమాచారం అందకపోవడంతో దిగులుచెందుతున్నట్లు రాసుకొంటుంది. 'ది డైలీ టెలిగ్రాఫ్' పత్రిక నుండి కత్తిరించి, మీనామ్రే డైరీలో అంటించిన ముక్కలలోని సారాంశం వివరిస్తున్నారు. తుఫాను తాకిడికి ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఓడలోని శవం జేబులో వున్న కాగితంలోని విషయాలనుబట్టి, అతను పుస్తకంలో రాసినదాన్నిబట్టి కొంత సమాచారం బయట పడుతుంది. ఆ ఓడలో మొత్తం తొమ్మిదిమంది ప్రయాణం చేస్తుంటారు కెప్టెన్‌తోసహా. దారిలో ఒక్కొక్కళ్లు మాయమవుతూ వుంటారు. చివరికి కెప్టెన్, మరో ముగ్గురు మిగుల్తారు. అందరితోపాటు చివరకు అతనుకూడా చనిపోతాడు. కానీ ఇదంతా ఎవరు చేశారో, లేక కెప్టెనే చంపేసి తాను ఆత్మహత్య చేసుకొన్నాడో తెలియదు. మీనా లూసీని జాగ్రత్తగా కాపాడుతుంటుంది. జోనాథన్ హార్కర్ సెయింట్ జోసెఫ్, సెయింట్ మేరీ హాస్పటల్‌లో కోలుకుంటున్నాడని సిస్టర్ అగథా ఉత్తరం ద్వారా తెలుసుకొన్న మీనా మనసు కొంతవరకు కుదుట పడుతుంది. జోనాథన్, మీనా వివాహం చేసుకొంటారు. లూసీ ఆరోగ్యం గురించి జాన్ సెవార్డు ఆర్థర్ హల్మ్‌వుడ్‌కి తెలియజేస్తుంటాడు. లూసీ పరిస్థితి దయనీయంగా వుంది. ఆమె వంట్లో రక్తం చాలా తక్కువగా వుంది. ఎందువల్ల ఆమెకు రక్తం ఎక్కించటానికి [illegible]ాలు చేస్తుంటాడు ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్. డాక్టర్ సెవార్డు లూసీకి తన వంట్లోని రక్తం ఇస్తాడు. ఆమె పరిస్థితి ఇప్పుడు కొంచెం మెరుగ్గా వుంటుంది.

(గత సంచిక తరువాయి)

డాక్టర్ సెవార్డు డైరీ (సెప్టెంబర్, 10లోని తరువాయి భాగం)

లూసీ మామూలుగా నాతో మాట్లాడింది. అసలు ఏం జరిగిందో ఆమెకు తెలిసినట్టులేదు. ఆమెను ఉత్సాహపరుస్తూ మాట్లాడసాగాను. అప్పుడే వాళ్లమ్మ లోపలికొచ్చింది. ఆమెలో మార్పును ఆమెకూడా గమనించినట్టులేదు. ఆమె ఎంతో కృతజ్ఞతా పూర్వకంగా అంది "డాక్టర్ సెవార్డు, మేము మీకు చాలా రుణపడి వున్నాం. మీ ఆరోగ్యం కూడా జాగ్రత్తగా చూసుకోండి. మీరు కూడా పాలిపోయి కనిపిస్తున్నారు. ఈ సమయంలో మీ బాగోగులు చూడడానికి భార్య అవసరం. అందుకు ప్రయత్నించండి". అట్లా అన్నప్పుడు లూసీ మొహం ఓక్షణం ఎర్రబడింది. అమె నావంక చాలా సార్లు చూసింది. నేను నవ్వి తలూపాను. నా వేలిని పెదాలమీద పెట్టుకుని ఆమె గాఢంగా నిట్టూర్చి వెనక దిండుమీద వాలిపోయింది.

రెండు గంటల తర్వాత వాన్‌హెల్సింగ్ తిరిగి వచ్చాడు "ఇక నువ్వు ఇంటికెళ్లు. కాస్త తాగి, బాగా తిని పడుకో. బాగా బలం పుంజుకో. ఈ రాత్రికి ఇక్కడ నేను వుంటాను. లూసీ దగ్గర కూర్చుంటాను. ఈ కేసును మనిద్దరమే చూడాలి. మరి ఎవరికీ తెలియకూడదు. ఎందుకంటే చెప్ప కూడని కారణాలున్నాయి. నువ్వుకూడా వాటిగురించి అడగవద్దు. నీకేదైనా బుర్రకు తడితే, సరే. జరగ కూడని విషయాల గురించి ఆలోచించడానికి నువ్వు భయబడవద్దు. గుడ్‌నైట్!" అన్నాడు నాతో.

నేను హాల్లోకి వెళ్లగానే ఇద్దరు పనిమనుషులు వచ్చారు. వాళ్లలో ఒకరు లూసీ దగ్గర కూర్చుంటాం అన్నారు. వాళ్లింతో ప్రాధేయ పడ్డారు. డాక్టర్ వాన్‌హెల్సింగ్ లేక నేను మాత్రమే లూసీ దగ్గర కూర్చోవాలని ఆయన ఉద్దేశం అని వాళ్లకి చెప్పాను. ఎట్లాగైనా ఆ బయటనుంచి వచ్చిన డాక్టర్‌తో తమగురించి చెప్పమన్నారు. లూసీని చూడాలన్న వాళ్ల ఆరాటం నన్ను కదిలించి వేసింది. ఈమధ్య ఇట్లా ఆడవాళ్లలో మంచి ఆప్యాయతను చూడగలుగు తున్నాను. మళ్ళీ ఇక్కడ ఆశ్రమానికి వచ్చాను, భోజనం వేళకు కాస్త ఆలస్యమయినా. ఆశ్రమాన్ని ఒక చుట్టు చుట్టాను. పేషంట్లు వాళ్లు బాగానే వున్నారు. నిద్రకోసం వేచిచూస్తూ ఇదంతా రాసాను. ఇదిగో, నిద్ర వస్తోంది.

సెప్టెంబర్, 11 : ఇవాళ మధ్యాహ్నం హిల్లింగ్‌హామ్ వెళ్లాను. వాన్‌హెల్సింగ్ చాలా ఉత్సాహం కనిపించాడు. లూసీ కూడా బాగానే కనిపించింది. నేను వచ్చిన కాసేపటికి ఒక పెద్ద పార్సెల్ విదేశం నుండి వాన్‌హెల్సింగ్‌కు వచ్చింది. అతను పార్సెల్ విప్పిచూసి చాలా సంతోషించాడు. అందులోంచి తెల్లటి గుత్తులు తీసి చూపించాడు.

"లూసీ! ఇవి నీకోసం" అన్నాడు.

"హా డాక్టర్, ఇవి నాకోసమా" ఆశ్చర్య పోయింది.

"అవును నీకోసమే డియర్! ఇవి నీ సరదా కోసం ఇవ్వడంలేదు. ఇవి నీకు 'మందులు' అన్నాడు. లూసీ తన మొహాన్ని పక్కకి తిప్పేసింది. "ఇవి నీ కడుపులోకి కాదు. వీటి వాసనకు నీ అందమైన ముక్కు నలుపుకోనవసరంలేదు. ఇది ఔషధంలా పనిచేస్తుంది. ఎలా పనిచేస్తుందో నీకు తెలియదులే. వీటిని నీ కిటికీ దగ్గర వుంచుతాను. కొన్ని చిన్న మాలలా కట్టి నీ మెళ్లో కడతాను. అంతే, హాయిగా నిద్రపోతావు. నిజమే! తామరపువ్వులా హాయిని చేకూర్చుతూ బాధల్ని మరపింపజేస్తుంది" అన్నాడు.

వాన్‌హెల్సింగ్ మాట్లాడుతుండగా, లూసీ ఆ పూవులను పరీక్షగా చూస్తూ, వాసన గ్రహించింది. వెంటనే క్రింద పడేసింది వికారంగా నవ్వుతూ.

"ఓ ప్రొఫెసర్! వూర్కే నాతో తమాషా ఆడుతున్నారు. ఇవి మామూలు వెల్లుల్లిపాయలు, అంతేగా!" అంది.

అంతే, వాన్‌హెల్సింగ్ లేచాడు. పళ్ళు బిగించాడు. అతని కనుబొమలు ముడిపడ్డాయి. ఆయన అట్లా మారిపోవడం నాకు ఆశ్చర్యంగానే వుంది. గంభీరంగా అన్నాడు.

"నేనేం పిచ్చివాడ్ని కాదు. నేనెప్పుడు హాస్యం కోసం ఇవి చెయ్యను. నేను చేసేదాంట్లో కారణం వుంది. నేను చెప్పిందానికి అడ్డు చెప్పకూడదు. నీకోసం కాకపోయినా, ఇతర్లకోసం నువ్వు చాలా జాగ్రత్తగా నడుచుకోవాలి."

దాంతో లూసీ భయపడిపోయింది, చాలా సున్నితమైన మనసుగలది కావడంచేత. వాన్‌హెల్సింగ్ అది గమనించి "ఓ డియర్ లూసీ, నన్ను చూసి అట్లా భయపడవద్దు. ఇదంతా నేను నీకోసం చేస్తున్నాను. ఆ పాయలు నీకెంతో మేలు చేకూర్చుతాయి. ఈ గదిని నేనే వాటితో అలంకరిస్తాను. నీకు మాలగుచ్చి వేస్తాను. కానీ ఈ విషయాలు నువ్వు ఎవరికీ చెప్పకూడదు. ఎటువంటి అనుమానం రానీయకూడదు. వినయంగా నడుచుకోవాలి. మౌనంగా వుంటే వినయంగా వున్నట్టే. వినయంగా వుంటే, నిన్ను అందరూ దగ్గరకు తీస్తారు. ఇక్కడ కూర్చో." అన్నాడు. వెంటనే

వాతో "జాన్, ఈ పాయలతో ఈ గదిని అలంకరించాల నువ్వు కాస్త సాయం చెయ్యి ఈ పాయలు 'హార్లెమ్' దగ్గర్నుంచి వచ్చాయి. అక్కడ నా మిత్రుడు వేండర్‌పూల్ వీటితాలూకు మూలికలను అద్దాల గదుల్లో పెంచుతాడు నిన్న అతనికి టెలిగ్రాం ఇస్తే, వెంటనే ఇవాళ పంపించాడు" అన్నాడు

పాయలను తీసుకుని గదిలో తిరిగాం. ప్రొఫెసర్ పనులు నాకేమీ అర్థంకావడంలేదు. ఈ పాయలు వల్ల తయారయే మందుగురించి నేనెక్కడా వినలేదు మొట్టమొదట కిటికీలను మూసి గడియ పెట్టాడు చేతినిండా పువ్వులను తీసుకుని వాటిని బాగా కిటికీల ఫ్రేముకు రుద్దాడు, ఏమాత్రం గాలి వచ్చినా, వెల్లుల్లి వాసన గదినిండా వ్యాపించేట్టుగా. మిగిలిపోయిన పాయలతో తలుపు రెక్కలమీద క్రిందా పైనా అన్నివేపులా రుద్దాడు తర్వాత చలికాచుకునే పొయ్యిచుట్టూ అదేవిధంగా రుద్దాడు ఇదంతా చాలా పెద్దఎత్తున చేస్తున్న హడావుడిగా కనిపించింది

"ప్రొఫెసర్! మీరు చేసేదానికి ఎప్పుడూ ఏదో ఒక కారణం వుంటుందని నాకుతెలుసు. కానీ ఇదేమిటో నాకు అగమ్య గోచరంగా వుంది మిమ్మల్ని సందేహించే వాడెవడూ లేడనుకోండి వున్నా ఇదంతా ఒక క్షుద్రశక్తిని దూరంగా వుంచడానికి వేసే మంత్రం అని చెప్పాలి " అన్నాడు

"అట్లాగే అనుకో!" అన్నాడు వెల్లుల్లిపాయలతో మాలకడుతూ, లూసీ మెడలో వేయడానికి

లూసీ శుభ్రంగా తయారై వచ్చింది. మంచం మీద కూర్చుంది ప్రొఫెసర్ చేసిన మాలను ఆమె మెడచుట్టూ వచ్చేలా కట్టాడు

"ఇది పాడయిపోకుండా జాగ్రత్తగా చూసుకో తలుపుగానీ, కిటికీగాని ఇవాళ నువు తీయడానికి వీలు లేదు " అని ప్రొఫెసర్ చెప్పాడు.

ఇద్దరం అక్కడ్నుంచి బయలుదేరుతుండగా వాన్ హెల్సింగ్ అన్నాడు "ఈరోజు హాయిగా, ప్రశాంతంగా, కంటినిండా నిద్ర పోతాను రెండురాత్రిళ్లు ప్రయాణం చేసాను మధ్యలో పగలు చాలా చదివాను రేపు ఏమవుతుందో అన్న ఆతృతతో గడిపాను రాత్రి ఏమో ఒక్క కునుకు తీయకుండా మేలుకుని కూర్చున్నాను. రేపు ఉదయాన్నే నన్ను పిలువు ఇద్దరం కలిసి మళ్ళీ ఇక్కడికి లూసీని చూడడానికి వద్దాం నేను వేసిన మంత్రంతో రేపు ఆమెను మంచి స్థితిలో చూస్తాం. హో. హో..." అన్నాడు నవ్వుతూ.

గతంలో చేసిన ఫలితంలేని పనులు జ్ఞాపకం వచ్చాయి ఈసారి కూడా నాకు సందేహం వచ్చింది కానీ, ఈసారి ఆయన చాలా నమ్మకంగా కనిపించే సరికి, మాట్లాడకుండా వూరుకున్నాను.

లూసి డైరీ :

సెప్టెంబర్, 12 అబ్బ! వాళ్ళందరూ నన్ను ఎంత మంచిగా చూస్తున్నారు. డాక్టర్ వాన్ హెల్సింగ్ అంటే నాకెంతో ఇష్టం. ఈ పాయల గురించి ఆయన ఎందుకంత పట్టుదలగా వున్నాడో చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. కోపంతో మండిపోయి నన్ను భయపెట్టాడు బహుశా ఆయన చేసిన పని మంచిదే అనుకుంటా, ఎందుకంటే, ఈ పాయలవల్ల సుఖంగా వుంది ఎందుకోగానీ, మొత్తానికి ఇవాళ ఒంటరిగా వుండటానికి భయం వేయడం లేదు కిటికీ చప్పుడు అయినా, దాని గురించి పట్టించుకోకూడదు అమ్మో! నిద్ర పోకుండా ఉండటానికి చేసిన ప్రయత్నం తలుచుకున్నా, నిద్ర లేమి బాధ తలుచుకున్నా, నిద్రపోతే ఏమవుతుందో అన్న భయాన్ని వూహించినా, వొళ్ళు గగుర్పొడుస్తుంది కొంతమంది ఎంతో పుణ్యంచేసుకుంటారు వారికి ఏ భయాలు, బాధలు ఉండవు కమ్మనికలలు గంటూ హాయిగా నిద్రపోతారు ఈ రోజు రాత్రి నేను నిద్రకోసం కూర్చున్నాను ఇంతకు ముందు వెల్లుల్లి అంటే నాకిష్టం వుండేదికాదు కాని ఈ రోజు అదే బాగుందనిపిస్తోంది దాని పరిమళంలో ఏదో ప్రశాంతత గోచరిస్తోంది! నాకు నిద్ర వస్తున్నట్టుగా వుంది అందరికీ గుడ్‌నైట్!

డాక్టరు సెవార్డు డైరీ :

సెప్టెంబర్,13 బెర్కిలీదగ్గర వాన్‌హెల్సింగ్‌ని కలిసాను, వేళకి మామూలుగా హోటల్ దగ్గర బండి సిద్ధంగా వుంది ప్రొఫెసర్ తన సంచి తీసుకున్నాడు

అసలు జరిగింది జరిగినట్టు రాస్తాను వాన్‌హెల్సింగ్ నేనూ ఎనిమిది గంటలకల్లా హిల్లింగ్‌హామ్ చేరాం ఉదయం ప్రకృతి చాలా బాగుంది – వెలిగిపోతున్న సూర్యుడు, ప్రకృతి తన సంవత్సరం పని పూర్తిచేసినట్టుగా కనిపించే ఈ ఆకురాలు కాలం రాకయొక్క అనుభూతి చెట్ల ఆకులు పచ్చదనాన్ని కోల్పోయి, రకరకాల అందమైన రంగుల్లోకి మారిపోతున్నాయి అవి చెట్లమీదనుంచి ఇంకా రాలిపోవడం మొదలెట్టలేదు

మేం లూసీ ఇంటికి చేరుకోగానే, లూసీ తల్లి గదిలోంచి బయటకు వస్తూ కనిపించింది ఆవిడెప్పుడూ ప్రొద్దుటే లేస్తుంది మమ్మల్ని చూసి అభివాదం చేసింది

"లూసీకి కాస్త బాగానే వున్నదని తెలిస్తే మీరు సంతోషిస్తారు, కనక చెపుతున్నాను ఇంకా పసిపాపలా నిద్రపోతోంది గది బయట వుండి ఆమెను చూసాను లోపలికి వెళ్లలేదు వెళితే ఆమె



నిద్ర లేస్తుందేమోననిపించింది'' అంది ప్రొఫెసర్ చిన్నగా నవ్వాడు ఆయన చాలా హుషారుగా కనిపించాడు రెండు చేతులూ కలిపి నలుపుతూ ''అయితే, ఈ కేసులో రోగనిర్ధారణ చేసానన్నమాట నా మందు పనిచేస్తోంది'' అన్నాడు

''ఆ గొప్పతనమంతా మీదే అనుకోకండి డాక్టర్! నాదీ కొంత వుంది ఇప్పుడు ఆమె ప్రశాంతంగా నిద్రపోతోందీ అంటే, నేనూ కొంత కారణం'' అంది

''మీరేమంటున్నారో నా కర్థం కావడంలేదు'' అన్నాడు వాన్ హెల్సింగ్

''రాత్రి ఆమె గురించి కాస్త ఆందోళన చెంది, ఆమె గదిలోకి వెళ్లాను ఆమె గాఢంగా, చాలా గాఢంగా, నిద్రపోతోంది. నేను గదిలోకి వచ్చినట్టు కూడా ఆమెకు తెలియకుండా నిద్రపోతోంది కానీ గదంతా గాలి రాకుండా బిగించేసి వుంది. పైగా గదిలో పాయల వాసన దంచేస్తోంది ఆమె మెడ చుట్టూ కూడా వెల్లుల్లిపాయలు వున్నాయి అసలే చాలా బలహీనంగా వున్న బిడ్డకు, ఆ భరించలేని వాసన ఏం చేస్తుందోనని భయమేసి, అవన్నీ తీసేసి, కిటికీ కొద్దిగా తెరిచాను, కాస్త గాలి రావడానికి ఆమెను ఇప్పుడు చూసి మీరు చాలా ఆనందిస్తారు'' అంది

ఆమె తన గదిలోకి బయలుదేరింది ఆమె మాట్లాడుతున్నంత సేపూ, నేను ప్రొఫెసర్ని గమనిస్తున్నాను. ఆయన మొహం వివర్ణమయింది ఆమె వున్నంత సేపు, ఎంతో నిభాయించుకుని నిలబడ్డాడు ఏమయినా అంటే, ఆమె ఆ దెబ్బకు తట్టుకోలేదని తెలుసు ఆమె గదిలోంచి తనగదిలోకి వెళ్లేంతసేపు, చిరునవ్వు మొహంతోనే కనిపించాడు ఆమె అట్లా వెళ్లగానే, వెంటనే నన్ను బలవంతగా

జీవన్మృతులు

భోజనాల గదిలోకి లాక్కెళ్ళి, తలుపులు వేసేసాడు

నా జీవితంలో మొదటిసారిగా, ప్రొఫెసర్ వాన్ హెల్సింగ్ ఏడవడం చూశాను నిరాశగా రెండు చేతులూ తల పైకెత్తి, టపటపా కొట్టుకున్నాడు చివరకు కుర్చీలో కూర్చుని రెండు చేతులతో మొహాన్ని కప్పుకుని ఏడవసాగాడు ఏడుపు గట్టిగా గుండెల్లోంచి వస్తున్నట్టుగా వుంది కానీ కళ్ళ వెంబడి నీళ్లులేవు మళ్లా రెండుచేతుల్ని పైకెత్తి వేడుకోలుగా 'ఓ దేవుడా, దేవుడా, దేవుడా, మేమేం పాపం చేశాం? ఎందుకిట్లా జరిగింది మేం అనుభవించాల్సిన కర్మ ఇంకావుందా? పాపం, ఈ తల్లి, తనెంతో వుపకారం చేసాననుకుంటూ, తనకు తెలీకుండా అపకారం చేసింది ఆపని తన కూతురి దేహాన్ని, ఆత్మని మింగేస్తుందని తెలీదు ఈ విషయం గురించి ఆమెకు చెప్పకూడదు హెచ్చరికలు చేయకూడదు అట్లా చేస్తే ఆమె చచ్చిపోతుంది తర్వాత ఆమె కూతురు కూడా చస్తుంది. మా కర్మ ఎందుకిలా కాలాలి ఈ క్షుద్ర మాయలన్నీ మామీదే ఎందుకు?'' అన్నారు వెంటనే కుర్చీలోంచి లేచారు 'రా తొందరగా రా ఇప్పుడు పరిస్థితి చూసి మనం నడుచుకోవాలి దయ్యాలున్నా లేకపోయినా, లేక అన్నీ ఒక్కసారే వచ్చినా సరే, మనం వాటిని ఎదుర్కొందాం'' అన్నాడు గబగబా హాలు తలుపు దగ్గర వుంచిన సంచీ దగ్గరకు వెళ్లాడు తర్వాత ఇద్దరం కలిసి లూసీ గదిలోకి అడుగు పెట్టాం

గదిలో వున్న తెరలు తొలగించాను వాన్ హెల్సింగ్ లూసీ మంచం దగ్గరకు వెళ్లాడు ఈసారి అతను కార్యక్రమం తొందరగా మొదలు పెట్టలేదు లూసీ మొహంలోకి చూసాడు ఆమెమొహం తెల్లగా పాలిపోయి భయంకరంగా కనిపించింది పూర్వంలాగే అతని మొహంలో ఎంతో విషాదం, ఆమె మీద అంతులేని జాలి కనిపించాయి

''నేను అనుకున్నట్లుగానే జరిగింది'' అంటూ నీరసంగా గొణిగాడు ఇక మాట్లాడకుండా వెనక్కి వెళ్ళి గది తలుపులు వేసేసాడు సంచిలో సామానులు తీసి టేబుల్‌మీద పెట్టసాగాడు, మళ్ళీ ఆపరేషన్ చేయడం కోసం నేను అది గమనించి, నా కోటు తీయబోయాను అతను వారించాడు, వెంటనే ''వద్దు! ఇవాళ నువ్వు ఆపరేషన్ చెయ్యాలి నేను రక్తం ఇస్తాను ఇప్పటికే నువు చాలా నీరసంగా వున్నావు'' అన్నాడు గబగబా తన కోటు తీసేసి చొక్కా చేతిని మడతబెట్టాడు

మళ్ళీ ఆపరేషన్ జరిగింది మళ్ళీ మత్తుమందు ఇవ్వడం, మళ్ళీ లూసీ చెంపలు రంగుదేలడం, మళ్ళీ ఆమె కాస్త కోలుకొని నిద్ర పోవడం, జరిగాయి ఈసారి నేను లూసీని గమనిస్తూ వుండిపోయాను, వాన్ హెల్సింగ్ విశ్రాంతి తీసుకుంటూ వుండడంవల్ల

వాన్ హెల్సింగ్ మొట్టమొదట చేసిన పని ఏమిటంటే, లూసీ గదిలోని వస్తువులు తనకు తెలియకుండా ఏమీ తీయవద్దని, ఆమె గదిలో వుంచిన పాయలు ఔషధంలాంటివని, ఆ పాయల వాసన ఆమె రోగ నివారణకు తోడ్పడుతుందని, లూసీ తల్లితో చెప్పాడు తనే ఆమె గురించి జాగ్రత్త తీసుకుంటానని చెప్పాడు ఈ రాత్రి, రేపు, ఆమెను కనిపెడుతూ వుంటానని, నేనెప్పుడు రావాలో కబురు పెడతాననీ చెప్పాడు

గంట తర్వాత లూసీ నిద్రలోంచి మేల్కొంది కాస్త చురుకుగానే కనిపించింది

ఏమిటీ దీని అర్థం? ఇదంతా ఏమిటో గందర గోళంగా వుంది. ఇంతకాలం జీవితాన్ని పిచ్చివాళ్ళ మధ్య గడపటంవల్లనేమో, అది నామీద పని చేస్తున్నట్లు అనిపిస్తోంది.

లూసీ డైరీ :

సెప్టెంబర్, 17· నాలుగు రోజులుగా, పగలూ రాత్రి మనసుకు ఎంతో ప్రశాంతంగా వుంది మళ్ళీ నా బలాన్ని పుంజుకుంటున్నాను, నేను గుర్తు పట్టలేనంత యిదిగా, అప్పటివరకూ ఏదో పీడకల కని, ఉదయం మేల్కొని, అందమైన సూర్య కిరణాలను తిలకిస్తూ, తాజాగాలిని ఆస్వాదిస్తున్నట్టు అనిపిస్తోంది, ఈ మార్పు ఏదో లీలగా గుర్తుంది— ఆందోళనతో, భయంతో గడిపిన క్షణాలు, మళ్ళా మామూలు స్థితికి ఎప్పటికీ చేరుకోలేను అనిపించిన అంధకార బంధురం.

తర్వాత, మరచిపోయిన స్థితిలో కొంతకాలం, మళ్ళీ మామూలు జీవితంలోకి అడుగు పెట్టటం — ఇదంతా, బాగా లోతైన నీళ్ళల్లోకి లాక్కుపోబడి, మళ్ళా పైకి తేల్చినట్ళుగా వుంది. డాక్టర్ వాన్‌హెల్సింగ్ నాతోపాటు వుండటంవల్లననుకుంటా, పీడకలలు పోయినయి తెలివిలో లేనప్పుడు, నాకు భయాన్ని పుట్టించిన శబ్దాలు, కిటికీ తట్టిన శబ్దాలు, దూరం నుండి వచ్చే గొంతులు నాకు దగ్గరగా వినిపించడాలు, నాకు తెలియని పనులేవో చేయమని ఆజ్ఞాపించే కర్కశధ్వనులు, ఇవన్నీ ఇప్పుడు లేవు నిద్రపోవడం అంటే ఇప్పుడు నాకు ఏమాత్రం భయంలేదు నిద్ర వస్తుంటే, మేల్కోవాలని కూడా అనిపించటంలేదు వెల్లుల్లి అంటే, నాకు ఇష్టం ఎక్కువవుతోంది రోజూ ఒక పెట్టెడు వెల్లుల్లి పాయలు ''హార్‌లెమ్'' నుంచి నాకోసం వస్తున్నాయి. ఈ రోజు డాక్టర్ వాన్‌హెల్సింగ్ వెళ్లిపోతున్నారు, ఆయనకొక రోజు ఆంస్టర్‌డామ్‌లో పని వుండటం చేత. అయినా నన్నెవరూ కనిపెట్టి వుండక్కర్లేదు. నేనిప్పుడు ఒంటరిగా వుండగలిగినంత బాగా వున్నాను అమ్మ, ఆర్థర్, ఇంకా నా స్నేహితులంతా నేనంటే ఎంతో ప్రియంగా వున్నారు దేవుడికి కృతజ్ఞులు చెప్పాలి డాక్టర్ వాన్‌హెల్సింగ్ ఈ రాత్రి ఇక్కడ వుండకపోయినా, నామీద దాని ప్రభావం వుండకుండా చూడాలి డాక్టర్ వాన్‌హెల్సింగ్ రాత్రి చాలాసేపు కుర్చీలో నిద్రపోతూ కనిపించారు ఆయన నిద్రలో వుండటం నేను రెండుసార్లు మేల్కొని చూసాను మళ్ళీ నేను నిద్రపోవడానికి భయపడలేదు — చెట్టు కొమ్మల్లో, గబ్బిలాయిలో ఏవోగాని, కిటికీ తలుపులను కోపంతో అన్నట్టుగా, గట్టిగా కొట్టినాకూడా



ఇటీవల శ్రీ వెంపటి సత్యం ఆర్ట్స్ అకాడెమీ (విజయవాడ) వారు తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో డాక్టర్ నటరాజ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నవజనార్దన పారిజాతం' నృత్య ప్రదర్శనలో సత్యభామగా శ్రీ కళాకృష్ణ

* * *

"ది పాల్ మాల్ గెజిట్"

సెప్టెంబర్, 18

పారిపోయిన తోడేలు

సాహసోపేతమైన మా విలేఖరి కథనం:

జూలాజికల్ గార్డెన్స్ రక్షకుడితో ఇంటర్వ్యూ.

ఎంతగానో విచారణ చేసాక, అందరూ వల్లకాదు పొమ్మన్నాకూడా, ''పాల్‌మాల్ గెజిట్'' అన్న మాట లను మంత్రదండంగా ఉపయోగించి, మొత్తానికి, తోడేళ్ల సెక్షను కూడా చూస్తూవుండే జూలాజికల్ గార్డెన్స్ కాపలామనిషి దగ్గరికి వెళ్లగలిగాను అతను థామస్ బిల్డర్, అక్కడున్న కాటేజీల్లో ఒకదాంట్లో వుంటున్నాడు అది ఏనుగుశాలకు దగ్గరగా వుంది నేను అతన్ని చూడడానికి వెళ్లినపుడు, టీ తీసుకుంటూ కనిపించాడు. థామస్ దంపతులు మర్యాదస్తులు వయసులో పెద్దవారు వారికి సంతానం లేదు వాళ్ల అతిథి మర్యాదలు చెప్పుకో దగ్గవిగా వున్నాయి వాళ్ళు సుఖ జీవనం గడుపు తున్నట్టు, వాళ్ల మర్యాదలనుబట్టి చెప్పవచ్చు రాత్రి భోజనాలు ముగించేవరకు అతను అసలు 'వ్యవహారం' గురించి మాట్లాడలేదు అందరం తృప్తిగా భోజనం ముగించాం భోజనాల బల్ల శుభ్రం చేయబడింది అప్పుడు అతను పైపు వెలిగించి అన్నాడు

''ఇప్పుడు చెప్పండి, మీరు ఏవేం అడగదల్చు కున్నారో అడగండి మీరు నన్ను క్షమించాలి భోజనాలు అయిన తర్వాతగాని నా వృత్తికి సంబం ధించినవాటి గురించి అడిగితే నేను చెప్పలేను నేను అంతే నా సెక్షనులో, తోడేళ్లకి, నక్కలకి, దుమ్ములగొండిలకి ఆహారం ఇచ్చిన తర్వాత వాటిని ప్రశ్నిస్తాను''

''అదేమిటి? వాటిని ప్రశ్నలు అడగడమేమిటి?'' ''అదెలా?'' అతన్ని తమాషాగా మాటల్లోకి లాగుతూ అడిగాను

''పొడుగాటి బద్ద ఒకటి తీసుకుని వాటి నెత్తి మీద కొట్టటం ఒక పద్ధతి వాటి చెవులను గోకటం మరో పద్ధతి. బద్దతీసుకుని వాటి ఆహారం కలియ బెదుతుంటాను దాంతోనే మెల్లగా నెత్తిన కొడు తుంటాను అవి ఆహారం తీసుకునే వరకూ వేచి వుంటాను. అప్పుడు వాటి చెవులను గోకుతుంటాను. వాటిని అట్లాగే మచ్చిక చేసుకోవాలి మనలోనూ ఆదే విధంగా చేయాలి. ఇప్పుడు మీరు ఇక్కడికి వచ్చి నన్ను ప్రశ్నలేస్తున్నారు, నాగురించి, నా వృత్తిగురించి. ఏదో విలేఖరి గనుక సరిపోయింది, లేకపోతే నేను జవాబు చెప్పకుండానే బయటకు గెంటించి వేసేవాడ్ని జూ సూపరింటెండెంట్ అను

కొత్త గొంతులు

టి.యల్. కాంతారావు

''పగలును రేయి మూయని కవాటముల్తై
చను పానశాల యీ
జగతి— సమస్త భూపతులు సంతత
భోగ విలాసలోలసుల్
సొగసుల తేలి, భోగముల సోలి
క్రమమ్మున నొక్కడొక్కడే
ఎగురుచు నుండు కాంతి పరి హీన
రహస్య విశాంచలమ్ములన్''
— అద్దేపల్లి రామమోహనరావు

అంత చక్కగా సంప్రదాయ ఛందస్సులలో పద్యాలు రాయగలరు రామమోహనరావుగారు వివేకానంద ఫిలాసఫీలోంచి, విశ్వనాథైక మార్గం లోంచి బయటకు వచ్చిన రావుగారు సమ కాలీన జీవితంతోనూ, వచన గేయంతోనూ, సంబంధం పెట్టుకున్నారు ఎంత కాదనుకున్నా — కవితా సృష్టిలో సంప్రదాయానికి విడాకులిచ్చినా సాహిత్య విమర్శలో సంప్రదాయ పద్ధతి ఆయన్ను వదల లేదు

ఉమర్ ఖయ్యాంకి ఫిట్జ్‌రాల్డ్ నుంచి చేసిన అనువాదం 'మధుజ్వాల' రావుగారి పద్య రచనా పాట వానికి మచ్చుతునక వచన కవిత్వానికి 'అంతర్జ్వాల' కవితా సంకలనం ఆ తరువాత అక్కడక్కడా అచ్చయిన వచన కవితా ఖండికలు ఉదాహరణలు


అంతర్జ్వాల సంకలనం అంతా సమ కాలీన మైన వ్యవస్థలో ఆర్థిక సంబంధమైన జీవుని వేదనగా కనబడుతుంది మతం, దేవుడు, రాజకీయాలు, పెట్టుబడి, ధనార్జన, మొదలైన లక్షణాలు మనిషి నుండి మనిషిని ఏ విధంగా వేరు చేస్తున్నాయో చెప్పటానికి రావుగారు పడిన వేదనా ఫలితం అంతర్జ్వాల అంతర్జ్వాల కావ్యం అంతటినీ ఒక నిరాశా ధూమం ఆవరించింది ఆ ధూమంలోంచి వెలుతురు బాటను అన్వేషించ లేకపోయారు రావుగారు మానవతావాదం, మనిషి హృదయం మారటం, మనిషి వ్యక్తిత్వం సామాజిక వ్యక్తిత్వంగా రూపొందటం లాంటివి అప్పటి ఆయన ఆశయాలు

''మనిషి మనస్సును పెంచు దారిరండి
ఒక్క మనిషి పూనికతో వందమంది
జ్వలిస్తారు
ఒక్క వ్యక్తి వికాసంలో ఒక మహా
సామాజిక విప్లవం వికసిస్తుంది''

అన్నారు కాని మార్గం మాత్రం అనిశ్చయు నిశ్చితంగా ఉండటం సైద్ధాంతిక అవగాహనకు తార్కాణమే కాని అన్యం కాదు. నిరాశా వాదం లోంచి, సమాజ వికాస వాదంలోకి ప్రస్థానించటం ప్రశంశార్హమైన విషయమే. కవి పరిణామం చైతన్యమే జీవిత్పరిణామాన్ని ఆశిస్తాడు ఎవడైనా

అంతర్జ్వాల కావ్యానంతరం ఒక దశాబ్దంలో ఆయన భావనలో ఆశించ తగ్గ మార్పు వచ్చి నట్లే వచ్చి మాయమయింది డెభై నుంచి ఎనభై దాకా ఆయన అప్పుడప్పుడు రాసిన వచన గేయాలలో విప్లవాభి ముఖమైన ఒక భావ పరిణామం పొడసూపింది డెభైమూడులో రాసిన గదిలో మేధావులు గేయం గొప్ప ఎక్స్‌ప్రెషన్ సాహిత్యంలో సామాజిక స్పృహ అవసరమా ? అనవసరమా ? అని ఈనాడు మాట్లాడటం కంటె అపహాస్యం మరొకటిలేదు రామమోహన రావుగారు ఆనాడు ప్రజాజీవితానికి దూరమైన మేధావుల సాహిత్య చర్చను మోస్టు సెటైరికల్‌గా రాయగలిగారు 'ఈ శతాబ్దపు సత్యానికి దేహం నిండా తుపాకి గుళ్ళు' అని కవితాత్మకంగా నిజాన్ని చెప్పటం అప్పట్లో రామమోహనరావుగారి కవితా శక్తికి నిదర్శనమే 'విప్లవపతాక వియత్నామ్' గేయం వారి దృక్పథంలో వచ్చిన మార్పుకు మంచి ఉదాహరణ

''అక్కడ
పసిపిల్లలకు తుపాకి గొట్టంతో
పలక మీద అ— ఆ లు రాస్తున్నారు —



తల్లులు
ఎడమచేత 'గన్ను'తో కుడిచేత గరిటతో
పిల్లలకు ఆహారం అందిస్తున్నారు
వీరులు
ప్రియురాలి పెదవి మీద
విప్లవ గీతాల్ని రచిస్తున్నారు''

ఇట్లా ఒక సదవగాహనకు వచ్చిన రామమోహనరావుగారు ఆ అవగాహనకు దూర మవటం జరిగింది

పద్యం నుంచి వచన గేయానికి, విశ్వనాథ నుండి శ్రీశ్రీకి పయనించిన రావుగారు ఈనాడు వచన గేయం వినాదాల మయమని, దానికి యవ్వన రూపంగా పుట్టిన మినీకవిత మహోద్యమ మని ఈ మినీ కవితా కీకారణ్యంలో చిక్కుకు పోవటం కవితాభిమానులకు బాధాకరమైన విషయం అది అట్లా ఉండగా కవిత్వ ఇతి వృత్తపరంగా ఏనాటికీ ఒక కన్‌సిస్టెన్సీ ఆఫ్ థాట్‌కి చెరలేక పోవటం ఆయనలోని ఏదో ఒక బలహీనతకు నిదర్శనం ఒక స్థాయికి చేరిన సిమ్మట ఏ కవి అయినా తాను ఏమిటో తను తెలుసుకుంటాడు రామమోహనరావుగారు కనీస ఆ ప్రయత్నం చెయ్యక పోవటం శోచ నీయం ఆయన వ్యక్తీకరణ పద్ధతి, వాక్య నిర్మాణం, పదబంధాలు, భావాన్ని సునాయా సంగా పాఠకుని గుండెల్లోకి చొప్పించే శిల్ప నైపుణ్యం తాత్కాలిక మినీ విప్లవాలకు తాకట్టు పడటం అవాంఛనీయ పరిణామం మాత్రమే

లోతుగా ఆలోచించ గలిగిన మనిషి 'రాజకీయ మైనా రంకు పురాణమైనా' కళాత్మకంగా వెలు వరించగలిగిన సామర్థ్యం గల మనిషి, ఏనాటికీ పసితనం వదలని మనిషి రామమోహనరావుగారు జీవితంలో ఒక అర్థభాగానికి దగ్గర పడుతున్న రామమోహనరావుగారు —

''విపరీత ధన దాహంతో నోరు తెరచిన
వ్యక్తి పళ్ళలో చిక్కుకుని ఎందరు
మనుష్యులు
పళ్ళ మధ్య ఒణికిపోయే ఎన్ని సిద్ధాంతాలు
చిగుళ్ళ నుండి కారె, ఎంత హత్యారుధిరం
ఈ అస్తవ్యస్త భయంకర సాంఘిక స్థితి
నుండి
సమాజ వృక్షానికి మూలంగా ఉన్న
మనిషి పుచ్చిపోయిన దశలో నుండి
ఎన్ని విప్లవాలైనా బయల్దేరతాయి
ఎంత రక్తపాతమైన జరుగుతుంది''

అని చెప్పి తాను ఏదీ కాకుండా ఎటో వెళ్ళి పోవటం అన్యాయం కాదా! ★

మతి తీసుకుని మిమ్మల్ని ప్రశ్నలడగాలా అని చాలా ఎత్తిపొడుపుగా అడిగారు నీఇష్టం వచ్చినట్టు చేసుకోపో, అన్నానా లేదా?''

''అన్నారు''


''అప్పుడు మీరేమన్నారు, నేను దుర్భాషలాడుతున్నట్టుగా పత్రికల్లో రాస్తానన్నారు అదే నెత్తిమీద కొట్టటం అంటే. అప్పటికి కాస్త సర్దుకున్నాను అప్పుడు నేను పోట్లాడదలుచుకోలేదు

జీవన్ స్మృతులు

నా భోజనం కోసం చూసి, అది ముగించాను, తోడేళ్ళు, సింహాలు, పులులూ చేసినట్టుగా. ఇప్పుడే ఈ ముసల్ది పాత టీ చెంబుతో టీ తెచ్చిపెట్టింది. పైపు వెలిగించాను. ఇక మీరు నా చెవులు గోకి, ఏ ప్రశ్నలు అడుగుతారో అవి అడగండి. మధ్యలో నేను గొణిగేదేవీ వుండదు ప్రశ్నలు అడుగుతూ వుండండి మీరు వేయబోయే ప్రశ్న నాకు తెలుసు. అదే, పారిపోయిన తోడేలు విషయమేనా ?'' అన్నాడు

''ఖచ్చితంగా అదే! దానిగురించి మీ అభిప్రాయం చెప్పండి అది ఎలా తప్పించుకుపోయిందో చెప్పండి? వాటికి గల కారణాలు కూడా మీరు చెప్పాలి ఇదంతా ఎట్లా ముగుస్తుందనుకుంటున్నారు ?

(ఇంకా వుంది)



జీవితం ఓ సమరం లాంటిది. ధైర్యంతో పోరాడి విజయం సాధించిన వాళ్ళున్నారు. కండబలం, గుండెబలం సడలి పోరాటంలో ఓడిపోయేవాళ్ళున్నారు.

అట్లాంటి జీవిత సమరంలో ఓడిపోనిది నీరజ. ఎంతో ఆత్మ స్థయిర్యం కలది నీరజ. ఆమె చిన్ననాడు తండ్రి చెప్పిన మాటల్ని ఎన్నడు మర్చిపోలేదు. ఆమె తండ్రి ఎలిమెంటరీ స్కూలు టీచరు.

"చూడమ్మా నీరజ! జీవితంలో ఎన్నో గడ్డు పరిస్థితులు ఎదురౌతాయి, ముఖ్యంగ మనలాంటి బీద జీవితాలకు. కాని నువ్వెన్నడు ఆ చిరునవ్వును చెరగనీయకు. మనోనిబ్బరాన్ని పోనీయకు. అప్పుడే ఈ జీవిత సమరంలో నేలకూలక నిలబడగల్గుతావు." ఆ తండ్రి మాటలే ఆమెకు గీతబోధ. ఆమె జీవితాన్ని కూడ ఆ విధంగానే తీర్చిదిద్దుకువచ్చింది.

నీరజ ఆ హాస్పటల్‌లో ఓ నర్సు. ఆమె ఆ ఉద్యోగ నిర్వహణలో ఎంతో మనో నిబ్బరంతో ప్రవర్తిస్తుంది ఆ హాస్పటల్‌లో కొందరు జీవితంతో పోరాడి పోరాడి ఓడిపోయి మరణిస్తుంటారు; కొందరు విజయాన్ని సాధించి ఆరోగ్యవంతులై గృహోన్ముఖులౌ తుంటారు.

చావు, బ్రతుకులు రెండింటిని ఆ చిరునవ్వుతోనే గమనిస్తుంటుంది నీరజ ఆమె స్థయిర్యాన్ని చూసి రోగులు ధైర్యాన్ని పొందుతుంటారు. ఆ హాస్పటల్‌లో నీరజ ఓ దీపం లాంటిది.

ఆ హాస్పటల్‌లోని పెద్ద డాక్టరు మధుసూదన రావుగార్కి ఆమెయందు ఎంతో విశ్వాసముంది — ఎంతో గురి ఉంది ముఖ్యమైన కేసులను చూడ డానికి ఆమెనే నియమిస్తుంటాడు అతని క్రింద మరో ముగ్గురు డాక్టర్లున్నారు ముగ్గురూ యువకులే, ఉత్సాహవంతులే నీరజతోపాటు మరో ఆరుగురు నర్సులు ఆ హాస్పటల్‌లో పనిచేస్తున్నారు. ఆ హాస్పటల్‌లో నాల్గు వార్డులున్నాయి. స్త్రీల విభాగాన్ని డాక్టరు మధుసూదనరావుగారి భార్య డాక్టరు మాణిక్యాంబగారు చూసుకుంటారు.

అది ఒక ప్రయివేటు హాస్పటల్. దానికి అధిపతులు నల్గురు. ఆ ఊరిలోని పేరున్న ధనవంతు లిద్దరు, డాక్టరు మధుసూదనరావుగారు అతని సతీమణి డాక్టరు మాణిక్యాంబగారు కలసి కట్టించేరు ఆ పెద్ద హాస్పటల్‌ని. దానిని నిర్వహించే బాధ్యతంత డాక్టరు మధుసూదనరావుగారిదే అది ఆ ఊరిలో పేరుమోసిన హాస్పటల్. ప్రయివేటు నర్సింగ్ హోముల మాదిరి ముక్కుపిండి అమితంగ డబ్బు వసూలు చేయరు అందుకే ఆ ఊరిలో ప్రజలు చాలమంది అవసరం కల్గినప్పుడు అక్కడికే వెళ్తుంటారు ఆ ఊరికి కొద్దిమైళ్ళ దూరంలో ఓ చిన్న పట్నముంది

ఆ ఊరిలో గవర్నమెంటు హాస్పటల్ లేకపోలేదు ఇద్దరు డాక్టర్లు, నల్గురు నర్సులున్న చిన్న గవర్న మెంటు హాస్పటల్ అది. ఆ హాస్పటల్‌లో చేరిన పేషంట్లను సరిగా చూడరని ఓ పుకారు లేకపోలేదు. ఆ హాస్పటల్‌లోని పేషంటుని చూడడానికి వెళ్ళిన వాడు ఆ హాస్పటల్ అశుభ్రతకు తప్పకుండ తనో రోగి అవుతాడన్న భయం లేకపోలేదు అందుకే ఆ ఊరులోని కొందరు తప్ప అందరు ఆ గవర్నమెంటు హాస్పిటల్‌కి పోరు

ఆ నర్సింగు హోమ్‌కి డాక్టరు మధుసూదనరావు తన కూతురు సుజాత పేరు పెట్టేడు అతనికి

చలనచిత్ర పరిశ్రమకి ఆశాజనకం!



ఏ ప్రభుత్వోద్యోగమో చేస్తూండవలసిన వ్యక్తి — కళా తపస్విగా చిత్రజగతికి గర్వకారణమై, నేడు "రామరాజ్య" నిర్మాణానికి నడుం కట్టిన నేతగా తెలుగుజాతి వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేసే కర్మవీరుడయ్యారు.

ఆ రోజు నా కిప్పటికీ జ్ఞాపకముంటుంది .., అది 1981 మే 28. ఊటీలోని ఒక టీ ఎస్టేట్‌లో "సర్దార్ పాపారాయుడు" చిత్రం షూటింగ్ జరుగుతోంది ... మధ్యాహ్నం ఒంటిగంట దాటినా — ఎముకలు కొరికే చలి. లంచ్ బ్రేక్ సమయంలో ఎన్. టి. ఆర్. తన షష్ట్యబ్ది సంవత్సరంలో ఒక మహోన్నతమైన నిర్ణయాన్ని తీసుకొనదలచినట్లు ఆనాడే తొలిసారిగా ప్రకటించారు: "ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయరంగంలో నా అవసరం ఎంతైనా ఉందని—ఎందరో ఆత్మీయులూ, అభిమానులూ, హితైషులూ - అసంఖ్యాక లేఖల ద్వారా, టెలిగ్రామ్‌ల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నారు. అంతా దైవ నిర్ణయం. ఇంతకాలం నా గురించి శ్రమించాను, శేష జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయదలిచాను. ప్రజాశ్రేయస్సే పరమావధి."

1982 మార్చి 29న "తెలుగుదేశం" ఆవిర్భవించింది.

రోజుకు 20 గంటల చొప్పున తన ప్రత్యేక ప్రచార రథంలో 35 వేల కిలోమీటర్లకుపైగా పర్యటించి, కోటిన్నర మందికి 'తెలుగు దేశం' మహదాశయాలను వివరించి, నిద్రాణంగా ఉన్న తెలుగుజాతిని జాగృతమొనర్చే కర్తవ్య నిర్వహణలో— రికార్డును సృష్టించారు.

అత్యల్పకాలంలోనే అత్యధిక మెజారిటీతో అఖండ విజయాన్ని సాధించి, నవమాసాల 'తెలుగు దేశం' చేత నలుమూలలా నవహాసాలు అందించారు.

ఆ రోజు మద్రాసులోని పలు స్టూడియోలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. బాణాసంచా ప్రేల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు.

చలన చిత్ర పరిశ్రమకు చెందిన వారెందరో తమ హర్షాతిరేకాన్ని పలువిధాల ప్రకటించారు : ...

"కొత్త సంవత్సరంలో ఒక సుస్థిరమైన, పటిష్టమైన కొత్త ప్రభుత్వం ఏర్పడడం ఎంతైనా హర్షనీయం ... ఇదొక శుభసూచకం !"

"తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఏమేం కావాలో, ఏం చేయాలో, ఎంత చేయాలో, ఎలా చేయాలో తెలిసిన నిష్ణాతుడి ఘన విజయం చిత్ర పరిశ్రమకు ఆశాజనకం."

"ప్రజా వ్యతిరేక విధానాలు, కుటిల నైతిక రాజకీయ అవినీతికి విసుగు చెందిన ఓటర్లు — తమ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలిగి, తమ ఆశయాలకు — భావాలకు దగ్గరగా ఉండే నిజాయితీ గల ప్రభుత్వం కోసం, కొత్త మార్గాల కోసం ఎదురుచూస్తూ వచ్చారు. ఇదివరకటి పాలక ప్రభుత్వంపై విశ్వాసాన్ని కోల్పోయిన మన ఓటర్లు— శ్రీ ఎన్. టి. ఆర్. రాజకీయరంగంలోనూ తన ప్రముఖ పాత్రను ప్రతిభావంతంగా పోషించక పోతారా — అని ఒక అవకాశాన్నిచ్చారు. 'తెలుగు దేశం' ఘన విజయానికి ఇదే హేతువు. ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చడంపైన, అవలంభించే పద్ధతులమీద 'తెలుగుదేశం' భవితవ్యం ఆధారపడి ఉంది."

"కీర్తి ప్రతిష్ఠలు ఆయనలో ఏ అతిశయాన్నీ కలిగించలేదు. ఆయన చేపట్టే ప్రతి ఒక్క కార్యాన్నీ మహాయజ్ఞంగా భావించి పవిత్ర హృదయంతో చేస్తారు గనుకే విజయం ఆయన్నెప్పుడూ వరిస్తూంటుంది."

ఆయన గురించి ఆయన శ్రీమతి బసవరామ తారకమ్మగారు "వారి ఘన విజయం నాకేమాత్రం విస్మయాన్ని కలిగించలేదు. వారు అనుకున్నది సాధించి తీరుతారు. అపజయమన్నది ఎన్నడూ ఎరుగరు" అన్నారు.

శ్రీ ఎన్.టి.ఆర్. జీవితం చరితార్థమైంది. అయినా, ఆయన జైత్రయాత్ర అనంతమైనది. ఆయన ఇంకా ఎన్ని ఘన విజయాలు సాధించాలో ఊహించలేం. ఇటుపైన ఇంతకు రెండింతలు కృషి చేయడానికి, ఇంతకు రెండింతలు కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించడానికి ఆయనకు మరింత శక్తినీ, ఆయురారోగ్యాలనూ ఆ ఏడుకొండలస్వామి ప్రసాదించుగాక!

[జి. వి. జి.]

"రాజస్థాన్ రౌడీలు"

"ఢిల్లీ, రాజస్థాన్, బికనీర్, నైనిటాల్‌లో భారీ ఎత్తున చిత్రీకరించబడిన ఓ మలయాళ చిత్రాన్ని చూశాను దాన్ని తెలుగులో పునర్నిర్మించాలంటే రెట్టింపు ఖర్చవుతుందన్న కారణంగా తెలుగులో డబ్ చేయడానికి హక్కులు కొన్నాను,' అన్నారు నిర్మాత ఎన్. గోపాలకృష్ణ. ఈయన లోగడ పలు తెలుగు చిత్రాలకు దర్శకత్వం నెఱపిన విషయం అందరికీ తెలిసిందే ఈయన సరోజినీ ఆర్ట్స్ పతాకంలో తయారు చేసే పై చిత్రంలో ప్రేమనజీర్, బాలన్ కె నాయర్, సుకుమార్, రవీందర్, సీమ, శ్రీవిద్య, స్వప్న, రాణి పద్మిని, హిందీ నాట్యతార కోమిల్లా విర్క్ పాల్గొన్నారు. వేటూరి మాటలు, పాటలు రాశారు శంకర్—గణేశ్ సంగీత దర్శకులు దాశరధి సంకలనకర్త, పి. జి విశ్వంభరన్ దర్శకుడు

"ప్రేమజ్వాల"లో ఒక దృశ్యం ➔



సినిమా

విజయబాపినీడు నేతృత్వంలో మగ మహారాజు

"వినోదం, విజ్ఞానంతోపాటు మధ్య తరగతి కుటుంబాలకేకాక అన్ని తరగతుల కుటుంబాలకూ ఓ చక్కని సందేశాన్నిచ్చే ఇతివృత్తం ఎక్కడా రాజీ పడకుండా విశిష్టంగా తీర్చిద్దిద్దాలని మా తపన. అందుకే ఇదివరకు నా నిర్మాణతలో తయారైన చిత్రాలన్నీ ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేసుకుంటే, ఈ చిత్రం మాత్రం కథ దృష్ట్యా మూడు షెడ్యూల్స్‌లో ప్లాన్ చేయక తప్పింది కాదు," అన్నారు విజయబాపినీడు. ఈయన గతంలో దుర్గా నాగేశ్వరరావు, రాజాచంద్ర, జి. రామమోహన రావు, మౌళి లాంటి దిగ్దర్శకులకు తొలి అవకాశ మిచ్చిన విషయం సర్వవిదితమే. అలాగే ఈ శ్యామ్ ప్రసాద్ ఆర్ట్స "మగ మహారాజు" చిత్రం ద్వారా మరో 'చిరుదీపం'ను పరిచయం చేస్తున్నట్లు నిర్మాత మాగంటి రవీంద్రనాథ్ చౌదరి తెలిపారు. డిసెంబర్ 22న తొలిగీతం ధ్వనిముద్రితమైంది "మధ్య తరగతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ కష్టపడాలని, పేరుప్రతిష్టలు తేవాలని, సమైక్యతగా ఉండాలని ఆశించడం సహజం. కాని, పాతకాలపు పద్ధతులతో నలిగిపోయే ఇలాంటి కుటుంబాలలో పనిచేయడం కొందరికి న్యూనతగా ఉంటుంది. మరి కొందరికి అది సాధ్యపడదు. అసాధ్యాన్ని సాధ్యమయ్యేలా చేసి 'మగ మహారాజు' అనిపించుకుంటాడు మా హీరో చిరంజీవి," అన్నారు బాపినీడు. చిరంజీవికి తోడుగా సుహాసిని నటిస్తుంది. రావు గోపాలరావు, నూతన్ ప్రసాద్, బాలాజీ, నిర్మల, జయమాలిని ఇతర పాత్రధారులు. ఆకెళ్ళ కథకు కాశీ విశ్వనాథ్ సంభాషణలు రాశారు. కృష – చక్ర స్వరకల్పనలో వేటూరి, ఉత్పల గీతాలు రాశారు. రఘు ఛాయ, సూరపనేని కళాధర్ శిల్పం, సత్యం కూర్పుతో మధుసూదనరావు, శాయి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. జనవరి 5న షూటింగ్ మొదలైంది.



'కోడలు కావాలి'లో పూర్ణిమ, సుమన్

'స్నేహాభిషేకం'లో శ్రీప్రియ



అన్నపూర్ణ స్టూడియోస్ 6వ చిత్రం

శ్రీమతి అక్కినేని అన్నపూర్ణ సమర్పించే కొత్తచిత్రం ఫిబ్రవరి, మార్చి, జూలై నెలల్లో 1–10 తేదీలమధ్య షూటింగ్ జరుపుకొని; మూడు షెడూల్లో పూర్తవుతుంది. ఎ. ఎన్. ఆర్. శ్రీదేవి, చంద్రమోహన్, విజయశాంతి, సత్యనారాయణ, నాగేష్, పుష్పలత వగైరా తారాగణం. డి. వి. నరసరాజు రచన, చక్రవర్తి సంగీతం, భాస్కరరాజు శిల్పంతో ఎ. కోదండరామిరెడ్డి దర్శకుడు; వెంకట్ అక్కినేని, నాగార్జున అక్కినేని నిర్మించే ఈ చిత్రానికి కొడాలి ఆంజనేయ చౌదరి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.


రాజు — రాణి — జాకి

ఉన్నదున్నట్లు ముక్కుకు సూటిగా మాట్లాడే చిత్ర నిర్మాతలలో నవతా కృష్ణంరాజు తర్వాతే ఎవరైనా. "సంసార పక్షంగా, సెన్సారు పక్షంగా ఉండే చిత్రాలు నిర్మించడమే నా ధ్యేయం. అందుకే నా చిత్రాలలో లెంపకాయ మించిన వయొలెన్స్ ఉండదు. దాదాపు నేను తీసిన చిత్రాలన్నిటిలో ఒక పాత్రను మరో పాత్ర లెంపకాయ వేసే సంఘటన లున్నాయి — ఒక్క 'త్యాగయ్య' లో తప్ప. అందుకేనేమో 'త్యాగయ్య' చిత్రం నాకు లెంపకాయ వేసింది!" అన్నారు కృష్ణంరాజు నవ్వుతూ. ఈయన నవత ఆర్ట్స్ పతాకంలో నిర్మించే "రాజు — రాణి — జాకి" చిత్రానికి జనవరి 7 నుంచి పది రోజులపాటు ఊటీలో పాటలను చంద్రమోహన్, రాధిక, రంగనాథ్, దీప మీద చిత్రీకరించారు. కె.ఎ. అబ్బాస్ హిందీ చిత్రం "అన్హోనీ"లో నర్గిస్ ధరించిన రెండు విభిన్నమైన పాత్రలను పోలినటువంటివి రాధిక ఇందులో నిర్వహిస్తోంది. గొల్లపూడి

'రెండుజెళ్ల సీత'లో నరేష్, మహాలక్ష్మి



మారుతీరావు, సుత్తివేలు, సత్తిబాబు, శ్రీలక్ష్మి, జయభాస్కర్ తక్కిన నటవర్గం. గొల్లపూడి మాటలు, వేటూరి పాటలు రాశారు. రాజన్ — నాగేంద్ర సంగీతం, కళాధర్ శిల్పం, లోక్‌సింగ్ ఛాయ, గౌతమ్‌రాజు కూర్పులో నిర్వహణ బాధ్యతలు వహించే ఎస్. అచ్యుతరామరాజు "ఫిబ్రవరిలో జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నెఱపే సింగీతం శ్రీనివాసరావు "కొన్ని సమయాలలో ఎంతో గొప్పవారు కూడా తప్పు చెయ్యకతప్పదు. ఆ తప్పుయొక్క ఫలితం యువతరంమీద ప్రసరించక తప్పదు ... మనిషి వ్యక్తిత్వాన్ని హిమాలయ శృంగాలకు తీసుకు వెళ్లటానికి కారణం ఆ వ్యక్తియొక్క జన్మ ఔన్నత్యమా — లేక ఉదాత్తమైన పెంపకమా?— అనే సున్నితమైన ఇతివృత్తాన్ని అనూహ్యమైన మలుపులతో చిత్రీకరించాం," అన్నారు.



'దేశానికొక్కడు'లో రజనీకాంత్, మాధవి

దాసరి రచన, దర్శకత్వం, నిర్మాణంలో "ముందు తరానికి మూడు మాటలు"

"నాగేశ్వరరావుగారు మా చిత్రంలో అయ్యప్ప స్వామి భక్తుడుగా ఒక విలక్షణమైన పాత్రను పోషిస్తారు. 'దేవదాసు, బాటసారి, ప్రేమాభిషేకం, మేఘసందేశం' చిత్రాలలోని ఆయన పాత్రలకు సాటియైనది ఈ పాత్ర. ఆయన— సుజాత ఒక జంట... మురళీమోహన్ — దీప, ప్రతాప్‌పోతన్ — సుహాసిని, శరత్‌బాబు — ఒక అమెరికన్ వనిత, గుమ్మడి — అంజలీదేవి, నేను—రమాప్రభ...ఈ జంటలతోపాటు రాంజీ, రాంబాబు, హరిప్రసాద్, ఈశ్వరరావు, బాలాజీ, వంకాయల, ఏలేశ్వరపు రంగా, బౌనా, శ్రీగీత, త్రివేణి, సుధారాణి, దేవి పాల్గొంటారు," అని తెలియజేశారు దాసరి నారాయణరావు. ఈయన రచన, దర్శకత్వ బాధ్యతలు వహిస్తూ నిర్మించే పై తారకప్రభు ఫిలిమ్స్ అయిదవ చిత్రానికి జనవరి మొదటి తేదీన తొలి గీతం రికార్డయింది. ఈ భక్తి గీతంతోపాటు ఈ చిత్రంలోని గీతాలన్నిటినీ ఈయనే రాస్తున్నారు. రమేష్‌నాయుడు సంగీత దర్శకుడు, వి. ఎస్. ఆర్. స్వామి ఛాయ, భాస్కరరాజు శిల్పం, కృష్ణ కూర్పు, రమణబాబు సహదర్శకత్వం, రాజేంద్రప్రసాద్ సహకార దర్శకత్వం, బసవయ్య — స్వామి నిర్వహణలో శ్రీమతి దాసరి పద్మ సమర్పిస్తారీ చిత్రాన్ని. అన్నపూర్ణ స్టూడియోలో జనవరి — ఫిబ్రవరి నెలల్లో 15వ తేదీ నుంచి నెలాఖరు వరకు షూటింగ్ జరుగుతుంది. ఏప్రిల్ 14న ఉగాది కానుక.

'అమాయక చక్రవర్తి'లో విజయశాంతి, జయమాలిని, చంద్రమోహన్, గోకిన రామారావు.




దాసరి చిత్రాలు

ఈ ఏడు, వచ్చే ఏడు కూడా దాసరి ఎంత బిజీగా ఉంటారో ఆయన అంగీకరించిన ఈ క్రింది సంస్థల చిత్రాలు తెలియజేస్తాయి.

★ కృష్ణంరాజు హీరోగా కె. మురారి నిర్మించే యువచిత్ర వారి కొత్త చిత్రం, యు. సూర్య నారాయణరాజు నిర్మించే గోపీకృష్ణా మూవీస్ చిత్రం.

★ తెలుగు చిత్ర అధినేత రామినేని సాంబశివరావు తయారుచేసే "పోలీసెంకటసామి" చిత్రంలో దాసరితోపాటు సిల్క్‌స్మిత నటిస్తుంది.

'మా ఇంటి ప్రేమాయణం'లో చిరంజీవి



సినిమా

★ కె. రామలక్ష్మి నిర్మించే "పొద్దు తిరుగుడు పువ్వు" కొత్త తారాగణంతో రూపొందుతుంది.

★ భారీ ఎత్తున క్రాంతికుమార్ నిర్మించే "గోనగన్నారెడ్డి" చిత్రంలో కృష్ణంరాజు హీరో.

★ కృష్ణ, కృష్ణంరాజు నాయకులుగా విజయలక్ష్మి ఆర్ట్‌పిక్చర్స్ అధినేత టి. త్రివిక్రమరావు ఓ చిత్రాన్ని ప్రారంభిస్తారు.

★ కొడాలి బోసుబాబు నిర్మించే వీరరాణి ఎంటర్‌ప్రైజెస్ చిత్రం, దాసరి సహదర్శకుడు సూరపనేని రాధాకృష్ణ నిర్మించే లక్ష్మీచిత్ర వారి చిత్రంలో ఎ. ఎన్. ఆర్. హీరో.

★ తారకప్రభు ఫిలిమ్స్ "చింతామణి"లో దాసరి 'సుబ్బిశెట్టి' పాత్ర ధరిస్తారు.

★ "కేటుగాడు" అనంతరం వెంకటరావు నిర్మించే చిత్రం, ప్రగతి చిత్ర అధినేత చలపతిరావు చిత్రం, జితేంద్ర నిర్మించే హిందీ "సర్దార్ పాపారాయుడు," తుత్తాని ఫిలిమ్స్ హిందీ చిత్రం "పద్మశ్రీ రంజిత్‌కుమార్" వగైరా చిత్రాలు ఇంకా ఎన్నో ఉన్నాయి.

క్రాంతి చిత్ర అయిదవ చిత్రం

"చిరంజీవికి ఇది కాస్ట్లీ చిత్రం. ఫ్యూడల్ వ్యవస్థపై నాయకుని వీరోచిత పోరాటం — చిత్ర కథాంశం. ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతినిధిగా రావు గోపాలరావుది మరో మరపురాని పాత్ర. రాధిక నాయిక. ఇంకా గొల్లపూడి, జగ్గయ్య, పుష్పలత, అన్నపూర్ణ ఆదిగాగలవారుంటారు," అన్నారు నిర్మాత క్రాంతికుమార్. సత్యానంద్ మాటలు, వేటూరి పాటలు, చక్రవర్తి సంగీతం, వెంకట్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, కె. ఎల్. ఎన్. శాస్త్రి నిర్వహణ బాధ్యతలు వహించే ఈ చిత్రానికి దర్శకుడు ఎ. కోదండరామిరెడ్డి. "జనవరి మొదటి వారంలో పాటలన్నీ రికార్డయ్యాయి. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఏకబిగిన షూటింగ్ పూర్తయిపోతుంది," అని నిర్మాత తెలియజేశారు.

"కిరాయి బొమ్మలు"

"కల్లాకపటం తెలియని కన్నెపిల్లల జీవితాలను కాలరాచే కాముకులకు కనువిప్పు కలిగించే చిత్రం. రాజమండ్రి ప్రాంతాలలో షూటింగ్ జరిపాం. ఫిబ్రవరిలో విడుదల చేయాలనుకుంటున్నాం," అని స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించిన కటికనేని మధుసూదనరావు తెలిపారు. మయూర్ ఎంటర్‌ప్రైజెస్‌వారి పై తొలి చిత్రంలో జయంతి, ప్రభ, గీత, సురేష్, రామకృష్ణ, జీవా, రాళ్ళపల్లి, వంకాయల సత్యనారాయణ, కాంచన, జయవిజయ, కల్పనారాయ్, పండరీబాయి పాత్రధారులు. పెండ్యాల స్వరకల్పనలో శ్రీశ్రీ., సి. నారాయణరెడ్డి, వై. రామకృష్ణ గీతాలు రాశారు. సి. దశరథరాం ఛాయ, పి. సి. మోహన్ కూర్పుతో శ్రీమతి కె. రూపకళ నిర్మాత.



'ముద్దుల మొగుడు'లో శ్రీదేవి

చలం సమర్పించే

"పెళ్ళిచేసి చూపిస్తాం"

"తమిళంలో హిట్ అయిన కె. బాలచందర్ చిత్రం 'మణల్ కయిర్' అంతకుముందు నాటకంగా వందలాది ప్రదర్శన లివ్వబడింది. మన ఔత్సాహిక రంగస్థల కళాకారులు నాటకంగా ప్రదర్శించడానికి వీలుగా త్వరలో విడుదలయ్యే మా 'పెళ్ళిచేసి చూపిస్తాం' చిత్రం వెండితెర నవల ముందుగా విడుదలవుతుంది. మా 'శ్రీరమణచిత్ర కంబైన్స్' నాగార్జున నగర్, మద్రాసు 23 (ఫోన్ నెంబర్ 424493) అనుమతి తీసుకొని, ఎవరైనా ప్రదర్శించవచ్చు," అన్నారు నటుడు చలం. ఈయన సమర్పించే 'పెళ్ళిచేసి చూపిస్తాం' చిత్రం షూటింగ్ మొత్తం తిరుపతి పరిసరాలలో పూర్తయింది. సత్యనారాయణ ఒక అపూర్వమైన పాత్రను పోషించారు. చంద్రమోహన్, అల్లురామలింగయ్య, నారాయణ రావు, రాజేంద్రప్రసాద్, విజయశాంతి, రమాప్రభ, శుభ, జానకి తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణ రాజా రచనతోపాటు సంగీత దర్శకత్వమూ వహించారు. రంగా ఛాయ, సోమనాథ్ శిల్పం, రవి కూర్పులో ఎం. ఎ. రెడ్డి, బాబూరావు నిర్వహణ బాధ్యతలు వహించారు. ఎన్. ఎ. పెండ్యాల దర్శకుడు. ఈ చిత్రాన్ని చూసి, దీని తదుపరి భాగం "నారద నాయుడు" కథను ఊహించి ఎవరైనారాసి పంపిస్తే, బాగున్న కథను ఎన్నుకొని, తదుపరి చిత్ర నిర్మాణానికి ఉపక్రమిస్తామని ఈ చిత్ర నిర్మాత కోరాడు హరీష్ తెలియజేశారు.



'ఊరంతా సంక్రాంతి'లో

కృష్ణ, రాజసులోచన, సత్యనారాయణ

సినిమా




'కుంకుమతిలకం'లో

జయసుధ, మురళీమోహన్

విఠలాచార్య సోషియో డిటెక్టివ్ చిత్రం "నవమోహిని"

"ఫిబ్రవరిలో పాటల రికార్డింగ్, మార్చి నుంచి షూటింగ్," అన్నారు విఠల్ ప్రొడక్షన్స్ అధినేత డైరెక్టర్ బి. విఠలాచార్య. "నవమోహిని" చిత్రానికి కర్పూరపు ఆంజనేయులు మాటలు, సి. నారాయణ రెడ్డి గీతాలు రాస్తున్నారు. పార్థసారధి సంగీత దర్శకుడు. హెచ్. ఎస్. వేణు ఛాయాగ్రాహకుడు. త్వరలోనే నటీనటుల ఎన్నిక జరుగుతుంది. ★



నెగెటివ్ రైట్స్ కంట్రోల్డ్ బై: శ్రీభ్రమరాంబికా ఫిలిమ్స్, హైదరాబాదు;
ఆంధ్ర: శ్రీసాయికంబైన్స్ * నైజాం: శ్రీసాయికృష్ణ సీడెడ్: వి.యం.సి.

నీలాకాశం

సీరియల్ — శ్యామల

(గత సంచిక తరువాయి)

అలా ఎంత దూరం పరధ్యానంగా నడుస్తూ వెళ్ళిందో ఇందిరకే తెలియదు. పైనించి పడుతున్న వర్షం గుర్తింపనేలేదు. ఎదురుగా వస్తున్న స్కూటర్ కనబడనేలేదు. దాని హారన్ వినబడనేలేదు

సడెన్ బ్రేక్‌తో ఆగింది స్కూటర్. దాని హాండిల్ బార్ తగిలి రోడ్డుపైన కూలబడిపోయింది ఇందిర

స్కూటర్ బాలన్స్ చేయటానికి అవస్థపడుతూ చివరికి ఆపాడు సుధాకర్ "బుద్ధిలేదా, ఏమిటా నడవటం ?" మండిపడుతూ దిగాడు

అయోమయంగా ఉన్నది ఇందిరకు కళ్ళు విప్పార్చి అతనివైపు చూసింది తను ఎక్కడున్నది అసలు ? ఇతను ఎక్కడినించి ఊడిపడ్డాడు ?

"లేవకుండా అలా కూర్చుండిపోయావేమిటి ? ఫ్రాక్చర్ కాలేదు కదా !" చేయిపట్టి లేవదీశాడు.

"అసలు రోడ్డుమధ్యలో ఆ నడవటం ఏమిటి ? హారన్ వేస్తున్నా తప్పుకోలేదేం ?" విసుక్కుంటూ ఆమె ముఖంలోకి చూశాడు పది లంఖణాలు చేసినట్లు వడలిపోయి ఉంది

"ఏమిటలా ఉన్నావు ? వర్షంలో ఎక్కడికి వెళ్తున్నావు ?"

ఇందిర అప్పటికీ ఏం మాట్లాడలేదు

"ఇది స్కూటర్ కనక సరిపోయింది ఏ కారో అయి ఉంటే ఏమయి ఉండేది " ఆ ఊహకే అతనికి ఒళ్ళు జల్లుమంది. కోపం జారిపోగా, "ఏమయింది ఇందిరా ? అంత పరధ్యానం దేనికి ?" మృదువుగా అడిగాడు

"సారీ ఏదో ఆలోచనలో ఉండిపోయాను" తడబడుతూ అంది

"అసలు ఇక్కడికి ఎందుకు వచ్చావు ?"

చుట్టూ కలయజూసింది ఇందిర. తను ఎక్కడున్నదీ అర్థమవలేదు.

"ఇది ఏ రోడ్డు ? నేను ఎక్కడున్నాను ?" తనలో తను అనుకుంటున్నట్లు అంది.

"ఎక్కడున్నావో కూడా తెలియకుండా ఇంత దూరం వచ్చావన్న మాట !" విస్మయంగా ఉన్నది అతనికి

"పద్మ, ఉష, అంకుల్ అందరూ ఏరీ ?"

"వాళ్ళందరినీ రాత్రి భోజనాలకు ఉండమని బలవంతం చేస్తే అక్కడే ఉండిపోయారు ఈ విషయం నీకు చెప్పి, సాయంత్రం క్లినిక్ చూసుకొని పోదామని నేను వస్తున్నాను "

వర్షం ఎక్కువయింది "నేను వెళ్తాను !" అని వెనక్కి తిరిగింది ఇందిర.

"వెళ్ళటమేమిటి ? ఆగు !" అని చేయి పట్టుకొని చూశాడు "ఇంకా జ్వరం ఉంది ! ప్రొద్దున జ్వరంగా ఉన్నదని అందరితో కలిసి రాలేదు ఇప్పుడు ఇలా తిరుగుతున్నావు ఏదో జరిగింది !"

వానకు ఇందిర చీరంతా తడిసింది క్రింద పడటంవలన బురద కూడా అయింది ఒళ్ళంతా నెప్పులుగా, నీరసంగా ఉంది ఇంటికి వెళ్ళాలని తప్ప మరే ఆలోచనాలేదు ఇందిర మనసులో ప్రస్తుతం "నేను వెళ్ళాలి" అని వెళ్ళబోయింది.

"ఇందిరా, నీవు ఇప్పుడు నా యింటి దగ్గర ఉన్నావు. రెండు మైళ్ళు నడిస్తేకాని మీ యిల్లు రాలేదు. మా యింట్లోకి పద" నెమ్మదిగా చెప్పాడు అతను.

"ప్లీజ్, నన్ను వెళ్ళనివ్వండి !" చిరాకు, ఏడుపు కూడా ముంచుకు వస్తున్నాయి ఇందిరకి

"ఏమిటా పట్టుదల ? జ్వరంగా, నీరసంగా, ఇలా తడిసిపోయి ఉన్న నిన్ను రోడ్డుమీద వదిలిపెట్టి ఎలా వెళ్ళగలను ? అదిగో, ఆ మలుపు ప్రక్కనే మా యిల్లు — పద !"

"రాను ! మీరు వెళ్ళండి !" మధు చేసిన అవమానంతో శరీరం భగభగ మండుతున్నట్లే ఉంది "ఎంతకీ వదిలి పెట్టడేం ఇతను ?"

"ఇందిరా, స్నేహితుడిగా చెపుతున్నాను విను ! నీవు ఏ దోవలోనో ఫెయింట్ అవుతావు, అప్పుడెలా ? కాస్త వాన తగ్గగానే స్కూటర్‌మీద తీసుకెళ్ళి దింపుతాను నా మాట విను ఇప్పుడే దింపాలంటే వాన ఎక్కువయింది చూడు ! మీ ఇంట్లో కూడా నిన్ను చూసుకోవటానికి ఎవరూ లేరు !"

స్నేహితుడు ! స్నేహానికి విలువ తెలిస్తే కదా ఈ పురుషులకి !? మధు ఏం చేశాడు ? పెళ్ళి ప్రసక్తి వదులుకుంటే పోనీ, తనను కలుసుకొని, మాట్లాడి, మనసులో మాట ఇది — అనయినా చెప్పాడా ? సమస్యలలో ఉన్న తనను అలా వదిలేసి ఊరుకున్నాడే, స్నేహానికి ఏం విలువ యిచ్చాడు !? మనసంతా కసిగా అనిపించింది దూరాన ఉన్న మధుపైన చూపించలేని కోపం ఎదురుగా ఉన్న సుధాకర్‌పై ప్రసరించింది

"నాకు స్నేహితులంటూ ఎవ్వరూ లేరు !" 'ఎవ్వరూ' అన్న మాటను గట్టిగా నొక్కిపడుతూ అంది

దెబ్బతిన్నట్లు చూశాడు సుధాకర్ రెప్పపాటు కాలంలో స్వరం కటువుగా మారిపోయింది "స్నేహితుడిగా కాదు ! డాక్టరుగా ఓ వ్యక్తిని ఇలా వదిలిపెట్టి వెళ్ళలేను — సరేనా ? నేనూ తడిసి పోతున్నాను, కనబడటంలేదా ?" చేయి పట్టుకున్నాడు, బలవంతంగానయినా తీసుకువెళ్తానన్నట్లు

ఆ స్పర్శకు ఇందిరకు ఒళ్ళంతా జలదరించినట్లే అయింది ఇతనికి తనపైన ఈ శ్రద్ధ ఏమిటి ? సడెన్‌గా దుఃఖం, కోపం అన్నీ మాయమయి, విపరీతమైన నిస్సత్తువ ఆవరించింది అతనివెంటే నడిచింది, మరేమీ వాదించకుండా

తాళం తీసి లోనికి వెళ్ళాక, ఇందిరను ప్రక్క గదిలోకి తీసుకువెళ్ళాడు బీరువాలోనించి ఒక చీర తీసి "ముందు బట్టలు మార్చుకోండి, పూర్తిగా తడిసిపోయారు" అన్నాడు

ఆ గులాబీరంగు ఫుల్ వాయిల్ చీరను ఆశ్చర్యంగా చూసింది ఇందిర

జరిగిన కథ — 15 సినిమా చూసి స్కూటర్‌మీద వస్తూ యాక్సిడెంట్‌లో మరణిస్తారు ఇందిర తల్లిదండ్రులు తన తమ్ముళ్ళ, చెల్లి భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఉద్యోగంలో చేరాలనుకుంటుంది ఇందిర. డాక్టర్ జాక్సన్‌తో ఇందిరకు పరిచయం కల్గుతుంది. తన దగ్గర టైపిస్ట్‌గా జేరమని జాక్సన్ ఇందిరను ఆహ్వానిస్తాడు పరీక్షలవగానే చెల్లిని తీసుకురమ్మని తమ్ముళ్ళకి చెప్పి తను ముందుగా వస్తుంది ఇందిర పట్నంలో పెరిగిన ఇందిరకు ఆ పల్లెటూరి వాతావరణం, అక్కడి మనుష్యుల మనస్తత్వాలు నచ్చుతాయి ఉషని తీసుకువచ్చి దించి వెళతాడు సురేష్. పల్లెటూర్లలోని మనుషుల మనస్తత్వాలు ఎలా వుంటాయో, మూఢనమ్మకాలు వాళ్ళలో ఏ విధంగా పాతుకుపోయాయో తెలియజేయటానికి డాక్టర్ అరుణకు, ఇందిరకు గతంలో జరిగిన ఓ సంఘటన వివరిస్తాడు డా॥ జాక్సన్ ఇందిరకు పద్మ తన కథను వివరిస్తుంటుంది బావ ప్రసాద్‌తో తన పెళ్ళి ఇంకా రెండురోజులుండనగా అతని కాలికి ఫ్రాక్చరయి హాస్పటల్‌లో జేరతాడు పద్మ నష్టజాతకురాలని, ఆమె మూలంగానే తన కొడుక్కి ఈ విధంగా జరుగుతోందన్న మూఢనమ్మకంతో వారిద్దరి పెళ్ళి జరగకుండా చేస్తుంది ప్రసాద్ తల్లి రమేష్ రాకకోసం ఎదురు చూస్తుంటారు ఇందిర, ఉష. ఇందిరకు సుధాకర్ తన ప్రేమ కథ వివరిస్తుంటాడు కొన్ని కారణాలవల్ల సుందరి సుధాకర్‌ను వదులుకొంటుంది మధు తనని కాకుండా వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకుంటున్నాడని తెలుసుకొన్న ఇందిర మనసు గాయపడుతుంది.

అతను వచ్చి "బ్రహ్మచారి యింట్లో చీరలు ఏమిటని చూస్తున్నారా? ఒకప్పుడు సుందరి కోసం కొన్నాను. కాని తనకు ఇచ్చే లోపలే పరిస్థితులు తారుమారయినాయి. తల కూడా బాగా తుడుచుకోండి" అని ఒక టవల్ యిచ్చి వెళ్ళిపోయాడు.

ఇందిర తడిచీర విప్పి ఆ కొత్తచీర కట్టుకుంది. జడవిప్పి, టవల్‌తో తుడుచుకుంటూ వచ్చి హాల్లోని కుర్చీలో కూర్చుంది తల నెప్పిగా ఉంది. నీరసంగానూ ఉంది. ఎదురుగా ఉన్న కిటికీలోనించి బయటకు చూస్తే దారాపాతంగా కురుస్తున్న వర్షం కనిపిస్తున్నది తల వెనక్కువాల్చి కళ్ళుమూసుకుంది కళ్ళముందు అక్షరాలు కనిపించినట్లే అయినాయి—

వరుడు : చి. మధుసూదనరావు

వధువు : చి. సౌ. స్వర్ణలత

తనకు అనుకోకుండా తెలిసింది. తెలియకుండా మధు వద్దకు వెళ్ళి ఉంటే— ఎంత అవమానంగా ఉండేది?


"ఇందిరా!"

కళ్ళు విప్పి చూచింది. కాఫీ గ్లాసుతో నిలబడి ఉన్నాడు సుధాకర్ ఒక టాబ్లెట్ ఇచ్చి "ముందు ఇది వేసుకొని, కాఫీ త్రాగండి" అన్నాడు

టాబ్లెట్ చేదుగా తగిలింది నోటికి. వేడి కాఫీ త్రాగుతుంటే కాస్త హాయిగా అనిపించింది.

సుధాకర్ ఎదురుగా వున్న మరో కుర్చీలో కూర్చొని, కాఫీ తీసుకుంటున్నాడు. అతను తడి పాంట్, షర్ట్ తీసేసి, తెల్లని పైజమా, తెల్లని లాల్చీ వేసుకున్నాడు. గ్రేస్‌ఫుల్‌గా ఉన్నాడు.

"ఇప్పుడు చెప్పండి! ఎందుకు వానలో తడుస్తూ, దిక్కుతోచని వ్యక్తిలాగా తిరుగు



తున్నారు? అంతటి అవాంతరం ఏం సంభవించింది ?''

అంత స్నేహంగా, ఆప్యాయంగా అతను అడుగుతుంటే, మనసులోని వ్యధను చెప్పుకొని, కరువుతీరా ఏడ్చి, సేద తీరుదామనిపించింది ఇందిరకి.

''మా అమ్మ, నాన్న ఆక్సిడెంట్ లో ఆకస్మాత్తుగా పోవటం మీకు తెలుసు కదూ ?'' చిన్నగా మొదలుపెట్టింది.

''తెలుసు! నీవు పరిస్థితులను ఎంత నిబ్బరంగా, ఎంత ధైర్యంగా ఎదుర్కొంటున్నావో అన్నీ తెలుసు ఇందిరా!'' చిరునవ్వుతో అన్నాడు

అతను అంత మెప్పుకోలుగా మాట్లాడటం ఎన్నడూ వినని ఇందిర ఆశ్చర్యంగా చూసింది. ఒక్కోమారు 'నీవు'అని చనువుగా మాట్లాడుతాడు— ఒక్కోమారు అంత దూరంలో ఉంచి పొడిగా మాట్లాడుతాడు — అనుకుంది

తిరిగి చెప్పటం మొదలుపెట్టింది ''నేను ఉద్యోగం వెతుక్కోవటం, పెళ్ళి వాయిదా వేయటం మధుకి నచ్చలేదు. నాకు తనపట్ల కంటె తమ్ముళ్ళ పైన ప్రేమ ఎక్కువ, అని అభిప్రాయపడ్డాడు మా యింటికి రావటం మానేశాడు నేను ఈ ఊరు వచ్చాక వ్రాసిన ఉత్తరాలకు జవాబయినా ఈయలేదు, కష్టసమయంలో నాకు మరింత దూరమయినాడు''

ఓ నిమిషం ఆపింది, ఇంక చెప్పాలా — వద్దా అని ఆలోచిస్తున్నట్లు తర్వాత మళ్ళీ చెప్పసాగింది

''ఈ రోజు అనుకోకుండా ఒక శుభలేఖ చూశాను అది మధు పెళ్ళిది నా మనసంతా చెదిరిపోయింది. అతను కావాలని ఎంతగా కోరుకున్నానో — అతను పూర్తిగా దూరం అయినాడు —'' ఇప్పుడు బాధగా, బరువుగా ఉన్నది.

కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు సుధాకర్. తర్వాత అన్నాడు, ''నీ కష్ట సమయంలో దూరం అయినాడని, నీ మనసు, ఆశయాలు అర్థం చేసుకోలేదని అంటున్నావు కదా! అతనికి నీవు ఇచ్చే విలువ, అతని పట్ల కల ప్రేమ ఇంతకు ముందే తగ్గిపోలేదూ ?''

''ఏమో నాకు తెలీదు . అతను దూరం కాకుండా, ప్రేమగా ఉంటే బాగుండునని మాత్రం ఎప్పుడూ అనిపించేది. ''

నీలాకాశం

''అనుకోకుండా ఏదయినా జరిగి, నీవు ఉద్యోగం మానేసి, అతన్ని పెళ్ళి చేసుకోగలిగే పరిస్థితులు ఏర్పడినాయి అనుకో — ఇది వరకటిలాగే అంతటి సంతోషంతో, అంతటి ప్రేమతో అతన్ని నీ జీవితంలోకి ఆహ్వానించగలిగే దానివా ? ఆలోచించు ఇందిరా! మనస్సుకి సర్దిచెప్పుకొని పెళ్ళి చేసుకోగలిగే దానివేమో కాని, వెనకటి విశ్వాసం, అనురాగం ఉండేవా ? నిన్ను అర్థం చేసుకొని చేయూత నీయకుండా తప్పుకున్నాడనే కినుక నీలో ఉండదూ ? మన్నించగలవేమోకాని, మరిచిపోలేవు!''

నిజంగా తన మనస్సుని చదివినట్లే చెప్తున్నాడు విస్మయంగా అనుకుంది ఇందిర ప్రొద్దున పెదనాన్న లెటర్ వచ్చినపుడు తను పూర్తిగా అలాగే ఆలోచించింది కదా!

''అతను ఎలాగా దూరమయినాడు ఇప్పుడు అతని పెళ్ళి అని తెలియగానే క్రొత్తగా మారిందేమిటి ? నిన్ను నిజంగా బాధిస్తున్న విషయం ఏమిటో చెప్పనా ? నిన్ను కాదని మరొకరిని చేసుకోవటంతో నీ స్వాభిమానం దెబ్బతిన్నది! అవమానంగా ఫీలవుతున్నావు నీ బాధకు కారణం ఈ అవమానమే కాని, అతని పట్ల అనురాగం కాదు!'' సుధాకర్ అన్నాడు

ఎంత నిర్మొహమాటంగా మాట్లాడుతున్నాడు ఇతను! ''అనురాగంలేదని ఎందు కనుకుంటున్నారు?''

''అంతటి ప్రేమే ఉన్నట్లయితే నీ వాళ్ళను కాదనుకొని అతనికి దగ్గర అయేదానివి ఇందిరా!''

తనదే తప్పలాగా మాట్లాడుతున్నాడు! ఇందిరకి కోపం వచ్చింది ''ఇక్కడ ప్రేమ ప్రసక్తి లేదండీ! నా తమ్ముళ్ళను కాదనుకోవటం జరిగే పనికాదు నేను మధుని అడిగినదయినా రెండేళ్ళ పాటు పెళ్ళి వద్దన్నాను, అంతే ''

బయట వర్షంజోరు ఎక్కువయింది అది మధ్యాహ్న సమయమే అయినా మేఘాలు అలుముకొని, చీకటిగా అనిపిస్తున్నది సుధాకర్ లేచి లైటు స్విచ్ నొక్కాడు

''పోనీ, అతనికయినా గాఢమైన ప్రేమ ఉంటే నీ మాటకు ఒప్పుకోనేవాడు, అవునా? సరిగ్గా నీ మనసు తెలుసుకోవటానికి ప్రయత్నించు ఇందిరా నిన్ను కాదని మరొకరిని పెళ్ళి చేసుకుంటున్న వ్యక్తిని గురించి నీవు ఇంతగా బాధపడవలసిన అవసరం లేదు ఇక్కడ గాయపడింది నీ స్వాభిమానం అని గుర్తించు ''

ఇందిర మాట్లాడకుండా బయటకు చూస్తూ కూర్చుంది.

''పోనీలే యిందిరా, నేను తప్పుగా మాట్లాడానేమో! సారీ, ఏమీ అనుకోకు స్నేహితురాలివనే అభిప్రాయంతో నాకు తోచింది చనువుగా చెప్పాను.''

ఇందిర అప్పటికీ ఏమీ మాట్లాడలేదు దీర్ఘంగా ఆలోచిస్తున్నది సుధాకర్ మాటలన్నీ నిజమే మధు ప్రవర్తనతో అతనిపట్ల తనకున్న ప్రేమ క్రమంగా ఇగిరిపోయింది చేదుగా ఉన్నా ఇది నిజం ఇప్పుడు సుధాకర్ తెలియజెప్పేవరకు తనకు ఆ విషయం తెలియనే లేదు.

సుధాకర్ అన్నాడు ''నేను చెప్పినదంతా తప్పే కావచ్చును. మరిచిపో! అతని పెళ్ళి ఎప్పుడు ?''

''ఆదివారం'' యాంత్రికంగా జవాబిచ్చింది

''ఇందిరా, నేను హైదరాబాదు వెళ్ళివస్తాను మధుని కలుసుకొని, ఇందిర ఈ విధంగా బాధపడుతున్నది అని వివరించి వచ్చజెప్తాను అతను మనసు మార్చుకొని నిన్నే చేసుకునేందుకు ప్రయత్నిస్తాను ''

''మీరా ?'' తెల్లబోయింది

''అవును, ఫ్రెండ్ కోసం ఆ పని చేయలేనా?''

''వెళ్ళి మధుతో నా గురించి రికమండ్ చేస్తానంటారు!''


''ఓ విధంగా అంతే ననుకో.''


''అక్కర్లేదు! అతన్ని దేబిరించవలసిన అవసరం నాకు లేదు. పీటలమీది పెళ్ళి చెడగొడ్తే నాకు ఒరిగేదీ లేదు ప్రేమ అనేది సహజంగా రావాలి కాని, మీరు వెళ్ళి నా గురించి వకాల్తా పుచ్చుకొని తెప్పించగలిగేది కాదు!''

సుధాకర్ నవ్వాడు ''నీలో ఆ మాత్రం స్వాభిమానం ఉండటం నాకు ఆనందంగా ఉంది నీవేమంటావోనని అన్నాను అంతే ''

''అంటే, నిజంగా నా గురించి ఆ పని చేయ రన్నమాట!?''






NESPRAY
INSTANT
NESPRAY
Nestlé
Spray Dried
Milk Powder
enriched with Vitamins A & D
సరికొత్తది! ఇన్‌స్టెంట్ నెస్‌ప్రే
5-క్షణాలలో పాలు
వేయండి, కలపండి, ఇక ఇవ్వండి అంతే
తయారు చేయడం ఎంతో సులభం
ఒక గ్లాసు చల్లని లేక వెచ్చని నీటిలో 3 చెంచాల ఇన్‌స్టెంట్ నెస్‌ప్రే వేయండి. కలపండి 5 క్షణాలలో మీ కోసం ఒక గ్లాసు పాలు సిద్ధంగా వుంటాయి
మంచి పోషకాహారము
ఇన్‌స్టెంట్ నెస్‌ప్రే 'ఏ' మరియు 'డి' విటమిన్లతో ప్రత్యేకమైన శక్తి కలిగి వుంది ఇవి, పెరుగుతున్న పాపలకి విలువైన, మీగడతో వున్న, రుచికరమైన పాలు
చన్నీళ్ళలో కూడా తక్షణం కరుగుతుంది
CAS/243 TEL

"తను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకొమ్మని ఎవరయినా మరొక వ్యక్తిని బ్రతిమలాడుతారా ?"

అర్థం కానట్లు చూసింది ఇందిర

"అవును ఇందిరా! సుందరివలన మనము విరిగిపోయి ఒంటరిగా కాలం గడుపుతున్న నాలో కొత్త ఆశలు చిగిరించావు నీ రాకతో నా జీవితంలో చల్ల గాలులు వీచినట్లే అయింది నా మనసులో తిరిగి స్పందన కలిగించావు పరిస్థితులతో పోరాటం నీ పట్టుదల, నీ ధైర్యం చూసి మెచ్చుకోకుండా ఉండలేకపోయాను స్త్రీలంతా విశ్వాసరహితులు అనే నా అభిప్రాయం మార్చేశావు పెళ్ళంటే విరక్తి పెంచుకున్న నాలో తిరిగి ఆశలు రేపావు .. కాని నీ మనస్సు మధుని అనే భావనతో మధనపడ్తూ, నా ఆలోచనలు ఇన్నాళ్ళూ చెప్పలేకపోయాను. . ఇందిరా .. ఏమిటలా చూస్తున్నావు ?"

బయట వర్షం కుండపోతగా కురుస్తూనే ఉన్నది గాలి హోరు ఎక్కువగా ఉంది.

"మీరు మీరు ఏమంటున్నారో నాకు అర్థం కావటంలేదు" కంపిస్తున్న స్వరంతో అన్నది

"సారీ, ఇందిరా, అసలే షాక్ తిని ఉన్న నిన్ను ఇంకా కంగారు పెట్టినట్లున్నాను. నీ భుజాలమీద నున్న బరువులు, బాధ్యతలు పంచుకోవటానికి సిద్దంగా ఉన్నాను నేను. అట్లా కాదంటావా, నీ బరువులు దింపుకొనేదాకా వేచి ఉండటానికయినా సిద్దమే ఇందిరా, అలా భయపడ్తున్నట్లు చూడకు. నిన్ను గందరగోళ పెడ్తున్నట్లున్నాను, నన్ను క్షమించు చూడు, ప్రస్తుతానికి నేను చెప్పినదంతా మరిచిపో. నింపాదిగా ఎప్పుడయినా ఆలోచించు" మృదువుగా అన్నాడు.

ఇందిరకి అంతా అయోమయంగా ఉంది. సుధాకర్ తనను ఈ దృష్టితో చూడగలడని ఎన్నడూ అనుకోలేదు. తన బరువు బాధ్యతలు ఈ ఉదయం వచ్చిన ఉత్తరంతోనే దిగిపోయినాయి. వేచి ఉండవలసిన అవసరం లేదు. కాని ఆలోచించవలసిన అవసరమే చాలా ఉంది... ఏదో అనబోయేటంతలో వాకిట్లో శబ్దమయింది.

"చిన్నబాబూ! చిన్నబాబూ!" కేకలు వినిపించాయి

సుధాకర్ చటుక్కున లేచివెళ్ళి తలుపు తీశాడు.

"చెరువు కట్ట తెగిందయ్యా! ఊళ్ళోకి నీళ్ళు వచ్చేస్తున్నాయి!" బయట నిలబడిన జనం కంగారుగా చెప్పారు.

సుధాకర్ ఒక్క క్షణం ఆలోచించాడు. "చెరువు కట్ట దగ్గర్లో పెద్దగా ఇళ్ళేం లేవు! కొన్ని గుడిసెలు మాత్రమే ఉన్నాయి. ఆ గుడిసెలలో వాళ్ళు తప్పుకోగలిగితే పెద్ద ప్రమాదం ఉండదు. తక్కిన ఊరంతా ఎత్తు మీదనే ఉంది! నేను ఇప్పుడే వెళ్తున్నాను—" త్వరగా లోపలికి వెళ్ళి స్కూటర్ తాళం చెవులు తీసుకున్నాడు. బయటకు రాబోతూ అప్పుడే గుర్తు వచ్చినట్లు ఇందిరను చూసి, "ఇందిరా, తలుపులు వేసుకొని జాగ్రత్తగా ఉండు! నేను అర్జెంట్‌గా వెళ్ళాలి" అని వెళ్ళబోయాడు.

ఇందిర అతని దగ్గరకు వచ్చింది "నేనూ వస్తాను" అంది.

నీ లా కా శ ం

"నీవా ? ఎందుకు ?"

"ప్లీజ్!" కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే బ్రతిమాలాడుతున్న ధోరణిలో అంది.

"వద్దు— తడిసిపోతావు— అనవసరం!" వెళ్ళిపోబోయాడు అతను. భుజం మీద చేయివేసి మరీ ఆపింది ఇందిర. "నేనూ వస్తాను... ఇక్కడ ఉంటే భయంగా ఉంటుంది ..."

మాట్లాడేందుకు టైము లేనట్లు వినుగ్గా చూసి, "త్వరగా రెయిన్ కోట్ తెచ్చుకో— ఆ అలమరలో ఉంది" అని బయటకు వెళ్ళి స్కూటర్ తీశాడు.

రెయిన్ కోట్ వేసుకొని బయటకు వచ్చాక కాని, వర్షం ఉధృతం ఇంతగా ఉన్నదని తెలియలేదు ఇందిరకు. నీరసం, జ్వరం, దిగులు అన్నీ మరిచిపోయింది. చెరువుకట్ట తెగింది ... ఏమయిందో . ఆత్రుత తప్ప మరొక ఫీలింగ్ లేదు.

సుధాకర్ తడిగా, జారుడుగా ఉన్న ఆ వీధుల వెంట జాగ్రత్తగా పోనిచ్చాడు స్కూటర్ని. చెరువు దగ్గరవుతూండగానే అరుపులు, కేకలు, గందరగోళం అన్నీ వినిపించసాగాయి. ఆ రోడ్లో ఇక స్కూటర్ ముందుకు వెళ్ళలేక పోయింది. ఆపేసి, దిగి చుట్టూ చూశాడు సుధాకర్.

వాళ్ళు ఎత్తు రోడ్డుమీద ఉన్నారు. క్రింద చెరువు బాగా ముందుకు వచ్చేసి పరవళ్ళు త్రొక్కుతున్నది. చెరువుకి దగ్గరగా ఉన్న గుడిసెల్లోకి నీరు వచ్చేసినట్లున్నది. జనం చాలా వరకు బయటకువచ్చి ఎత్తు రోడ్లమీదికి వచ్చేస్తున్నారు. ఈత వచ్చిన యువకులు కొందరు నీళ్ళలో తిరుగుతూ జనం వరదనీరు దాటి పైకి వెళ్ళేందుకు సహాయపడ్తున్నారు ఎత్తురోడ్డుమీద వానలో తడుస్తూ నిలబడి క్రిందికి చూస్తున్నారు చాలామంది.

సుధాకర్ క్రిందికి పరుగెత్తాడు. ఇందిర అయోమయంగా చూస్తూ ఉండిపోయింది. ఒక్క మాటుగా ఏదో ఆలోచన వచ్చినట్లు ఆగి వెనక్కి తిరిగి ఇందిరవైపు చూస్తూ అన్నాడు, "ఈ వానలో ఇంత ఎత్తూ ఎక్కి రోడ్డుపైకి అందరూ రాలేరు! గుడిలోకి వెళ్తే మంచిది. మంటపం ఎత్తుగా ఉంటుంది. జనం వరద తీసేదాకా అక్కడ ఉండవచ్చును! ఇందిరా, నీవు గుడికి వెళ్ళి అక్కడ జనానికి చేతనయిన సాయం చేయి!" వర్షపు రొద, గాలి హోరు, జనం అరుపులు— వీటి మధ్యలోనే గట్టిగా ఈ మాటలు అరిచి, పరిగెత్తి వెళ్ళిపోయాడు అతను.

ఇందిర గుడివైపుకి త్వరగా నడుస్తూ వెళ్ళింది ఆ గుడి సింహద్వారం దాదాపు గుడిసెల లెవెల్‌కే ఉన్నది కాని, లోపలి ఆలయం ఎత్తుపైన కట్టబడింది జనం చాలామంది ఉన్నారు అక్కడ అప్పటికే. మంటపంలో నిలబడి క్రిందికి చూసింది

చెరువు నీరు ఇంకా ఇంకా ముందుకి వచ్చేస్తున్నది గుడిసెలలో మిగిలిపోయిన జనానికి సుధాకర్, ఇంకా కొందరు యువకులు చేయూతనిచ్చి పైకి తీసుకువచ్చి గుడివద్ద దింపి వెళ్తున్నారు. ఆ యువకులలో ప్రసాద్ కూడా ఉన్నట్లు గుర్తించింది ఇందిర.

"సామానుల కోసం ఆశపడొద్దు! త్వరగా వెళ్ళండి!" అరిచాడు ఒకతను. హడావిడిలో ఎవరయినా జారి పడిపోతే నీటి వేగానికి కొట్టుకుపోవలసిందే! ఆ విధంగా కాకుండా జాగ్రత్త పడ్తున్నారు. పైనుంచి వర్షం ధారాపాతంగా కురుస్తూనే ఉన్నది

కొద్ది సేపటికి గుడి క్రిక్కిరిసి పోయింది జనంతో.

"అయ్యో, దేవుడా! సామానులన్నీ వదిలేసి వచ్చాం! అన్నీ కొట్టుకు పోవలసిందేనా!" ఏడుస్తున్నారు కొందరు.

"అరే, ఊరుకో! మనమయినా ప్రాణాలతో మిగిలాం!" ఏడుస్తున్నారు మరి కొందరు

"తొందరలో వస్తుంటే పిల్లాడు పడిపోయాడు. లేవదీసి లాక్కువచ్చాను— ఎముక విరిగినట్లుంది నెప్పికి విలవిల్లాడి పోతున్నాడు

"ఇంతవాన ఎన్నిసార్లో వచ్చింది చెరువు పొంగటం మాత్రం ఎన్నడూ చూడలేదు!

"స్వామీ! నీవే దిక్కు!"

"సీత వచ్చిందా? నానీ, ఉన్నావా? అమ్మయ్య, దగ్గరగా ఉండండి! జనంలో అటూ, ఇటూ వెళ్ళకండి"

"పెద్దవాడు నాయన ఎట్లావస్తాడో అనుకున్నా — చిన్న దొట్టుబాబు భుజాన వేసుకొని మరీ తెచ్చాడు"

ఇందిర చేతనయినట్లు ఓదార్పు చెప్తూ, ధైర్యం చెప్తూ వాళ్ళమధ్యలో తిరుగుతున్నది గుడిసెలన్నీ ఖాళీ అయినాయి. ఇంక సాయంచేస్తున్నవాళ్ళు మాత్రమే ఇవతలికి రావాలి సుధాకర్ ఉన్నవైపుకి— చూస్తుంటే, పరవళ్ళు త్రొక్కుతున్న నీటినీ, వానలో తడుస్తూ పని చేస్తున్న యువకులను చూస్తుంటే భయంగా ఉన్నది


"అమ్మో!!" ఇంత గందరగోళంలోను, గట్టిగా, హృదయ విదారకంగా వినిపించింది అరుపు

అందరూ మాటలు మానేసి చూశారు

చెరువు నీరు బాగా వేగంతో ముందుకి, ముందుకి వచ్చేస్తున్నది. ఒక వ్యక్తి ఆ వేగాన్ని నిలద్రొక్కుకోలేక తూలి పడిపోయాడు ప్రవాహానికి ఎదురీదలేక కొట్టుకు పోతున్నాడు

ఎవరికీ ఏం చేయాలో తోచలేదు పైనున్న జనం నోర్లు తెరుచుకొని భయంగా చూస్తున్నారు. తక్కిన యువకులు అతని కోసం ఆగితే, వాళ్ళూ కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నది. ఆగకుండా వదలి రాలేకపోతున్నారు.

[ఇంకా వుంది]



మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు- ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును
ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్
Imageads-M-1564
NEW
Prem
REFRESHING SOAP
PREM
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
ప్రేమ్ – తాజాతనము నందించు సబ్బు.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

సి హెచ్. ఎస్. - నిడదవోలు

దగ్గరవాళ్ల యింటికైనా, చుట్టాలింటికైనా వెడితే చాలా గౌరవంగా ప్రేమగా చూస్తారు రెండు రోజుల తరువాత ముఖాలు ఎడముఖం పెడముఖంగా వుంటాయి ఎందుచేత ?

★ ఎందుచేతనేమిటి చిట్టితల్లీ, వెళ్లిరండి అని చెప్పలేక ! అయినా, ముందువెనుకలు ఆలోచించకుండా— వున్నారుకదా అని చుట్టాలిళ్లలో దిగిపోడం సబబేనా అని ? యీ గడ్డురోజుల్లో — సాదాగా సంసారాలు సాగించడమే — గగనంగా ఉంటూంది పోనీ అని వెళ్లినవాళ్లకి — చిన్నమెత్తు ముద్దు ముచ్చట వుండదు విందులారగించడమేగాని— బాగుంది అని గృహిణిని నోరారా అనలేరు— పోనీ దిగాంకదా అని ఓ చిన్న బహూమానం—మాటవరసకే వచ్చేప్పుడా యిల్లాలి చేతిలో పెట్టాలని తోచదు ఇదే విదేశాల్లో చూడండి, పిలిస్తే వచ్చిన విందు అయినాసరే— తిరిగి వెళ్లగానే థ్యాంక్యూ కార్డు పడేస్తారు ఇది కృతకంగా కన్పించవచ్చును కాని మంచి పద్ధతి వీలైనంతవరకు ఎవరికీ ఇబ్బంది కల్గించకుండా మన పనులు చేసుకోవాలి లేదా ఇబ్బంది కల్గించినందుకు కనీసం మొఖమాటపడాలి.

జి. సి హెచ్. — ఆలేర్

మీరీ మధ్య మేనర్సు తెలియని అగంతకుని ప్రశ్నకి జవాబిచ్చారు అర్థంలేని విధంగా అసభ్యకరంగా, మిమ్మల్ని కించపరిచే విధంగా రాసే ప్రశ్నలకు జవాబు ఎందుకిస్తారు ? బాధ కోసం అసహ్యం కలగవా ?

★ అలాంటి జంతువు మీ మధ్య వుందని మీ కెలా తెలుస్తుంది — నేను జవాబు రాయికపోతే!! చదవడం, రాయడం తెలిసినంత మాత్రాన సంస్కారవంతులు కాలేరని అలాంటి ఉత్తరాలు రాసేవాళ్లు పదేపదే నిరూపిస్తూ వుంటారు. నేను చింపి పారేస్తే — ఎవరికీ తెలియదు. కాని రాస్తేనే— పాపం వాళ్ల ఉనికి తెలుస్తుంది. ఇక నేను బాధపడడం చాలా అరుదు ఇలాంటి వాళ్లని చూస్తే నాకు జాలి కల్గుతుంది — ఎటువంటి పరిస్థితులు వాళ్లనలా సినిక్సుగా తయారు చేశాయో అని ఆలోచిస్తాను

కె. టి. ఎస్. కె. - కుప్పం

మిమ్మల్ని ఎవరేనా కామెంట్ చేసినప్పుడు మీరు ఎలా ఫీలవుతారు ?

★ ఆహా, మన్నిగురించి కూడా ఆలోచించే వారున్నారే ! అనుకుంటా.

మీ దృష్టిలో సాహిత్యం పుట్టుకతో వస్తుందా ? కృషితో వస్తుందా ?

★ కృషితో సాధించవచ్చు పుట్టుకతో వచ్చేది చాలా తక్కువ

ఎ. సి. వి. ఆర్. — గుత్తి

అక్కయ్యా ! మనిషి ఆశకు సముద్రపు లోతుకు తేడాలేదు అంటాను మీరేమంటారు ?

★ సముద్రపు లోతులు అంతు కనుక్కొంటున్నారు కాని మానవుని ఆశకు అంతు కనుక్కోలేరు

ఎమ్. ఎ. - హైదరాబాదు

కొందరు ధనవంతుల ప్రవర్తన చూస్తూంటే వాళ్లకి ఇందుకేనా డబ్బు అన్పిస్తుంది ఎందుచేత ?

★ నిజమే ఐశ్వర్యం వుండగానే సరికాదు, దానిని సద్వినియోగం చేయడం కూడా తెలియాలి ఓ పెద్దమనిషి సభాధ్యక్షతకి పిలిస్తే ఫంక్షన్ ఖర్చులు భరిస్తాట్ట ! సిరి అలా సలిపేస్తుంది కాబోలు.

వి. ఆర్. ఎమ్ – సిద్దిపేట

మునుపటి సినిమాలకి ఇప్పటి సినిమాలకి పొత్తు కుదరడంలేదు. ఎందుకని ?

★ అప్పుడు డబ్బు విలువ వేరు, ఇప్పుడు వేరు. అప్పటి కాలం విలువ వేరు, ఇప్పుడు వేరు

బి. సి. ఎస్. — తిరపకొండ

నాకు కార్టూన్లు పంపాలని వుంది కాని బొమ్మలు గీయలేను కార్టూన్‌లోని జోక్ రాసి పంపితే వేసుకుంటారా ?

★ ఇది మరీ చోద్యంగా వుంది స్వామి, బొమ్మలు వేయలేని వాళ్ళు చూసి ఆనందించడం అలవాటు చేసుకోవాలి

వై. జె. ఎల్. ఆర్. - గోరంగూడ

భార్య ఏమండీ అంటే భర్త ఏమిటే అని సంబోధిస్తాడు స్త్రీకి గౌరవం లేదా ?

★ లేక కాదు— పట్టించుకోరు కనుక అలా పిలిపించుకోవడం ఇష్టంలేనివాళ్ళు చెప్పిచూడాలి ఒకటికి రెండుసార్లు— వినిపించుకోకపోతే పలక్కపోడమో తిరిగి ఓసారి అలాగే పల్కరించి 'ఎలా వుంది' అని అడగడమో చేయాలి ఒక్కటి జ్ఞాపకం వుంచుకోండి— తనమీద తాను గౌరవం ప్రదర్శించుకోని వ్యక్తికి— ఎవరిదగ్గిరా గౌరవం లభించదు

ఫ్రాన్సిస్ మహూ - (యు వి.)


కె రా గారూ, ఆలస్యంగా వివాహాలు చేసుకునే వారు, కుటుంబ నియంత్రణలో ప్రభుత్వానికి సహకరిస్తున్నారు కదా ? వారికి బహుమతి ప్రకటిస్తే ఎలా వుంటుంది ?


★ ఎవరికి ? ప్రభుత్వానికా ? ! లేకపోతే ఏమిటయ్యా ఆలికి కోక కొనడం వూరికి ఉపకారం అనుకునేలా తయారగుచున్నారు— కుటుంబ నియంత్రణ ప్రభుత్వం కోసం కాదు— మన బాగుకోసమేనని ఎప్పటికి గ్రహిస్తారు ? అయినా బహూమతుల కోసం, ధన సంపాదన కోసం యిలాంటి పనులు చేయకూడదు బాధ్యత అనుకుని చేయాలి


జి. ఎ. కె. ఆర్. — నిజాంబాదు

పగలు తక్కువ అనిపిస్తుంది ఒకొక్కప్పుడు ఎందుచేత ?

★ పని ఎక్కువైతే అలాగే అన్పిస్తుంది విన లేదా ? అత్యధిక దూరం నడిచిన వాడికి దినం అతి కురచగా వుంటుందని ★







ఒంటరి మనిషి

కాశీనాథ కాశీనాథ

చీకటి పడుతోంది. క్లబ్బులో టెన్నిస్ నెట్ విప్పేశారు మెంబర్లు ఒక్కొక్కళ్లే చేరుకుంటు న్నారు కొంచెం సేపటిలో క్లబ్బు బాగా సందడిగా తయారయింది.

రాఘవరావుగారు ఒక పక్కగా పేము కుర్చీలో కూర్చున్నారు ఆయనతో ఎప్పుడూ చదరంగం ఆడే రామనాథం ఇంకా రాలేదు 'ఇవాళ రాడేమో' అను కున్నారు ఇంకెవరయినా ఆడమంటే ఆడతారు కాని సమ ఉజ్జీతో ఆడితేనే బాగుంటుందని ఆయన ఎవర్నీ అడగలేదు

కొంచెంసేపు ఊరికే కూర్చున్నాక ఇంక తోచలేదు నెమ్మదిగా రమ్మీ టేబులు దగ్గిరకి వచ్చి కూర్చున్నారు

'ఇంట్లో కేంపు ఉందని చెప్పివచ్చాను. రెండు రోజులదాకా కదలక్కర్లేదు' అంటున్నాడు ఒకతను హుషారుగా

ఆట జోరుగా సాగుతోంది

రాఘవరావుగారు రమ్మీ ఆడరు వాళ్ల కులాసా కాసేపు చూస్తారు అంతే. పేకాట వల్ల డబ్బులు పోతాయనికాదు, అదృష్టంమీద ఆధారపడటం అలవాటు చేస్తుందని

అక్కడ అందరూ హాయిగా గడుపుతారు. ఒకతను 'ఒక డీలు వెయ్యవయ్యా. ఇవాళ పాతిక రూపాయలైనా లాభం సంపాదించకపోతే మా ఆవిడ తలుపు తియ్యనంది' అంటున్నాడు

అక్కడ వాళ్లంతా ఆడకుండా పక్కన కూర్చుని చూస్తున్నవాళ్లమీద జోక్ చేస్తుంటారు! పక్కన కూర్చుంటే నీకు కూడా ఆడబుద్ధి వెయ్యటం లేదా ? అని అడుగుతారు 'లేదు' అంటే అదే 'ఆడబుద్ధి' అంటారు. రాఘవరావుగారు వయసులో పెద్దవాడు, మర్యాదస్తుడు కాబట్టి ఆ జోక్ వెయ్యరు అయినా అక్కడినుంచి కదిలారు ఆయన

రామనాథం ఇంకా రాలేదు

కాసేపు బ్రిడ్జి టేబులు దగ్గిర కూర్చున్నారు ఒక టీమువాళ్లు సిక్స్‌స్పేడ్ బిడ్ చేశారు డిక్లరర్ దగ్గిర స్పేడులు ఏస్, జాక్, రెండు ముక్కలు ఉన్నాయి డమ్మీలో కింగ్, నైన్, రెండు ముక్కలు ఉన్నాయి ఎలా ఆడాలో తెలియక ట్రంప్‌లోనే రెండు ట్రిక్స్ ఇచ్చి వల్నరబుల్ స్లామ్‌డౌన్ చేశాడు పద్నాలుగు వందల ముప్ఫయి పాయింట్లు రావలసింది పోయి వంద పాయింట్లు అవతల వాళ్లకి వచ్చాయి. రాఘవరావుగారికి ఎలా ఆడాలో తెలుసు అయినా చెప్పలేదు అడగకుండా చెప్పడం ఆయన తత్వం కాదు వాళ్లు అడగలేదు

అక్కడ ఇంక కూర్చోబుద్ధి కాక పక్కకి వచ్చారు చదరంగం బల్ల దగ్గిర ఎవరో కుర్రాళ్లు చేరారు సరదాకోసం ఆడే రకం వాళ్లు.

అక్కడికి వెళ్లడం ఇష్టంలేక పేపరు తీసుకుని దూరంగా కూర్చున్నారు ఆయన పేపరు అంతా చదివినదే పొద్దున్న ఒక గంటసేపు పేపరుతో గడిచింది

ఆయన ప్రొద్దున్న లేవగానే ఒక గంటసేపు పేపరుతో గడుపుతారు బయటికి వెళ్ళి కాఫీ తాగి వచ్చాక వారపత్రికతో కాసేపు కాలక్షేపం తర్వాత అన్నం వండుకుని తినేటప్పటికి పదకొండున్నర అవుతుంది అప్పుడు నిద్రవస్తుంది కాని పగలు పడు కుంటే రాత్రి నిద్రపట్టదని చాలాసేపు పుస్తకాలు చదువుతారు అప్పటికీ నిద్ర వస్తుంటే మేట్నీకి వెళ్ళిపోతారు సాయంత్రం క్లబ్బు తొమ్మిదిన్నరకి ఇంటికి వస్తారు అప్పుడు అన్నం తిన్నాక నిద్రకని ప్రయత్నిస్తారు

అప్పుడు ప్రారంభమవుతుంది అసలు సమస్య నిద్రపట్టదు. ఒంటిగంట అయినా రెండయినా నిద్ర పట్టదు ఆలోచనలు ముసురుతూ ఉంటాయి. భార్యా పిల్లలూ గుర్తుకు వస్తారు. అప్పుడు మొదలయిన ఆలోచనల మధ్యన ఎంతకీ తెగదు. వాటి నుంచి తప్పించుకుందామని పుస్తకం తీసుకున్నా చదవబుద్ధి కాదు పగలు చాలా భాగం ఆలోచనలని జయించగలిగినా రాత్రి మాత్రం అవి వీరవిహారం చేస్తాయి

కేవలం బాధ అయితే భరించవచ్చు. మరిచి పోవడానికి ప్రయత్నించవచ్చు సమస్యలయితే పరిష్కారమార్గం కోసం అన్వేషించవచ్చు నష్టంతో తేలిపోయే సమస్యలయితే నష్టం భరించనూ వచ్చు పూర్తిగా ఇది అని చెప్పలేని ఆలోచనలు ఆయనవి మనసు మనిషిని ఎంత కష్టపెట్టగలదో ఆయనకి ప్రతిరోజూ అనుభవమే ఒకరోజు కాదు. ఒక నెల కాదు సుమారు మూడు సంవత్సరాల నుంచీ ఇదే ఒంటరి బ్రతుకు పగలు వ్యాపకం కోసం, రాత్రి నిద్రకోసం పోరాటం ఇంటిని వదిలిపెట్టి పగలు ఎంత తిరిగినా రాత్రి ఇంటికి రాక తప్పదు ఆలోచనల పంజరంలో ఇరుక్కోక తప్పదు

క్లబ్బులో ఏమీ తోచకపోయినా అందుకే ఇంటికి బయలుదేరలేదు ఆయన

టైము ఎనిమిది అయింది ఇంక చదరంగం లేనట్లే. ఎలాగో ఒకలా తొమ్మిదిన్నర వరకూ గడపాలి.

నెమ్మదిగా లేచి టేబుల్ టెన్నిస్ కొంతసేపు చూసి తర్వాత కేరమ్స్‌బోర్డువైపు నడిచారు ఆయన అక్కడ ముగ్గురే ఉండటం చూసి తను కూడా కూర్చున్నారు రాఘవరావుగారికి కేరమ్స్ బాగా రాదు. ఆ ముగ్గురికీ కూడా రాదుగాని సరదాగా మాట్లాడు కుంటూ ఆడుతున్నారు కాయిన్ పడనప్పుడు 'అంత ఈజీ కాయిన్ ఉక్కుతావేం?' అని అడిగాడు ఒకడు. 'నేను ఉక్కుమనిషిని' అన్నాడు రెండో వాడు ఇలా సరదాగా గంటసేపు ఆడారు రాఘవరావుగారికి బాగా కాలక్షేపం అయింది

తొమ్మిదిన్నరకి ఇంటికి వెడుతూ ఆలోచిస్తు న్నారు ఆయన

హఠాత్తుగా ఆలోచన వచ్చింది

ఉత్తరం రాయాలి!

ఆ వూహ రాగానే ఆయన మనసు కొంత శాంతించింది ధైర్యంగా ఇంటికి వెళ్లారు అన్నం

తినబుద్ధికాలేదు కాసిని మంచినీళ్ళు తాగి పక్కమీద పడుకున్నారు

ఇప్పుడు ఆయన ఆలోచనలకి భయపడటంలేదు ఆ ఆలోచనలని ఒక క్రమపద్ధతిలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు, సమగ్రమయిన ఉత్తరం రాయడానికి

ఉత్తరం రాయడానికి ఆయన తొందరపడలేదు తన మనసు అందులో అద్దంలో లాగా ప్రతిబింబించాలి తన మనస్సాగర మథన అందులో వ్యక్తీకరింపబడాలి అప్పుడు తన గుండె బరువు తీరాలి

నెల రోజుల తర్వాత ఒక రోజు కూర్చుని ఉత్తరం రాశారు చాలా పెద్ద ఉత్తరం రాశాక మళ్ళీ ఒకసారి చదువుకుని తృప్తిపడి పోస్టు చేశారు

పోస్టు చేశాక ఆ రాత్రి హాయిగా నిద్రపట్టింది, మూడు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా !

* * *

'పోస్ట్' అని వినపడింది రమేష్‌కి

ఆఫీసుకి బయలుదేరుతున్నవాడు ఆగి ఉత్తరం అందుకున్నాడు అక్కడే నిలబడి చదివాడు సుజాతకి ఇచ్చి చదవమన్నాడు అతడి కళ్లల్లో నీటిపొరని చూసి ఆమె కూడా చదివింది

అందులో ఇలా ఉంది

ప్రియమైన రమేష్‌కి,

నీ తండ్రి ఆశీర్వదించి వ్రాయునది దాదాపు రెండున్నర సంవత్సరాలు మౌనంగా ఉన్న అనంతరం నీకీ ఉత్తరం రాస్తున్నాను ఈ ఉత్తరం రాసే ముందు నేను చాలా ఆలోచించాను. ఇది చాలా ముఖ్యమైన ఉత్తరం ఒక కథంత ఉత్తరం. కోడల్ని కూడా చదవమను

ఒకప్పుడు నలుగురూ సందడిగా తిరిగిన ఈ ఇంట్లో ఇప్పుడు ఒంటరిగా ఉన్నాను ఒక్కడినీ పగలంతా తిరగటం, తిరిగి వచ్చి శూన్యంగా ఉన్న ఈ యింటిలో ఆలోచిస్తూ, బాధపడుతూ పడుకోవడం— ఇదే నాకు మిగిలినది

మీ అమ్మ పోయినప్పుడే సగం ఒంటరినయ్యాను మీరందరూ విడిచిపోయాక ఇప్పుడు పూర్తిగా ఒంటరినయ్యాను

అయితే ఒంటరితనం వల్ల నేనీ ఉత్తరం వ్రాయటంలేదు ఈ వృద్ధాప్యంలో నా గతికి నన్ను వదిలేసి ఎందుకు వెళ్లిపోయారు ? అని కూడా అడగటం లేదు. నేను మీకు ఎందుకు అర్థంకాకుండా పోయాను ? అన్నదే నా బాధ

"నాన్నా నా మనసు మీకు అర్థంకాదు సుజాతని నేను పెళ్లి చేసుకుంటాను" అని చాలా ఖండితంగా అన్నావు నా మాటని నిర్లక్ష్యంగా తీసి పారేసి రిజిష్టరు పెళ్లి చేసుకున్నావు నన్ను దూరంగా ఉంచేశావు పాతకాలపు వాడిననీ, కన్సర్వేటివ్‌ననీ ఇంకా చాలా అన్నావు ఇప్పుడు నీ భార్య అయిన సుజాత కాలేజీ రోజుల్లోనే శీలం పోగొట్టుకుంది బిడ్డనికూడా కన్నది. విధికృతంగా ఆ బిడ్డ పుట్టిన రెండవ రోజునే మరణించాడు ఇవన్నీ నీకూ తెలుసు విశేషంలా మన సుశీలని చేసుకోమని నిన్ను అడిగాను నువ్వు నా మాటని పట్టించుకోలేదు. నాకు అది అశనిపాతంలాగా తగిలింది మనసు తలక్రిందులయినా సహించుకున్నాను నాకు నా చెల్లెలు అన్నా నా మేనకోడలు సుశీల అన్నా ఉండే అభిమానం నీకు ఉండకపోవడం సహజమే అనుకున్నాను కాని 'సుశీలని చేసుకోక పోయినా మరో సలక్షణమయిన కన్యని చేసుకో శీలం పోగొట్టుకుని బిడ్డ తల్లి అయిన అమ్మాయిని మాత్రం చేసుకోవద్దు' అని ఖండితంగా చెప్పడం నా తప్పా ? అదేనా నేను చేసిన మహాపరాధం ?

నీ చెల్లెలికి పెళ్లి సంబంధం చూడటం కూడా నా తప్పే అయింది ఎం ఏ చదివిన తర్వాత అయినా ఆడదానికి పెళ్లి అవసరం కాదా ? స్త్రీ జీవితానికి పెళ్లితోనే సంపూర్ణత్వం వస్తుందని పెళ్లి సంబంధం మాట్లాడాను జయ ఒప్పుకోలేదు దానికి ప్రేమ వివాహంమీద వ్యామోహం అనుకోకుండా, ప్రయత్నించకుండా ఎవరి మీదైనా ఇష్టం కలిగితే అది ప్రేమ అవుతుంది అంతేగాని ఎవర్ని ప్రేమించాలి అనుకుంటే అది ప్రేమ ఎలా అవుతుంది ? తను చేసుకోబోయే వ్యక్తి తనతో మనసులు పంచుకున్నవాడే అయి ఉండాలంది అలా ఎవరితోనైనా పరిచయం అయి తన మనసు దోచుకునే వ్యక్తి తటస్థపడే వరకూ పెళ్లి చేసుకోనంది పెళ్లి విషయంలో ఆడపిల్ల స్వయం నిర్ణయం చేసుకొనిస్తే సాధారణంగా తప్పటడుగులు వేస్తారని నా అభిప్రాయం జీవితాంతం పోషించలేని ఒక అనర్హుడిని, ప్రేమ పేరుతో గుడ్డిగా నమ్మి పెళ్లి చేసుకోవడం నాకు ఇప్పటికీ ఇష్టం లేదు చాలా మంది యొక్క ప్రేమలు తాత్కాలికంగా కళ్లు కప్పే భ్రమలని నా నమ్మకం ఆకలి, కష్టాలు ఆ భ్రమ అనే తెరని తొలగిస్తాయి ఆ భ్రమలో పెళ్లి చేసుకున్నవారు తమ వైఫల్యానికి విధిని కూడా నిందించలేరు నువ్వూ దానిని సపోర్ట్ చేశావు అప్పటి నుంచీ జయ నాకు ఉత్తరం రాయలేదు తండ్రినని కూడా గుర్తు పెట్టుకోలేదు

ఇదంతా ఒక ఎత్తు శేషు చేసినది ఒక ఎత్తు. మీ అమ్మ పోయినప్పుడు కర్మకి ఉండమంటే ఉండలేదు. ఈ కర్మలన్నీ మూర్ఖత్వం అన్నాడు అమ్మ మీద ప్రేమ, అభిమానం ఉన్నాయి కాని వీటిమీద నమ్మకం లేదన్నాడు. నాకు నమ్మకం ఉంది, అది నా కోరిక అని చెప్పినా కాదని వెళ్లిపోయాడు అప్పటికీ, ఇప్పటికీ తలచుకున్నప్పుడల్లా గుండెల్ని కలచివేసే సంఘటన అది ఒక్కొక్క సంవత్సరం గడిచి మీ అమ్మని శాస్త్ర పూర్వకంగా గుర్తు చేసుకుంటున్నప్పుడల్లా ఇది నాకు బాధ కలిస్తూనే ఉంటుంది

ముగ్గురు పిల్లలతో జరిగిన ఈ మూడు సంఘటనలూ తలచుకుంటేనే జీవితంలో మోసపోయినట్లుగా బాధ కలుగుతుంది నా కన్నబిడ్డల దగ్గర నాకు పరాజయం ! వాళ్లకీ నాకూ మధ్య అంతులేని అగాధం ! నేనూ నా వాళ్లూ అని మాటవరసకి కూడా అనుకోలేని నిస్సహాయత ! అయితే

కొన్నాళ్లనుంచీ నా ఆలోచనలు మారాయి. జీవితంలో కొత్త విషయాలు తెలుసుకుంటున్నానని పిస్తోంది మీ కెంతకీ నేను అర్థం కాకపోవడం, నాకు ఎంతకీ మీరు అర్థం కాకపోవడం చాలా సహజం అనిపిస్తోంది. సృష్టి సూత్రం అదేననిపిస్తోంది ఇవే సంఘటనలు, ఇవే సందర్భాలూ కాకపోయినా మనిషికి ఇలాంటి అనుభవాలు ఏభై సంవత్సరాల వయసు తర్వాత తప్పవు అనిపిస్తోంది ఎందుకంటే అప్పటికి ఆ మనిషి చుట్టూ కొత్త తరం ఆవిర్భవిస్తుంది !

ఆ కొత్త తరం పాత తరం భుజాలమీద నుంచుని ప్రపంచాన్ని చూస్తుంది ఆ దృష్టి, ఆ వాతావరణం వేరు అది పాత తరానికి అందదు ఈ తరం సంస్కారణలనుకున్నవి తర్వాత తరానికి కనీస ధర్మాలు, పునాదులు అవుతాయి మనిషి ముందు తరంలోకి చూడలేకపోవడానికి నాకు కారణం తెలుస్తోంది

మనిషికి లోకజ్ఞానం అలవడేటప్పుడు, ప్రపంచాన్ని అవగాహన చేసుకునేటప్పుడు, కొత్త ఊహాలు వస్తాయి ఈ ప్రపంచం ఎందులో వెనుకబడి ఉందో తెలుస్తుంది ఆ విషయంలో చాలా ముందుకపోయి తన వూహల్ని ఆదర్శంగా పెట్టుకుంటాడు కాని కాలగమనంతో ప్రపంచం ఇంకా ముందుకు పోతుంది ఈనాటి ఆదర్శం రేపటి వెనుకబడిన తనం అవుతుంది చేతనైతే ఎప్పుడూ ముందే ఉండాలి కొత్తని మంచీ చెడ్డా విచక్షణ లేకుండా ఆహ్వానించాలి అటువంటి మనిషికి వ్యక్తిత్వం ఉండదు కాని అలా జరగదు మనిషికి కాలంతో మారే లక్షణం ముప్ఫయి, ముప్ఫయి అయిదు సంవత్సరాల వయసువరకే ఉంటుంది ఆ వయసుతో అతనికి మారే శక్తి ఆగిపోతుంది అందుకనే అతని తర్వాత తరానికీ అతనికీ సంఘర్షణ! నువ్వొక అంతస్థులో నేనొక అంతస్థులో నిలబడి ఒకరివైపు ఒకరు చేతులు ఎంత చాచినా ఒకరి కొకరు అందము తరాలూ అంతే.

తనదే తుది నిర్ణయంగా, ఇంటికి తనే అధిపతిగా ఇరవై సంవత్సరాలు గడుపుతాడు మనిషి అప్పుడే వ్యక్తిత్వం స్వాభిమానం, దర్పం ఏర్పడుతాయి ఆ తర్వాత అధికారం కొత్త తరానికి వచ్చేస్తుంది. కొత్తతరానికి నిర్ణయాలు తీసుకునే ధైర్యం, నైజం వచ్చేస్తాయి ఇంట్లో కీలకమైన స్థానం కొత్త తరానికి వచ్చి పాతవ్యక్తి కొత్తవాళ్లు ఇచ్చే గౌరవంపై ఆధారపడవలసి వస్తుంది

తండ్రి తన జీవితాంతం ఏదైతే పొందలేకపోయాడో దానిని తను అష్టకష్టాలూ పడి కొడుకులకి సమకూర్చిపెడితే దాని విలువ కొడుకులు గుర్తించరు. తండ్రికి కావలసిన గుర్తింపు, కృతజ్ఞత దొరకదు అవి కనీస అవసరాలుగా వాళ్లు లెక్కవేసి ఆ పై అవసరాల కోసం చూస్తారు తండ్రికి కొడుకు, కొడుకుకి తండ్రి అర్థంకారు ఎంత తెలివి గల వాళ్లయినా ఈ సమస్యలో కాలు జారక తప్పదు ఎప్పటి కప్పుడు కాలానికి అనుగుణంగా మారగల శక్తి మనిషికి ఒక తరంసేపు ఉండకపోవడమే ఈ సమస్యకి మూల కారణం

మామూలు మనిషికేకాదు, మనసు ఎదిగిన వాడికీ అదే గతి.

నువ్వు నవ్వుకోవచ్చుగానీ నేనూ నా కాలంలో ఆదర్శవాదినే మీ తాతగారు వద్దంటున్నా, అందరూ వ్యతిరేకించి 'ఆడదానికి చదువు లెందుకు ?' అని అన్నా నేను ప్రతిఘటించి మీ అత్తయ్యని చదివించాను. ఇప్పుడు స్త్రీకి చదువు అవసరం అని అందరూ గుర్తించారు.

నాదసుధావర్షిణి శ్రీమతి జానకి చలనచిత్ర రజతోత్సవం

సంగీత ప్రియులకూ సుపరిచితమైన ప్రముఖ గాయనీమణి శ్రీమతి యస్ జానకి చలన చిత్ర రజతోత్సవం గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జనవరి 9వ తేదీన వైభవోపేతంగా జరిగింది ఈ సందర్భంగా ఆమెకు ''నాదసుధావర్షిణి'' బిరుదును ప్రదానం చేశారు

ఉత్సవంలో ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి శ్రీ జి రామానుజులనాయుడు పాల్గొన్నారు

దక్షిణ భారత చలన చిత్ర సంగీత రంగిమంతా తరలివచ్చిందా అన్నట్లు ప్రముఖ సంగీత దర్శకులు, గాయనీ గాయకులు వచ్చి శ్రీమతి జానకిని అభినందించారు. నటీనటులు శ్రీ టి. యల్ కాంతారావు, శ్రీమతి శారద, శ్రీ రావి కొండలరావు, శ్రీమతి రాధాకుమారి విచ్చేశారు ఎ. వి యం సంస్థ ప్రతినిధి శ్రీ షణ్ముగం ఆమెను గోల్డెన్ డిస్క్‌తో సన్మానించారు శ్రీమతి శారద అందమయిన తాజ్ మహల్‌ను బహూకరించారు

సంగీతంలో ఉద్దండులు సర్వశ్రీ పెండ్యాల, రాజేశ్వరరావు, చలపతిరావు, డా॥ బాలమురళీకృష్ణ, ఇళయరాజా, కె. వి. మహదేవన్, చక్రవర్తి, లింగప్ప, వెంకటేష్, జె. వి. రాఘవులు, పిఠాపురంగార్లు ఆమెను ఆశీర్వదించి సన్మానించారు. గాయనీ గాయకులు శ్రీమతి పి. సుశీల, యస్ పి బాలసుబ్రహ్మణ్యం, సౌందరరాజన్, జమునారాణి, పి. లీల, బి. వసంత యస్ పి శైలజ, పి బి శ్రీనివాస్, రామకృష్ణ, ఆనంద్‌లు ఆమెను అభినందించారు. సినీరచయితలు పిటూరి, జూనియర్ సముద్రాల కూడా పాల్గొన్నారు.



శ్రీమతి జానకికి కిరీటాన్ని బహూకరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీ రామానుజుల నాయుడు

ప్రముఖ గాయని శ్రీమతి పి సుశీల శ్రీమతి జానకికి బొట్టు పెట్టి, నూతన వస్త్రాలతో సన్మానిస్తుంటే ''ఒక కోకిలకు మరో కోకిల సన్మానం'' అనిపించింది శ్రీమతి జానకి మామగారు, ప్రముఖ మోనో ఏక్టర్ శ్రీ చంద్రశేఖరం కూడా పాల్గొని ఆమెను ఆశీర్వదించారు శ్రీ పి బి శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు

జిల్లా జడ్జి శ్రీ గోపాలాచార్యులు, డా బేతవోలు రామబ్రహ్మం ఆమెకు సన్మాన పత్రాలను సమర్పించారు.

అనంతరం జరిగిన ''సంగీత విభావరి''లో ప్రముఖ గాయనీగాయకు లందరూ దక్షిణ భారత చలన చిత్రాలలో జనాదరణ పొందిన పాత, కొత్త పాటలు పాడి శ్రోతలని ఆనందాబ్ధిలో ముంచెత్తారు

— చలసాని నరేంద్ర

అయిదు రాత్రుల వివాహం చెయ్యలేనని మా మామగారు అంటుంటే, 'చెయ్యాల్సిందే' అని మా నాన్నగారు పట్టుబట్టినప్పుడు కాదని ఎదిరించి ఏక రాత్రి వివాహం జరిపించిన వాడిని అప్పట్లోనే కట్నం తగ్గించాలని పట్టుబట్టిన వాడిని, అలక పాన్పు వద్దన్నవాడిని, భార్యని బాగా చూసుకున్న వాడిని మా చుట్టుపక్కల నేనొక్కడినే కావాలంటే మీ అమ్మ ఫొటో చూడు. ఆ కళ్ళల్లో ఆ తృప్తి చూడు!

అలాంటి వాడిని ఈ రోజున నా పిల్లలముందు దోషిగా, అభ్యుదయ భావాలు లేని పాతకాలపు మనిషిగా వేలెత్తి చూపించబడే స్థితిలో నిలబడి ఉన్నాను కారణం ఏమిటి? ఇప్పుడు ఆ సమస్యలు లేవు నా ఆదర్శాలకి విలువలేదు ఇప్పుడు అవి ఆదర్శాలంటే అందరూ నవ్వుతారు అవి కనీస ధర్మాలు

నా ముందు తరం ఆదర్శాలని విని నేనూ అలాగే నవ్వేవాడిని.

మనిషి ఆలోచనల పరిధి, సంస్కరణ తత్వం అప్పటి సామాజిక పరిస్థితులను మించి పదిమెట్లు కన్నా ముందుకువెళ్లదు వెడితే పిచ్చివాడని పిలవ బడతాడు మా ఆలోచనలు వెళ్లగలిగినంత దూరం వెళ్లి ఆగిన చోట మీ ఆలోచనలు ప్రారంభం అవుతాయి ముందుతరంతో సమన్వయం సాధించలేక మనిషి 'ఇది నా తరం కాదు' అనుకుంటాడు — తన అసమర్థతని తెలుసుకుంటూ, తరం మార్పుని గుర్తిస్తూ.

అలాగే నీ తరానికి నీదే ఆదర్శం అనుకున్నా నీ తర్వాత తరానికి అది గొప్పగా అనిపించక పోవచ్చు. నువ్వు శీలం పోగొట్టుకున్న స్త్రీని పెళ్లాడితే, నీ తర్వాత తరం వాళ్లు ఆమెకి వేరే వ్యక్తివల్ల పుట్టిన బిడ్డని తన బిడ్డగా స్వీకరించి ఆమె మాతృత్వానికి విలువ నిచ్చే ఔదార్యాన్నీ ప్రదర్శించవచ్చు ఆ పరిస్థితి నీకు రాలేదు. సుజాత బిడ్డ మరణించాడు. ఒక వేళ బ్రతికి ఉంటే అంత హృదయ వైశాల్యం ప్రదర్శించ గలిగేవాడివా? ఆలోచించు. కాని నీకిప్పుడు పుట్టిన చిన్నారి రఘు తన అన్నని సంతోషంగా అంగీకరించే వాడేమో! ఉయ్యాలలో ఉన్న రఘుని అడిగి చూడు!

ఇదంతా నిన్ను బాధ పెట్టడం కోసం వ్రాయటం లేదు. తరాల ఘంఘర్షణలో నేను ఎలా దెబ్బ తిన్నానో నీకు తెలియజెయ్యడానికి వ్రాస్తున్నాను నేను చాలా సెన్సిటివ్ అని నీకు తెలుసు

ఇవి నా భావాలు. నా తీవ్రమైన ఆలోచనల ప్రతిరూపాలు. నా ఆలోచనల మధ్యలోని బరువంతా కాగితం మీదికి దించేసి నిర్వికారంగా, నిర్గుణంగా ఉన్నాను నిన్ను బాధ పెట్టడం నా ఉద్దేశం కాదని మరోసారి చెబుతున్నాను. పాత తరం సంస్కర్త నయిన నా ఆలోచనలలో కొత్త తరం సంస్కర్త వయిన నీవూ తెలుసుకోవలసిన విషయాలు ఉన్నాయేమోనని అనిపించి నీకీ ఆలోచనా ప్రవాహాన్ని అందిస్తున్నాను.

అయితే రెండు తరాల మధ్య రగడ వచ్చినప్పుడు ఎవరు రాజీకి రావాలి? అనికూడా ఆలోచన వచ్చింది. ఒక తరం మాత్రమే చూసి ఆవేశం, ఉత్సాహం తప్ప చేదు అనుభవాలు లేని నువ్వా? రెండు తరాలు చూసి అనుభవం గడించి తరాల అనంతరం యొక్క చేదుని రుచి చూసిన నేనా?

నాకు అనిపించింది ఏమిటంటే— తెలిసినవాడు, 'ఇంకా తెలియ వలసినవాడి' మీద ప్రేమ, జాలి, అభిమానం, క్షమ చూపాలి అనిపించింది.

ఇప్పుడు నా మనస్సు నిర్మలంగా ఉంది

హృదయ పూర్వకంగా నీతో, జయతో, శేషుతో కోడలితో చెలిమి కోరుతున్నాను మీ అమ్మ బ్రతికి ఉంటే ఇలా మనం దూరం అయే వాళ్ళమా? తను కానిచ్చేదా?

రెండు చేతులూ చాచి ఆహ్వానిస్తున్నాను

మనం మళ్లీ ఒక కుటుంబంగా కలవాలని నాకు అనిపిస్తున్నట్లుగా ఈ ఉత్తరం చదివాక నీకూ అనిపిస్తే నువ్వూ, కోడలూ, బాబూ నా దగ్గిరకి రండి ఎంతయినా పెద్ద వాడిని కదా.

చి సౌ. సుజాతకి నా ఆశీస్సులు

చి. రఘుకి నా ముద్దులు

ఇట్లు
ప్రేమతో
రాఘవరావు


పి. యస్:— కోడలికి ఈ ఉత్తరాన్ని చూపించమని మొదట్లో రాశాను చూపించాలని అనిపిస్తేనే చూపించు. లేకపోతే నీ మనసుకి తోచినట్లు నిజం కాని, అబద్ధం కాని చెప్పు. —రాఘవరావు.

* * *

ఉత్తరం చదివిన రమేష్, సుజాతల కళ్లలో నీళ్లు తిరిగాయి. ఒక్కక్షణం ఆగి 'సుజాతా! ప్రయాణానికి సిద్ధం చెయ్యి' అన్నాడు రమేష్. సుజాత ఈ నిర్ణయానికి సంతోషించింది.

రమేష్ రఘుకేసి తిరిగి 'తాతగారి దగ్గిరకి వెడుతున్నామురా' అన్నాడు. చిన్నారి రఘుకి ఏమి అర్థం అయిందో బోసినవ్వు నవ్వాడు. అది అందంగా వెన్నెలలాగా ఉంది.

అచ్చం తాతగారు నవ్వినట్లే ఉంది. ★



నేనెప్పుడూ డైరీ అంటూ రాయలేదు. రాయాలని చాలా ఉబలాటమైతే వుండేదికాని ముఖ్యంగా బద్ధకమూ తరువాత నిజాయితీ లోపించటమూ నేను డైరీ రాయలేక పోవటానికి కారణాలని తేలింది. ఈ నిజాయితీ లోపించటమన్నది కొందరికి అర్థం కాకపోవచ్చు. నేను దీక్షగా పట్టుదలతో డైరీ రాయాలని ప్రయత్నం చేసిన కొత్తల్లో బయట పడ్డ బలహీనతగా దీన్ని విశ్లేషించాలి. డిగ్రీ కాలేజి దాటి యూనివర్శిటీ ప్రాంగణాల్లో అడుగుపెట్టాక నేను నిజాయితీగా రాయాలని ప్రయత్నిస్తే బయట పడ్డ కొన్ని ఆలోచన్లిలా వున్నాయి.

—నాకు చదువుమీద, కనీసం ఈ విధానంలో చెప్పబడే చదువుమీద నమ్మకంలేదు—

—మా రీడరుకు ఏమీ తెలీదు కనీసం అందరూ బహిరంగంగా అనుకునేంత పాండిత్యంకానీ, 'స్పార్క్' కానీ ఆయన్లో లేవు—

—సాహిత్యాన్ని ప్రేమించి బాగా చదువుకున్న మా లెక్చరర్ ఆ రీడర్ని పొగడ్డం చూస్తే యిద్దర్నీ కలిపి ఈడ్చి తన్నాలనిపిస్తోంది—

"మొన్నటి సాహిత్య సదస్సులో మీరు మాట్లాడారే! ఆహా! ఎంత అద్భుతంగా వున్నై సార్ మీ భావాలు! భావా లలాగుంచండి. మీరాశాక్తేయుల్ని గురించీ, సింబాలిజం గురించి మాట్లాడుతుంటే నాకేదో మత్తు చల్లినట్టుండింది"— ఇత్యాది—

ఈ లెక్చరర్ తన డాక్టరేట్ కోసం తాపత్రయ పడుతున్నాడు తన చదువూ, వ్యక్తిత్వం, గాంభీర్యం— అన్నీ పణంగా పెట్టి క్షుద్రదేవతో పాసకు డయ్యాడు తనో వెధవనీ తనతో పనుండి ఈ కుర్ర లెక్చరర్ ముఖస్తుతి చేస్తున్నాడని రీడరుకూ తెలుసు. ఐనా చిద్విలాసంగా నవ్వుతూ స్తోత్ర పారాల్ని స్వీకరిస్తున్నాడు

ఏడికి డాక్టరేట్ యిస్తేచాలు ఏ రీడరోఐ తనూ అలాంటి భజనల్ని ఆకర్షిస్తాడు. అలా అలా సాహితీ సేవ చేసుకుంటూ అనూచానంగా డాక్టరేట్లు చల్లుతూ, భజనలు చేస్తూ చేయించుకుంటూ...—

వసుంధర కవిత్వం అల్లుతుంది తుణ్ణంగా నాలుగు సమాసాల స్వరూపమైనా ఎరుగని భావ కవిత్వం. అసలు భావంలేని ఎక్స్ప్రెషన్ ఎక్కుడుందని కవిత్వాన్ని భావకవిత్వమని ప్రత్యేకంగా చెప్పకోటానికి? లోతుగా చూస్తే అంతా బూతూ,

కోరికామా. గులాబీవి రెమ్మలు విరిచి చూస్తే ఏముంది? బాటనీవాళ్ల నడగాలి

బాటనీ లెక్చరర్ సౌందర్య తనకు బాగా పరిచయమైంది. వెకిలి వేషాలూ ఆవిడామా. తనకున్న పరిచయాన్ని పురస్కరించుకుని క్లాసులేకుంటే ఇంగ్లీషు సినిమా మేటనీ కెళదాం రమ్మందో రోజు కోరికల్తో కాలిపోతున్న కొలిమిలా కనబడిందావిడ తన కళ్లకు మాట్నీ అయ్యాక పోష్ హోటల్లో చిన్న పార్టీ యిచ్చింది

"కథలు రాస్తావ్ జీవితం వడపోసిన వాడిలా ఏమిటి జీవితానికి సాఫల్యం ? ఈ వయసో పదేళ్ళు పెరిగాక మనకేం మిగిలిస్తుందో చెప్పు" అందామె.

"మరేనండీ" తను

"నా తలకాయ నువ్వు బాటనీ ఎందుకు తీసుకోలేదు ? నా స్టూడెంటయ్యుండే వాడివి."

ఇదెందుకు మధ్య ?

శారీరకంగా నీతిమీద తనకున్న అభిప్రాయాల్ని గురించి ఇద్దరు ముగ్గురు చర్చల్లోకి దిగారు తనతో తన రీడరూ ఒకడు

అంతా అయ్యాక "సౌందర్యా మేడం ఏమంటోందోయ్ ?" వెకిలి నవ్వు

"ముసలికంపు దాచుకోటానికి పువ్వేసుకున్న క్రీములూ హేర్ డయ్యూ కూడా వెలిసి ఈ విశ్వమంతా నిండి కంపు కొడుతూన్నాయి అని చెప్పిందండి" అని చెప్పలేక కాంప్రొమైస్‌గా ఒక వెర్రి నవ్వునవ్వాడు తను.

కాంప్రొమైస్ — సర్దుకొని వెళ్లటం

ఏది తీవ్రంగా కావాలనుకుంటామో చెయ్యాలనుకుంటామో, బుద్ధి పూర్వకంగా దాన్ని వదులుకోవటం, చెయ్యకపోవటం — ఇంకా ఘోరం ఏది చెయ్యకూడదనుకుంటామో దాని కోరి చెయ్యటం — సర్దుకో సర్దుకో — కాంప్రొమైస్‌కా

తన ప్రక్కన కూర్చున్న సుబ్బారావు ఒంటి కంపుతో కాంప్రొమైస్ కాంటీన్‌లో కాఫీ పేరున దొరికే నీళ్లతో కాంప్రొమైస్. రాత్రి చలితో దోమలతో కాంప్రొమైస్ పది రూపాయలు పారేసి ధైర్యం చేస్తే తగ్గే యుగయుగాల నరాల వొత్తిడితో నీతిపేర కాంప్రొమైస్, భయంతో నాగరికతతో కాంప్రొమైస్

అందుకే రీడర్‌తో తను అనదల్చుకుంది అనలేదు

"తోక కోసేస్తాడోయ్ వీడూ" సామాన్యంగా ఆయన్ని గూర్చి వినవచ్చే కామెంట్. తోక కొయ్యడమేమిటి ? తనేం జంతువా ? -జంతువులే నయం. మచ్చికై మనసుతో సంబంధంలేని ఆప్యాయతల్ని పెంచుకుంటాయి ఇష్టం లేకపోతే పళ్లికిలించవు. నిర్భయంగా తమ అసమ్మతిని తెలుపుతాయి అలా పరిణతిలో జంతువుల కంటే ఎన్నో మెట్లు పైనున్న మనిషి సరిపుచ్చు కోవడంతో చాలా కిందికే దిగజారాడు ఇదేనా ఎగ్జిస్టెన్షియలిజం ?

*　　　*　　　*

ఇవీ నా డైరీలో ఒకవారం నేను రాసుకోవాల్సిన ఆలోచనలు, అనుభూతులూ, సంఘటనలూ ! దురదృష్టవశాత్తూ జీవితంలో ఎక్కువ భాగం కుళ్లనే చూశానేమో అనిపిస్తుంది కనుక నా స్వకీయాలూ, స్వగతాలూ సభ్య ప్రపంచానికి తెలిస్తే నా ఆరోగ్యానికేమంత మంచిది కాదనిపించింది

డైరీ రాయటం అలా సమాధి చేయబడ్డా, నాలోని ఆలోచనల్ని నా అంతరంగ వేదననీ సమాధి చేయలేకపోయాను. నాకు తెలీకుండా నాలో మరో తీవ్రతరమైన శక్తి ఎప్పుడూ వేధిస్తూ, వెంటాడుతూ, పరిహసిస్తూ తపింపజేస్తూ, నిలకడ లేకుండా చేస్తూ వుంటుంది దాన్ని వెలికిలాగి పోట్లాడి గెలవాలని, తిరుగుబాటు చేయాలని, ప్రయత్నించి ఓడిపోయాను ఈ ఓటమే నన్ను సభ్య ప్రపంచం దృష్టిలో ఒకోమెట్టూ దిగజార్చింది

నా డైరీని, నా నిజాయితీని, నా వ్యక్తిత్వాన్నీ సమాధి చేసుకోగలిగిన నేను సులభంగానే ఎం ఏ లో క్లాసు తీసుకుని బయటపడ్డాను రాంక్ కూడా రావాల్సిందే కానీ నా కన్నా చక్కగా నాట్యం చెయ్యగలిగినవాళ్లూ, నటనావతంసులూ ఉండటంతో ఫస్ట్‌క్లాస్‌తో సర్దుకున్నాను. కానీ నాకు విచారం కలిగించిన సంగతేమిటంటే పైకనబరచిన రాంక్ బాపతు వాళ్లలో ఆడపిల్లలూ వుండటం. నాకు బాగా తెలుసు వాళ్లలో ఎవరికీ చదువుపైన గొప్ప ధ్యాస లేదనీ వున్నా యూనివర్శిటీ వాళ్లిచ్చిన పురస్కారానికి వాళ్లు తగరనీ

మా చదువుల భవితవ్యానికీ క్లాసులివ్వటానికీ మా రీడరుగారే దిక్కయ్యారు ఆ ఏడు — మా ప్రొఫెసరు విదేశాల్లో నిల్చిపోవటం వల్ల ఆయన సహాయంతో మైసూరులో ఒక సంవత్సర కాలం ట్యూటరుగా తాత్కాలికంగా పనిచేశాను

హైస్కూలమ్మాయిలా అందరికీ దూరంగా తొలగుతూ, కవిత్వం రాసి పేరు తెచ్చుకున్న వసుంధర ఓ ప్రైవేట్ కాలేజిలో లెక్చరరుగా ఉద్యోగం సంపాదించి సాహిత్య సేవ చేస్తోంది ఆమెకు రిసెర్చికి సులభంగా సీటు దొరికింది నా కెలాగూ ఉద్యోగం లేదు కనుక ఆ విషయాన్నామెతో చర్చించి పాత పరిచయాల్ని తిరుగతోడదామన్న ఉద్దేశంతో ఆమె పనిచేసే కాలేజి కెళ్లాను నాకూ రిసెర్చి చెయ్యాలని వుండేదారోజుల్లో

ఆడపిల్లల కాలేజి ఎక్కడ చూసినా అమ్మాయిలే. నా కళ్లకందరూ గొప్ప అందంగా కనబడ్డారప్పుడు ! ఏమి సొగసులు? ఏమి హొయలు ? విరబూచిన తంగేడువనంలా, విరగబూచిన దోస తోటలా కంటికి పండుగ్గా వుంది. ఏమిటీ వికారమనుకున్నాను. సౌందర్యోపాసన కూడా ఒక భౌతిక పరమైన స్పందనేనా ?

ఎందుకు వీళ్లకీ చదువుల తాపత్రయం ? ఏం సాధిద్దామని కలలుకంటూ కాలేజిల కెగబడుతున్నారీ అమ్మాయిలందరూ ? అసలో విర్ణీతమైన ధోరణి అంటూ వుందా వీరికి ? పెళ్లి చేసుకుని ఒళ్లు పెంచుకుని పిల్లల్ని కనటానికేనా వీరి తపన ?

"హలో రాజా ! ఏమిటిక్కడా దీర్ఘాలోచనలో మునిగిపోయావు ? యూనివర్సిటీలో అంతా కలలు కన్నావు. చాలలేదా ?" అంటూ వచ్చింది వసుంధర తేరుకుని చూశాను ఒక్క క్షణం ఆశ్చర్యపోయాను సంపాదించే స్థితికి ఎగ్రబాకినందుకో లేక తను చెప్పేదీ వినే ప్రాణులు దొరికినందుకో మరేమోకానీ మనిషిలో ధీమా పెరిగింది యూనివర్సిటీలో వున్న రెండేళ్లలో ఏ రెండు మూడుసార్లకన్న ఎక్కువగా మాట్లాడలేదు వసుంధరతో మరి యీ చనువూ, ధోరణీ నిజంగా కాస్త ఆనందాన్నిచ్చాయి నాకు

కాసేపు మౌనంగా చిరునవ్వు పులుముకుని నీళ్లు నమిలాను

కాఫీలూ మర్యాదలూ, పరామర్శలూ నా ఉద్యోగాన్ని గూర్చి చర్చలూ అన్నీ అయ్యాయి

"కాస్త మనసు విప్పి మాట్లాడు రాజా, ఎన్నాళ్లైంది మనం యూనివర్సిటీ వదలి ? నీకు ఫస్ట్‌రాంక్ వస్తుందనుకున్నాం మేమంతా నువ్వు గొప్ప 'థింకర్'వి నీ ఒరిజినాలిటీ మాకెక్కడొస్తుందీ" అంది నవ్వుతూ

"అదే నా కొంప కూల్చింది క్లాస్ వచ్చింది చాల్లెద్దూ నీకు రాంక్ వచ్చిందిగా సంతోషం రిసెర్చికి ప్రయత్నం చేశావటగా ? ఎలా ఏమిటి ? నాక్కాస్త వివరాలు చెబుతావనే వచ్చాను" అన్నాను

"ఏమిటో, అదో లంపట పోనిద్దూ నాకు డాక్టరేట్ వస్తుందన్న ఆశ చచ్చింది, టాపిక్స్ చూస్తుంటే. అన్నీ వారి యిష్టప్రకారం జరగాల్సిందే మరి" అంది చిన్నగా నిట్టూరుస్తూ

"నీవు ఏం చేసినా నీకు డాక్టరేట్ వచ్చి తీరుతుంది వసుంధరా ! రాంక్ రాలేదూ అలానే ! కాని పిచ్చమ్మాయ్ రాంక్ కోసం నీవు పడ్డ పాట్లు మాకు తెలీవని నీవనుకుంటే అక్కడే పొరపాటు పడుతున్నావ్" అని మాత్రం వసుంధరతో అనలేదు. నేను డైరీ రాయకపోవటం లాంటిదే యిదీనూ

నేను రిసెర్చి చేయలేదు చివరికి సాహిత్యం మీద ఏమూలో మిగిలిన అభిమానం నన్నా పనికి విముఖుణ్ని చేసింది ఉద్యోగాల వేటలో తిరిగి, విసిగి వేసారాను చివరకు విసిగి ఏ అటెండరు వుద్యోగమో అయినాసరే చేయాల్సి వచ్చినా సిద్ధపడ్డాను అదీ అంత సులభంగా దొరకలేదు మనుగడ మానసికమైంది కాదు దానికి వ్యవస్థతో, ఆర్థిక పరిస్థితితో, దేశంలో నెలకొన్న వాతావరణంతో సంబంధముంది— అంతే తప్ప మన ఆలోచనల ధోరణితో ఏ మాత్రం లంకెలేదు నాకు మిగిలిఉన్న ఒకే రక్తబంధం నా అన్నకూడా ఈ వ్యవస్థకి బానిసే ఎక్కువ రోజులు నిరుద్యోగి తమ్ముణ్ణి ఎం ఏ. చదివించాకకూడా పోషించే స్థితిలో లేడు పాపం ఏదో అలా అన్నా వదినెల చూపుల్ని జీర్ణించుకుంటూ నెట్టుకొస్తు

చిరునామాలు : మనవి

పత్రికలోపడ్డ రచయిత్రుల చిరునామాలు కావాలని రాయవద్దని మనవి మీరు వారికి రాసే ఉత్తరాలు కేరాఫ్ ఎడిటర్, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం విజయవాడ—3 అని రాసినట్లయితే—మా కార్యాలయం నాటిని "రీ డైరెక్టు" చేయడానికి ప్రయత్నిస్తుంది. కనుక రిప్లయి కార్డులు రాయవద్దని మనవి.

— సం॥

వ్వాను. కానీ ఆ రోజు అన్న తెచ్చిన ప్రస్తావన నన్ను పలాయితుణ్ణి చేసింది

"ఆ రెడ్డిగారమ్మాయి వసుంధరను చేసుకో, చక్కగా లెక్చరర్ వుద్యోగం ఇప్పిస్తారట నీ అంతటి వాడు దొరక్కకాదు ఆ అమ్మాయికి నువ్వంటే చచ్చేంత ప్రేమట. ఆమె మనసులో కోరిక తీరటానికే నిన్నెంచుకున్నారు బాగా ఆలోచించు చదువుకుని ఉద్యోగం చేసుకొంటోంది, చక్కగావుంది ఉండాళ్ళో నీకూ ఉద్యోగం దొరుకుతుంది" అంటూ నివ్వెరపోయాను! వసుంధర మొగలిరేకు లాంటిది ఆ ముళ్ళని జాగ్రత్తగా హాండిల్ చేసే శక్తి నాకు లేదు వసుంధర సౌందర్యవతే కానీ నా సౌందర్యారాధన నిరపేక్షం పెళ్ళితో దాన్ని సమాధి చెయ్యలేను మా వీధిలో వాళ్ళు కొందరూ, ఉడిపీ, ధర్మస్థలమూ ఆ పరిసరాలకి బస్సు ఏర్పాటు చేసి నన్నూ రమ్మన్నారు. ఆ నెపంతో సమస్య నెదుర్కోటం వాయిదావేశాను

"మల్పే"— కర్నాటక రాష్ట్రంలో సముద్ర తీరంలోని ఒక చిన్న నగరం. మా 'టూర్'లో ఒక భాగంగా తగిలింది ఆవాతావరణమూ, ఆ పట్టణమూ చూశాక యింతకన్నా సదవకాశం రాదనిపించింది నా భుజానికున్న జిప్పర్ సంచితో మల్పేలో దిగేశాను ఎవరికంటా పడకుండా నిజానికి ఆ బస్సులో నన్ను గూర్చి పట్టించుకునేంత పరిచయస్థులూ ఎవరూ లేరుకూడాను

నాకున్న కొద్ది బట్టలూ, పుస్తకాలూ సంచిలో వుంచుకుని సముద్రతీరానికి నడిచివెళ్ళాను చక్కటి బీచ్ వుంది – చిన్నదైనా మల్పేకి ఒక చివర

భాష, ప్రజలూ అంతా కొత్త తెలిసిన కుళ్ళ ఎక్కడా కనబడలేదు "ఏమిటోయ్! ఇంకా ఉద్యోగం రాలేదా? ఏం చదువులోనయ్యా ఇవి ఎం ఏ ఫస్ట్ క్లాసేమో నీది పాపం" అనే వారు లేరు

"కథలు రాయి చాలు ఉద్యోగ మెందుకూ" అనే వదిన లేదు మూతి విరుచుకుని నాలుగు మెతుకులు రాల్చే వదినగారు అరుణారుణ ముఖం దర్శనీయం గాదు

"ఏం గురో! నీ పనే హాయి చక్కా నాలుగు పుస్తకాలు చదవటం. రెండు కథలు రాయటం స్నేహితులతో కాలక్షేపం మా గతిచూడు ఉద్యోగం పేరున స్వేచ్ఛ నమ్ముకుని చస్తున్నాం" అనే మిత్రుల ఆవేదనలు వినబడవు

"పర్‌ఫెక్షనిస్టువి నువ్వు అందుకే నిరాశావాదివయ్యావు" అనే మా రీడర్ లేదు నిరాశావాదిని కాను కనుకనే ఏం బ్యాంకి టెస్టు పాసయ్యి, క్లర్కుగా చేరి డిపార్ట్‌మెంటల్ టెస్టులు చదివి పేస్కేళ్ల వాదోప వాదాల్లో మునగలేదు అది ఆయన కర్థం గాదు

అపరిచితమైన వీధులు —
నే నెరుగని గాలి —

నన్ను ఒంటరిగా చీకట్లో చూసి మొరగని కుక్కలు —

సముద్రతీరంలో నిరంతరంగా నురగలు క్రక్కుతూ విరుచుకుపడుతున్న అలలూ — నేనో బార్‌లో పనిచేశాను జీవిక కోసం. బార్ యజమాని

"ఉపాసన"

'గౌడ్'కు తెలుగునాట బంధువులున్నారట. అతడి పూర్వీకులు తెలుగువారేనట నేను చదివిన తెలుగు చదువు నాకు దేశంకాని దేశంలో బార్ టెండర్‌గా ఉద్యోగం రావటానికి కారణ భూతమైంది

గౌడ్‌తో నా పరిచయం చాలా యాదృచ్ఛికంగా జరిగింది, ఉడిపికి రాకముందు బేలూరు శిల్పాల్ని చూస్తున్నాను.

ఉలి తాకిడికి కఠిన శిలలు కరిగి వెన్నలా మలచటానికి వీలుకలిగిందేమోనన్న అనుభూతి కలిగిందా శిల్పాల్ని చూస్తుంటే. ఆ శిల్పులు గొప్ప సౌందర్యారాధకులూ, సాధకులూ అయివుండాలి. ఒక టూరిస్ట్ గైడ్ చక్కటి ఇంగ్లీషు భాషలో సాలభంజికల సౌందర్య సంపదని వర్ణిస్తున్నాడు. ఆ శిల్పాల్ని చూట్టమే ఒక గొప్ప సౌందర్యపరమైన అనుభూతి.

ఒకణ్ణే తిరిగి వచ్చాను— ఆ రాత్రి. శిల్పాల్ని చూడాలని.

వెన్నెల్లో తడిసిన వంపుల్ని గాలికి ఆరబెట్టుకుంటున్న శిలా సుందరుల సొంపుల్ని చూసి వారి పాదాల దగ్గర తలబాదుకుని చావాలన్న బలవత్తరమైన కోరిక కలిగింది.

"క్షమించాలి. ఈ శిల్పాల్ని ప్రొద్దుట కూడా చూశారనుకుంటాను" అన్న పలకరింపు ఆంగ్ల భాషలో వినబడింది. వెనక ఓ ఆజానుబాహువు చిరునవ్వుతో నించునివున్నాడు. బదులుగా నేనూ నవ్వాను చిన్నగా.

"ఇలా ఒంటరిగా ఈ చోటుకి రావటం మంచిది కాదు అసలు రానీరుకూడాను మీరెలా వచ్చారో మరి! మీరెక్కడ బసచేశారు? బైదిబై, నా పేరు గౌడ్, నేను 'మల్పే'లో ఓ చిన్న బార్ 'కం' రెస్టారెంట్ నడుపుతున్నాను" అన్నాడు స్నేహపూర్వకంగా.

"నిజమే! ఈ శిలా సుందరులు పగలంతా మనుషులకి భయపడి నిర్జీవంగా వుండిపోయి ఈ వెన్నెల్లో ఈ ఏకాంతంలో ఊపిరులు నింపుకుని

తెలుసుకో

అద్దం మన ప్రతిబింబాన్ని
చూపించినట్లే
మనం చేసే అన్యాయాలను
అంతరాత్మ గుర్తు చేస్తుంది

దీపం చిన్నదయినా
గదినిండా వెలుతురు నింపినట్లే
ఉపకారం కొద్దిదయినా
కొందరి జీవితాలను కాపాడుతుంది

—భైరి సత్యనారాయణ ☆

మనసున్న మానవులతో కమ్యూనికేట్ చెయ్యగలవు మనల్నీ ఆ సౌందర్యమనే నిరంతర తత్వానికి లాక్కెళ్లే ప్రమాదముంది ఒప్పుకున్నాను నా పేరు రాజు ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురంజిల్లా వాణ్ణి" అన్నాను మనస్ఫూర్తిగా

దగ్గరకువచ్చి కౌగిలించుకున్నంత పనిచేశాడు. గౌడ్ నా చదువు గురించి తప్ప దాదాపు నా సంగతంతా తెలుసుకున్నాడు

తనకు పార్ట్‌నర్‌గా వుండమన్నాడు

"నా ముఖం పార్ట్‌నరేమిటి? బార్‌లో ఏదైనా చిన్న ఉద్యోగమిస్తే చాల"న్నాను అలా గౌడ్ స్నేహమూ బతకటానికో చిన్న ఆధారమూ లభించాయి గౌడుకు తెలుగు బాగా వచ్చని తెలిసింది తరువాతి దినాల్లో

ఆ రోజు బార్‌లో డ్యూటీ ముగించుకొని రూముకొచ్చాను. రాత్రి పదిగంటలైంది స్నానం చేసి సముద్రతీరానికెళ్లటం అలవాటుగా మారింది బయలుదేరే సమయానికొచ్చాడు గౌడు కార్లో బాగా తాగివున్నాడని తెలుస్తోంది

"రాజూ! ఇలారా. నీతో డ్రింక్ తీసుకోవాలీ రోజు కార్లో అన్నీ సిద్ధం చేశాను ఇక్కడకాదు హాలేబీడు గెస్ట్‌హౌస్‌కెళ్లాలి పద!" అన్నాడు నా అభ్యంతరాలన్నీ తోసిపుచ్చి లాక్కెళ్లాడు

హాలేబీడంతా శివమయం

"శివుడు పెద్ద కమ్యూనిస్టు రాజూ! నీకు తెలవదులే క్షీరసాగర మథనంలో శివుడికేం దక్కింది? అసలు క్షీరసాగర మథనమంటే ఏమిటనుకున్నావూ? ఈ బతుకుని మథించటమే దానికి చూశావూ, నాలాటి రాక్షసులంతా ఒకవేపూ, నీలాటి దేవుళ్ళంతా మరోవేపూ విషసర్పాన్ని పట్టుకున్నారు అందులో చిక్కిన సుందరమైన లక్ష్మినీ దివ్యాశ్వాన్నీ విష్ణువు లాటి వాళ్ళ సొంతం చేసుకున్నారు శివుడు— పాపం సింపుల్ క్రీచర్ హాలాహలం కూడా పుట్టిందా? దాన్ని భరించటానికి శివుడు కావాల్సి వచ్చాడు రాజూ నీవు శివుడి లాటివాడివి

యూనివర్శిటీలో నీకు ఏదీ దక్కలేదు బతుకులో ఉద్యోగాలూ, వ్యాపారాలూ హోదాలూ నీకు దక్కలేదు నీకు దక్కిందంతా చివరికీ బార్ టెండర్ ఉద్యోగం అంతేనా రాజూ?" అన్నాడు విరగబడి నవ్వుతూ.

"యూనివర్సిటీ ఏమిటి గౌడ్? నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా?" అన్నాను కంగారుగా

"నేను చెబుతా విను రాజూ! నేను గుర్తున్నానా నీకు? నేను యూనివర్సిటీలో బాటనీ లెక్చరర్‌గా పనిచేశాను మైనేమీజ్ సౌందర్యాగౌడ్! నీ గురించి వారికంతా తెలుసు ఎటుదిరిగీ నీకే నీ సంగతి తెలీదు పాపం అందంగా వున్నదాన్నారాధించి అనుభవించలేకపోవటమూ, అందవిహీనమైన దాన్ని ఏవగించుకుని దాన్నుండి తప్పించుకోలేక పోవటమూ నీకో శాపం అవునా" అంది వెనక సీట్లో ఓ గొంతు. చీకట్లో అసలు ఆమెని గమనించనే లేదుకాని ఆ గొంతులోని దుఃఖపుజీర తెలుస్తూనే వుంది

మరునాటి ఉదయం నాకున్న కొన్ని పుస్తకాలూ, బట్టలూ జిప్పర్ సంచిలో వేసుకుని, బస్సెక్కాను ★

"ఇందుకేనా డబ్బు దాచింది ? దీనికి నెలల తరబడీ దాచాలా ! నీ కేది కావాలంటే అది ఎప్పుడో కొనిపెట్టేవాణ్నికదా !" అన్నాడు అతను ముఖం చిన్నబుచ్చుకొని.

"మీరు కొనిపెట్టరని కాదు ఎందుకో అలా దాచాలనిపించింది" అని నవ్వింది ఆమె.

"ఏమిటి కొనుక్కుందా మనుకుంటు న్నావు ?" అని కుతూహలంగా అడిగాడు.

"ఉహూఁ ! కొన్నాక చూపిస్తాను !"

"అబ్బ, అంత రహస్యమా !"

"అవును మిమ్మల్ని ఒక్కసారిగా ఆశ్చర్యంలో ముంచుదామని !"

"నాకు తెల్సులేవోయ్ !"

"అలాగని నాచేత చెప్పిద్దామనా ? నేను చెప్పను. మీరు చెప్పకోలేరు కాని ... వెళ్ళిరండి !"

అతను నవ్వుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు. వెంటనే సూటు గుడ్డ కొని టైలరు కిస్తే, కాని తన పుట్టినరోజు నాటికి అందదు. ఆ పూటే షాపుకి వెళ్ళి గుడ్డ కొనేద్దామనుకుంది ఆమె. కాని, సూటు తెచ్చి భర్త ముందు పెట్టి ఆశ్చర్యపరచటానికి వీలు లేదు. టైలరు కొలతలు తీసుకొనేటప్పుడయినా అతనికి సంగతి తెల్సిపోతుంది. అతని షర్టుని బటి కొలతలు తీసుకొని కోటు కుట్టిస్తే, తీరా సరిపోతుందో లేదో ! ఇంత డబ్బు పెట్టి సూటు కుట్టిస్తే అది సరిగా లేకపోతే ప్రాణం ఉసూరుమంటుంది! ఈ పరిస్థితిలో భర్తతో చెప్పి ఇద్దరూ షాపింగుకి వెళ్ళి వస్తేనే మంచిది ఇద్దర్కీ నచ్చిన రంగులో తీసుకోవచ్చు. తన ముచ్చట తెలిసాక అతనిక కాదనడు కాదనలేడు ... ఇలా ఆలోచించి ఆ సాయింత్రం అతనింటికి రాగానే అతనితో కల్సి బజారుకి వెళ్ళాలని నిశ్చయించుకుంది ఆమె

అంతేకాదు. అతను వచ్చేవేళకు ముస్తాబయి సిద్ధంగావుంది. కాని, అతను మామూలు వేళకి రాలేదు ఇన్నాళ్ళకి అవసర మయినంత డబ్బు చేతిలో వుంది. తన ముచ్చట తీర్చు కునే క్షణం — ఏళ్ళతరబడీ ఎదురు చూసిన క్షణం — ఎంతో దగ్గరకి వచ్చింది ... అని మురిసిపోతూంటే కొట్టు మూసేవేళయి పోతున్నా అతను యింటికి తిరిగిరాలేదు !

సూటు మాట దేవుడెరుగు ... జీతాలు వచ్చేరోజున ...ఇంతవరకు అతను రాకపోవట మేమిటి ? ... అని తెలిసిపోని భయాలతో

కామాక్షి కోరిక

[10వ పేజీ తరువాయి]

ఆమెకు ప్రాణాలు గిలగిల లాడాయి కళ్ళు కాయలు కాసేలా చూస్తూ వీధి గుమ్మంలోనే నిలబడిపోయింది. "నాన్న యింకా రాలేదు. కొంచెం చూడండిరా !" అంది కంగారుగా. కొడుకు లిద్దరూ చూసివస్తామని వెళ్ళారు. వెళ్ళినవాళ్ళు వాళ్ళూ తిరిగిరాలేదు. ఎక్కడని వెతుకుతారు ! వాళ్ళనెందుకు పంపానా అని మరో దిగులు ప్రారంభ మయింది. ఆడపిల్లలిద్దర్నీ అటూయిటూ కూర్చోపెట్టు కొని గడపలోనే క్షణమో యుగంలా గడప సాగింది ఆమె.

ఏనిమిది గంటలు దాటాక కొడుకు లిద్దరితో తిరిగివచ్చాడు శంకరం !

"ఏమిటండీ యింత ఆలశ్యమయింది ?" అని ఉద్వేగ స్వరంతో అడిగింది కామాక్షి.

"బజార్లో తిరుగుతుంటే టయిము తెలియలేదు" అని నవ్వి చేతిలోని పేకెట్టు చూపించాడు తను.

ఆమె కళ్ళింత చేసి చూసింది. "ఏమిటిది ?"

"చెప్పకోచూద్దాం?" అని మేలమాడాడు.

చిరునవ్వులు చిందిస్తూ, అతను ఎదుట నిలిచేసరికి గంటల తరబడీ పడిన ఆవేదనంతా ఒక్కసారిగా కరిగి నీరయింది. ఆమె కళ్ళలోకి నీళ్ళు చింది వచ్చాయి. "మీ కంతా వేళాకోళంగా వుంది. వేళకి వస్తారేమో — యిద్దరం కల్సి బజారుకి వెళ్ళచ్చని ఎదురు చూస్తూ కూర్చుంటే యిలాచేసారు."

"బజారుకి దేనికి ? నీ పుట్టినరోజు కానుక కొనుక్కుందామనేనా ?"

"దేనికోదానికి ! దేనికయినా కలిసి వెళ్ళకూడదా యేం ?" అంది బుంగమూతి పెడుతూ.

"ఎందుకు వెళ్ళకూడదు. 'నువ్వు కొనుక్కుందామనుకున్నదేదో నేనే కొని తెచ్చాను ! ఇక ఆశ్చర్యపడటం నీ వంతు' అని పేకెట్టు తెరిచి చూపించాడు.


ఆమె నిర్ఘాంతపోయింది.


"నువ్వేం కొనుక్కుందా మనుకుంటు న్నావో నేను గ్రహించ లేననుకున్నావా ? ఇప్పుడేమంటావు ?..." అని నవ్వుతూ తెచ్చిన పట్టుచీర మడత విప్పి ఆమె భుజంమీద వేసాడు.

కామాక్షికి ప్రాణం ఉస్సురుమని పోయింది. ఉక్రోషంతో, కోపంతో ఆమె ముఖం కందగడ్డలాగయిపోయింది. తన భుజం మీద వున్న పట్టుచీర గుచ్చుకుంటున్నట్టు గబుక్కున తీసేసి పక్కనున్న బల్లమీద పడేసింది.

"ఎందుక్కొన్నారిది ?" అని పిచ్చిగా అరిచింది.

శంకరం తెల్లబోయాడు. పట్టుచీర కాక మరేం కొనుక్కుందామనుకుంది ? మూడు వందల్లో ఇదికాక మరి వచ్చేదేముంది ? బంగారం గురించి తలపెట్టే కాలం కాదిది,





కామాక్షి కోరిక

ఇంక ఏం కొనుక్కోవాలని ఆమె అనుకుందో అతనికి అంతుపట్టలేదు. ''మరి...మరి ఏం కొనుక్కుందామనుకున్నావు ?'' అన్నాడు తడబడుతూ.

ఏళ్ల తరబడి తను కన్న కలలు ... కొన్ని నెలలుగా తను చేసిన ప్రయత్నాలు ... అన్నీ ఒక్కపూటలో భగ్నమయిపోయాయి. అందులో దేనికోసం తానింత ఆరాట పడిందో అతనే చేజేతులా భగ్నంచేసాడు. ఉక్రోషంతో కామాక్షికి కళ్లనీళ్లు పొంగి వచ్చాయి. ''ఛీ! నా ఆశలన్నీ పాడుచేసారు.'' అంటూ చరచరా వంటింట్లోకి వెళ్లిపోయింది.

శంకరం ఎంతో నిరుత్సాహపడిపోయాడు. ఆమె వెనుకనే వెళ్లాడు. ''వచ్చేది నీ పుట్టిన రోజు కదా .... నువ్వా యిదే కొనుక్కుందామనుకుని వుంటావని కొన్నాను. సరే, జరిగిందేదో జరిగిపోయింది. నీ డబ్బు నీ దగ్గరేవుంది కదా ! నీ క్కావల్సింది కొనుక్కో కామూ !''అన్నాడు అనునయంగా.

అతనెంత బ్రతిమాలినా ఆమె మాట్లాడలేదు. ఆ రాత్రి యిద్దర్కీ నిద్ర పట్టనేలేదు ... పొద్దున్న పిల్లలు స్కూలుకి వెళ్లిపోయాక మళ్లీ ఆ ప్రస్తావన తెచ్చాడు శంకరం. ''... మన పెళ్లయి యిన్నేళ్లయినా నీకు పట్టుచీరొక్కటయినా కొనలేకపోయాను. ఇప్పుడెంతో సంబరపడి తెచ్చాను. ఇది కాదింకేదో కొనుక్కోవాలనుకుంటున్నావు. నేను కాదనటంలేదు. నీ యిష్టం వచ్చింది కొనుక్కో ! ...''

''ఎందుకు లెండి. దేనికయినా ప్రాప్తం ఉండాలి ! ...''

''నేనేదో తప్పు చేసినట్టు మాట్లాడుతున్నావు. నీ మనసులో ఉన్నదేమిటో పైకి చెప్పుకోందే ఎలా తెలుస్తుంది ?''

ఆమె చెప్పింది. ఆవేశంతో వచ్చిన ఆమె మాటలు అన్నేళ్ల ఆమె కోరికను బయట పెట్టాయి !

శంకరం నివ్వెరపోయి అన్నాడు. ''నువ్వు ... నువ్వు చెప్తున్నది నిజమేనా !''

ఆమె ముఖం ఎర్రనైవుంది. ''ఏం ? ఎందుకు అబద్ధం చెపుతున్నాననుకుంటున్నారు ?''

ఎంత ఆపుకుంటున్నా అతనికి నవ్వు వచ్చేసింది.

> ## కేన్సరు గుర్తింపుకి కొత్త పరికరం
>
> శరీరంలోని అన్ని భాగాలను విడివిడిగా ఒక తెరపై చూపించగల నూతన పరికరాన్ని జపానులో రూపొందించారు. దీని సహాయంతో కేన్సరు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తింపవచ్చు. టోక్యో ఆసుపత్రిలో దీనితో పరీక్షలను జరుపుతున్నారు ఈ పరీక్షల తర్వాత జపాను ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ ఈ కొత్త పరికరానికి ఆమోదం తెలుపగలదు. ఎక్స్‌రేలకంటే ఈ పరికరం సురక్షితమైంది. ఎక్స్‌రేల వలన ఏర్పడే అణుధార్మిక ప్రభావం దీనివలన ఏర్పడదు. ఈ పరికరాన్ని టోమోగ్రాఫిక్ స్కానర్ అని అంటారు. తోషిబా కార్పొరేషన్, టోక్యో విశ్వవిద్యాలయం వారు దీనిని సంయుక్తంగా రూపొందించారు.

''అదిగో ! అలా నవ్వుతారనే నేనింత వరకు మీకు చెప్పలేదు''

''ఏ ఆడదయినా తనకు చీరలు కావాలనో, నగలు కావాలనో కోరుకుంటుంది కాని..తన పుట్టినరోజుకి మొగుడికి సూటు కుట్టించాలని ఎక్కడా అనుకోదు. ఇలాంటి కోరికలు ఆడవాళ్ళకుంటాయని నేనెక్కడా వినలేదు'' అని గలగల నవ్వాడతను.

''ఎవళ్ల గొడవో ఎందుకు ? నా కిది కావాలనిపించింది. ఇది నా యిష్టం ! ఏం మీ కిష్టంలేదా ?''

''సూటుకేం నిక్షేపంలా వేసుకుంటాను. కాకుంటే షికారు కూడా వెడతాను.''

''నా కలాంటి దురాశ లేనే లేదు. మీ కష్టార్జితంతో మీరో సూటు కుట్టించుకుంటె తప్పేముంది ?''

''చూడు కామూ ! ఏది తప్పు ... ఏది రైటు అన్నది కాదిక్కడ ప్రశ్న ! మనమేం చేసినా నలుగురు నోళ్లల్లోను పడకుండా వుండేలా చేయాలి !''

''ఇదేంచిత్రమండీ ! మీరు సూటు వేసుకుంటే ఎవరేమంటారు ?''

"మా ఆఫీసులో నా తోటి వాళ్ళెవరూ సూటు వేసుకురారు..."

"...వాళ్ళు వేసుకోకపోతే పోనివ్వండి. మీరు వేసుకోటానికేం? మీ యిష్టం మీది..."

"నన్ను చెప్పనీ! నేను వేసుకు వెళ్ళాననుకో ... సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. నాకేదో లక్షలు లాటరీలో తగిలాయన్నట్టు చూస్తారు. హఠాత్తుగా ఆస్తులేవయినా కలిసొచ్చాయా అని అడిగేస్తారు..."

కామాక్షికి చిరాకెత్తింది. "అవుననండి. అక్కడితో నోళ్ళు మూసుకుంటారు."

"అహా! వాళ్ళూరుకున్నా మా ఆఫీసరు వూరుకోడుగా! తనలాగే తన క్రింద పని చేసేవాళ్ళు కూడ ఖరీదయిన బట్టలు వేసుకోవటం ఆఫీసర్లకి యిష్టముండదు. ఆఫీసు పనిలో కాస్త యిటో అటో అయిందనుకో ... అక్కడ్నించి తన అక్కసు నా సూటుమీదే చూపిస్తాడు. ఇంకీ వీధిలో వాళ్ళంతా నాకేమన్నా ప్రమోషను వచ్చిందా అని అడుగుతారు అమ్మలక్కలంతా నీ మీదకి దండయాత్రకి వస్తారు. సరే, సూటుతో సరిపోతుందా? దానికి తోడు బూటు కావాలి, టై కావాలి. డ్రైక్లీనింగు ఖర్చు, బూటుపాలిష్ ఖర్చు, రోజు గెడ్డం చేసుకోవాలంటే బ్లేడు ఖర్చు..."

"మీకంతా వేళాకోళం!"

"కాదు. నిజం! ఒక్క సూటుంటే ఇన్ని అవస్థలు పడాలి. అదే లేదనుకో ఏ బాదరబందీ లేదు. నే నెలా వున్నానో ఎవడికీ అక్కర్లేదు"

కామాక్షి ముఖం చిన్నబోయింది. "అంటే, ఎవరికిష్టం వచ్చిన బట్టలు వాళ్ళు వేసుకునే హక్కు కూడా లేదా ఈ లోకంలో?" అంది నిరుత్సాహంగా.

అతను గాఢంగా నిట్టూర్చాడు. "వాస్తవం చెప్పాలంటే లేదనే చెప్పాలి. పోలీసు వాడికి కాకీ యూనిఫారములా, జైల్లో ఖైదీలకి గళ్ళ బట్టల్లా మనలాంటి మధ్య తరగతి వాళ్ళక్కూడా కొన్ని రకాల బట్టలు కేటాయించబడినట్టే లెక్క! మన జీవితాలెలా వుంటాయో మనం వేసుకొనే బట్టలే చెపుతాయి. ఒకవేళ సూటు వేసుకొని వెళ్ళానే అనుకో ఎవరికితోచినట్టు వాళ్ళు విపరీతార్థాలు తీస్తారు."

ఉద్వేగంతో ఆమెకు మాటలు రాలేదు.

"...ఇదే సూటు రేపు మన వాసుకి కుట్టించామనుకో! ఎవరూ ఏమీ అనరు. అనుకోరు. చదువుకుంటున్నవాడు ... ఏదో యింటర్వ్యూకి వెడుతున్నాడనుకుంటారు... అంతేకాని, నా లాంటి వాడు వేసుకుంటే అంతా నవ్వుతారు."

"అదేంకాదు. మీ రనవసరంగా భయపడుతున్నారు. మనవాళ్ళు చాలా మంది వేసుకుంటున్నారు."

"ఎవరు వేసుకోవటం చూసావు?"

"ఆ మధ్య మా చెల్లెలు మొగుడు వేసుకోలేదు? ... అతను పెళ్ళప్పుడు వేసుకున్నాడని చెప్పకండి. ఎవరికెప్పుడు వీలయితే అప్పుడు వేసుకుంటారు అందులో ఎవరో ఏదో అనుకోవటానికి ఏముందో నా కర్థం కావటంలేదు"

"పిచ్చిదానా! నువ్వనుకున్నట్టే 'నా కిష్టమైంది కనుక వేసుకుంటాను. నీకేం మధ్య, అని అడిగినవాళ్ళ మాటలు త్రోసి పారెయ్యచ్చునేను. కాని, ముందు ముందు ఆడపిల్లల పెళ్ళిళ్ళు పెట్టుకొని, మగపిల్లల కాలేజీ చదువులు పెట్టుకొని ఈ దూబరా ఖర్చు లెందుకురా ... అని ఎవరోకాదు మా అమ్మే అంటుంది నన్ను! ఆవిడకేమని జవాబు చెప్పను?"

కామాక్షికి దుఃఖంతో గొంతు పూడిపోయింది.

"నిన్న నీకు పట్టుచీర కొన్నానా? పెళ్ళానికి పట్టుచీర కొన్నాడని మా అమ్మే కాదు ... యిరుగూ ... పొరుగూ అంతా సంతోషిస్తారు! ఇన్నాళ్ళకో మంచి పని చేసానని అంతా హర్షిస్తారు. నువ్వేచెప్పు.... నలుగురి చేతా శభాషనిపించుకునే పని చెయ్యనా — వేలెత్తి చూపించుకునే పని చెయ్యనా?...."


భర్త చెపుతున్న మాటలు కామాక్షికి వినిపించటంలేదు ... ఇంతేనా? చిన్ననాటి నుంచి కలలు కన్న కోరిక తీర్చుకునే అవకాశమేలేదా? ఇంత చిన్న కోరికను కూడా నలుగురూ ఆమోదించవల్సిందేనా? ఎవరి జీవితాలు వాళ్ళు అనుభవించే స్వేచ్ఛ నిజంగా ఈ లోకంలో లేనేలేదా? .... ఇలాంటి ప్రశ్నలెన్నో ఆమె చుట్టూ గిరగిర తిరుగుతున్నాయి. ఇన్నాళ్ళుగా మనస్సులో పెంచుకున్న ఆశల్ని త్రుంచి వేస్తున్నాయి.

"....అంతగా సూటులో నన్ను చూడాలని కోరిగ్గావుంటే చెప్పు ఎవరిదేనా వేసుకొని నీ కొక్కదానికి చూపిస్తాను.' అని ఆమెను నవ్వించాలని చూసాడు శంకరం.

ఆమె బుగ్గల మీదకి జల జల జారి వచ్చింది కన్నీరు "లేదు. మీరు ఎరువు బట్టలు వేసుకోవాలని నాకు లేదు. ఏదో దొంగ పని చేస్తున్నట్టు తప్పు చేస్తున్నట్టు రహస్యంగా మీరాపని చేయాలని నాకు లేదు." అంది చేతులతో ముఖం కప్పుకుంటూ.

ఆమెను ఎలా సముదాయించాలో అతని కర్థంకాలేదు

తీరని కోరికల్లో నాల్గవరకానికి చెందినవి కూడా ఉంటాయని ఆమె కిప్పుడిప్పుడే అర్థమవుతోంది! ☆





ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

క్షత్రియ తపస్సులు

ప్రశాంతాలయిన వనాలలో నివసిస్తూ మునులు సాత్విక జీవితాన్ని సాగిస్తూ తపస్సు చేసుకుంటారని మన పురాణేతిహాసాల వల్లన తెలుస్తూ ఉన్నది. వారి శాంత స్వభావాన్నిచూచి అడవిలోని క్రూరమృగాలు కూడా వారి ఆశ్రమ ప్రాంతాలలో సాధు మార్గాన్ని అనుసరించి సంచరిస్తూ ఉంటాయట! పాలకులైన క్షత్రియులు తమ పుత్రులకు పాలనాధికారాన్ని అప్పగించి వార్ధకంలో అడవులలో మునివృత్తిని గడపడం ఉన్నది. కాలంలో ఉన్నవారు కారణాంతరాల వల్ల అడవులలో తపస్సు చేస్తూ ఉన్నా, వారు క్షత్ర ధర్మాన్ని విడవకుండా ధనుర్బాణాదులను ఆయుధాలను ధరించడం ఉన్నది.

శ్రీరాముడు వనవాసం చేస్తున్నప్పుడు మునుల వలె జటావల్కలాలు ధరించినా క్షత్రియ వీరుని వలె ధనుర్బాణాలు ధరించినట్లు మనం వింటున్నాము. అర్జునుడు పాశుపతాస్త్రం కోసం పశుపతియైన మహేశ్వరుణ్ణిగురించి తపస్సు చేస్తున్నప్పుడు ధనుర్బాణాలు దగ్గర ఉంచుకొన్నట్లు తెలుస్తున్నది అయితే — మునులై ఉన్నవారు కేవలం సాత్త్వక మార్గాన్ని అవలంబించాలిగాని, రాజసవృత్తిని అవలంబించడం తగునా ? అని కొందరికి సందేహం కలగవచ్చు.

మహామునులు అడవులలో తపస్సు చేసుకొంటూ ఉన్నప్పుడు దుష్టులైన రాక్షసులు వారిని హింసిస్తూ, వారి తపస్సుకు విఘ్నం కలుగజేస్తూ వుంటే, ఆ మునులు రాజుల సహాయం కోరుతూ ఉండేవారు. ఆ రాజులే మునివృత్తిని అవలంబించి అడవులకు వచ్చినపుడు, వారి రక్షణ తమకు లభించ లదని వారు పరమానంద భరితులవుతారు. శ్రీరాముడు వనవాసానికి వచ్చినప్పుడు మునులు సంతోషించి, అతని రక్షణను పొంది తమ తపస్సును నిర్విఘ్నంగా సాగించారు. వారి రక్షణకయి రాముడు ధనుర్బాణాలు ధరించాడు. అది దుష్టశిక్షణకే గాని మరొకదానికి కాదు. అలాగే అర్జునుడు ఇంద్రకీల పర్వతారణ్యానికి వచ్చినపుడు, ఆ వనంలో ఉన్న మునులందరూ అతని ఆశ్రమం చుట్టూ తమ ఆశ్రమాలను ఏర్పరచుకున్నారు. అతనివల్ల తమకు రక్షణ కలుగుతుందని. మునివృత్తి అవలంబించిన క్షత్రియులు ఆయుధాలను ధరించి వుండడానికి కారణమిదే !

అసలు రాజ్యమే ఒక ఆశ్రమ మని, దానిని పాలించే రాజు ముని అనీ కాళిదాసు రఘు వంశంలో చెప్పాడు రాజులు తమ కుటుంబ విషయాలనే ప్రధానంగా గ్రహించకుండా దుష్టశిక్షణ, శిష్టరక్షణ ముఖ్యంగా గమనించేవారు అదే వారి ప్రధాన ధ్యేయం. అడవులో క్రూరమృగాలు మునులకు లొంగిపోయినట్లు దుష్టులు రాజులకు భయపడి, తమ దుష్టకృత్యాలు విరమించుకునేవారు. అలా చెయ్యనప్పుడే ఆ దుష్టులు శిక్షార్హులయేవారు.

నాగరికతా ? !

సిలోనులోని పెద్ద పెద్ద హోటళ్ళలో వుండే ధనిక వర్గపు స్త్రీలు యీ మధ్య రాత్రులలో "టాప్ లెస్"గా తిరుగ నారంభించారట. పరికిణీగానీ, స్కర్ట్‌గానీ తొడుక్కొని నాభికి పైభాగం హాయిమని గాలికి వదిలి జామ్మని రెస్టారెంటులలోనూ, లాన్స్‌లోనూ హాయిగా కూర్చుని కనువిందు చేస్తున్నారట. ఇది ప్రబలిపోతుందనీ, దీనినిహ ఆపకపోతే యీ టాప్‌లెస్ చివరికి ఆల్‌లెస్‌గా మారిపోవచ్చునని శ్రీలంక ప్రభుత్వం ఆలోచించిందట. హోటలు వారికి యీ విషయం తెలియజేయాలని శ్రీలంక ప్రెసిడెంట్ జయవర్ధనే అభిప్రాయపడ్డారుట—ఆహా! మనసా ! ఎగురవేలనే శ్రీలంక వైపుకు !

పాముల రింగులు పక్షుల జూకాలు !

ఒకనాడు దక్షిణ అమెరికాలోని ఆడవారు చిన్న చిన్న, బుల్లి బుల్లి పాములను పట్టుకుని కిప్పులకు బిగించి,చెవులకు రింగులుగా పెట్టుకొనేవారట. ఆ పాములు చెంపలమీద కదులుతూంటే వారికి ఏదో వింత ఆనంద , తృప్తి కలిగేదట. అలనాటి అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్ కూతురు మిస్ లిండా తన చెవులకు చిన్న చిన్న పంజరాలు జూకాలవలె పెట్టుకుని,అందులో బుజ్జి బుజ్జి పక్షులను పెట్టుకునేదట. ఆ పక్షుల కిచ కిచ లామె చెవులకు సప్తస్వర సంగీతంగా తోచేదేమో !

ఆవేశంతో హత్య !

ఈరోడ్డుకు చెందిన 32 ఏళ్ళ రామసామి అనే అతను తన భార్య 30 ఏళ్ళ మారిముదల్ శీలాన్ని శంకించి, తన అనుమానాన్ని నమ్మకంగా మార్చుకుని, తద్వారా వచ్చిన పగతో, ఆవేశంతో ఆమెనే గాక, ఇద్దరు కూతుళ్ళు 5 ఏళ్ళ సరసనూ, 3 ఏళ్ళ రాధను కూడా కొడవలితో నరికి, అంతతో ఆగక తన పీక కూడా నరుక్కోబోయి, అంత పని సవ్యంగా చేయలేక, తత్ఫలితంగా ఆసుపత్రి పాలై ఆనక పోలీసుల పాలయ్యాడట.

పట్టేయిచ్చిన నడక !

జయంతి జనతా మొన్న పదకొండో తేదీన, కోయంబత్తూరులో ఆగేసరి కా ట్రెయినులోంచి దిగిన ఏ యిద్దరు యువకులు అడుగులు తూచి తూచి వేయడం విడ్డూరంగా కనుపించి సెంట్రల్ ఎక్సయిజు అధికారులు వారిద్దర్నీ పిలిచి నఖ శిఖ పర్యంతం సోదా చేస్తే ఏమీ దొరకలేదట. ఏమి దాశ్చర్యం అని ఒంగి చూస్తే వారి చెప్పులలో లక్షా తొంభయ్యొనిమిది వేల కిమ్మత్తు చేసే బంగారం వున్నదట. వీరిద్దరూ గుంటూరు వారట.

సినిమాహాల్లో పిల్లల దొంగ !

మధురలో వో ధియేటరులో తన ఆరు నెలల పసికందును ఒళ్ళో కూర్చో పెట్టుకు సినిమా చూస్తూన్న ఒకామె పక్కన కూర్చున్న వో ముస్లిమ్ వనిత ఆ పిల్లని కాస్సేపు తన ఒళ్ళో పడుకోబెట్టమని కోరిందట. సినిమాలో లీనమయిన ఆ తల్లి తన పిల్లనామె ఒళ్ళో పడుకోబెట్టి సినిమాలో మరింత లీనమై, అదయ్యాక పక్కన చూస్తే ఆ ముసుగావిడా లేదట తన పిల్లా లేదట, హాలులో ఎక్కడా కూడా లేదట. పేరూ, ఎడ్రసూ తెలీక పరుగున పోయి పోలీసు రిపోర్టిచ్చిందటా తల్లి— ఇంతేకదా చేయగల్గింది ?

ఫాలాక్షుని డైరీ

తెలుగుదే పైచెయ్యి !

భారతదేశంలో పోయి నేడు మొత్తం 20 భాషలలో 763 సినిమాలు విడుదలయ్యాయట. ఈ 763 సినిమాలలో అగ్రతాంబూలం మన తెలుగు కే అట. తెలుగులో 155 సినిమాలు, హిందీలో 148 సినిమాలూ, తమిళంలో 140 సినిమాలూ వచ్చాయట. ఈ 763 సినిమాలలో 257 సినిమాలు ఏ సర్టిఫికట్లు పొందినవట. 1981 లో మొత్తం 737 సినిమా లయితే, 1982 లో 763 అట. సినిమా మనిషినో మూడు గంటలు తన మూడ్‌లో వుంచుకోగలదుస్మీ.

భూమిలోకి దిగిపోయిన బస్సులు !

మచిలీపట్నం దగ్గరున్న మంగినపూడి సముద్ర తీరంలో స్నానాలు చేయడాని ప్రయాణీకులను వో ఆర్. టి. సి. బస్సు సముద్రపు ఒడ్డుకు తెచ్చిందట. మరో బస్సు ఆ బస్సుకన్నా కొంచెం ముందు ఆపి ఆ డ్రయివరూ దిగాడట అంతా స్నానాలు చేస్తుండగా యీ రెండో బస్సు వున్నట్టుండి భూమిలోకి దిగిపో నారంభించిందట. గమ్మున వచ్చి మొదటి బస్సుతో యీ రెండో బస్సును లాగ ప్రయత్నించే సరికి ఆ బస్సు కూడా దిగబడిపోయిందట. మొత్తానికి రెండు బస్సులూ సంపూర్ణంగా కూరుకుపోయాయట.

పిల్లల్ని బావిలోతోసిన తల్లి !

తమిళనాడు ఆత్తూరుకు చెందిన తినిష్‌పేటలో జయరామన్ అనే వో ఆసామీ ప్రతిరోజూ పీకవరకూ తాగి వచ్చి పెళ్ళాన్ని చావగొట్టేవాడట. వోర్చి, వోర్చి, వోపిక నశించి, తన యిద్దరు పిల్లల్నీ నూతిలో పారేసి, తానూ దూకేసిందట. కానీ ఆ ఉన్మాదావేశం తగ్గి యాతన వచ్చిన దవడంవల్ల మునిగి చావక నూతి గిట్టు పుచ్చుకూర్చుందట. నాలుగేళ్ళ కొడుకు ధనశేఖరు, ఏణ్ణర్థం కూతురు సంగీత చనిపోయి శవాలుగా తేలారట. ఈ ఉన్మాదమతిని చట్టం విచారించి యావజ్జీవ కారాగార శిక్ష విధించిందట — అంతే కదా మరి !

విరక్తి — ఆత్మహత్య !

తమిళనాడుకు చెందిన ఎల్లంపల్లి అనే వూరులో 20 ఏళ్ళ గోవిందమ్మ అనే ఆమె ఆమె తల్లి కలిసి వో టీ షాపులో టీ త్రాగారట. గోవిందమ్మకు వో అరగంటాగి పెద్ద వాంతి వచ్చి, స్పృహ తప్పి పడిపోయిందట. ఆసుపత్రిలో ఆమె వాఙ్మూలమిచ్చి చనిపోయిందట. తనకు గుండె జబ్బుందనీ, అందువల్ల పెళ్ళికీ వివాహ జీవితానికి తన కదృష్టం లేదనీ, అలాటి బతుకుతో తనకు పనిలేదని తానే ఆత్మహత్య చేసుకోడాని కా టీ లో విషం కలుపుకున్నట్టు చెప్పి చనిపోయిందట—పాపం ! ఆ టీ షాపువాడు బ్రతికిపోయాడు.

మనసు విరిగి ఆత్మహత్య !

రాజనూరు అనే తమిళ గ్రామానికి చెందిన 18 ఏళ్ళ చిన్నకణ్ణు అనే వో యువకుడు తనతండ్రికి వున్న ఆస్తి పాస్తులను ఎంచక్కా జల్సా చేస్తూ, అంతతో సంతృప్తి చెందక యింకా ఆనందమార్గం వివాహమే కదా అని యోచించి, తనకు పెళ్ళి చేయమని తండ్రిని నేరుగా అడిగాడట. దానికా తండ్రి, "గాడిద కొడకా, నీకు పిల్ల నిచ్చే గాడి దెవడ్రా. మొదట నీ బతుకు సరిచేసుకో. పోరా" అని తిట్టాడట. ఇదే మాట పలుసార్లు తండ్రి అనేసరికి మనస్సు విరిగిపోయిన ఆచిన్నకణ్ణు యిదే విషయం రాసిపెట్టి ఉరిపోసుకు నింట్లో నిండు ప్రాణాలు తీసేసుకున్నాడట.

*


హైదరాబాద్ నోట్‌బుక్

తొలి కాంగ్రేసేతర మంత్రివర్గం :

వాన రాకడ ప్రాణం పోకడ తెలియడం కష్టమని సామెత. దీనిని వానరాకడ జనం పోకడ అని మార్చక తప్పదు. కాకుంటే ఒకటఒరంగా రాష్ట్రంలో పాతుకువున్న కాంగ్రెస్ ప్రభుత్వం, అటు సూర్యుడు ఇటు పొడిచినా కాంగ్రెస్ పట్ల తెలుగువారి అభిమానం మారదనుకున్న కాంగ్రెస్ గుండె దిటవు తొమ్మిదినెల్ల పసిపాపవంటి ఒక చిన్నపార్టీదెబ్బకు పేకమేడలాగ కూలిపోవడం ఎలాసంభవిస్తుంది ? ప్రజల ఓరిమికి కూడ ఎల్లలున్నాయి. అది ఎల్లలు మీరితే కల్లోలమే అన్న నిజంకూడ ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికలు నిరూపించాయి. తెలుగుదేశం అధ్యక్షుడు శ్రీ ఎన్. టి. రామారావు ముఖ్య మంత్రిగా 15 మంది మంత్రులున్న నూతన ప్రభుత్వం జనవరి 10 వ తేదీ ఉదయం 11 గంటలకు ఏర్పడింది. శ్రీ రామారావు ప్రమాణ స్వీకారంలోను నూతన పద్ధతిని అనుసరించారు. చరిత్రనే సృష్టించారు. మంత్రివర్గం ప్రమాణ స్వీకారం ఎప్పటిలాగ గవర్నర్ నివాసమైన రాజభవనంలో కాక లాల్‌బహదూర్ స్టేడియంలో బహిరంగంగా రెండు మూడులక్షల ప్రజల ఎదుట జరిగింది. శ్రీ రామారావు, శ్రీనాదెండ్ల భాస్కరరావు అంతరాత్మ సాక్షిగాను, తక్కినవారంతా భగవంతుని సాక్షిగాను ప్రమాణం చేయగా, ఒక్క పూసపాటి ఆనంద గజపతిరాజు మాత్రం ఆంగ్లంలో చేశారు. తారక రాముని మంత్రివర్గంలోనివారు వీరు— శ్రీయుతులు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి, నాదెండ్ల భాస్కరరావు ఆర్థిక శాఖాదుల మంత్రి, నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ మున్నగు శాఖల మంత్రి, పి. మహేంద్రనాద్ రెవిన్యూ, పౌరసరఫరాది శాఖలమంత్రి, సంగం రెడ్డి సత్యనారాయణ — రవాణాశాఖ, ఈలి ఆంజనేయులు—దేవాదాయ ధర్మాధికారశాఖ, కరణం రామచంద్రరావు — పంచాయతీ ఆది శాఖలు, పూసపాటి ఆనంద గజపతిరాజు — విద్యాశాఖ, కందూర్ జానారెడ్డి—వ్యవసాయాదిశాఖలు, సిరిగిరెడ్డి రామమునిరెడ్డి—వైద్య ఆరోగ్యశాఖలు. సహాయ మంత్రులు శ్రీయుతులు ఎం. రామచంద్రరావు—కార్మికాది శాఖలు, వై. రామకృష్ణుడు—న్యాయ, పురపాలకాది శాఖలు, టి. జీవన్‌రెడ్డి—ఆబ్కారీశాఖ, మహ్మద్ షకీర్—పర్యాటక, వక్ఫ్ శాఖలు, శ్రీమతి కె. ప్రతిభాభారతి. ప్రమాణ స్వీకారానంతరం ముఖ్యమంత్రి శ్రీ రామారావు ప్రజాసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, తము ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. శ్రీ రామారావు గురుతర బాధ్యతను స్వీకరించారు గనుక కడు జాగరూకతతో మెలగాలి. తెలంగాణా ప్రజలను రెచ్చగొట్టి, ఇతర ప్రాంతాలలో శాంతి భద్రతలను పాడుచేసి ఏదో ఉద్యమం లెచ్చి, నూతన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి తెలుగుదేశానికి ప్రత్యర్థులైన కొందరు నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని వదంతులు వ్యాపిస్తున్నాయి. శ్రీ రామారావు విచ్చలవిడిగా మాట్లాడితే, ఆరునెలల కన్నా ఎక్కువగా అధికారంలో ఉండరని ఢిల్లీ రాజకీయవర్గాలు వ్యాఖ్యానించినట్టు కొన్ని పత్రికలలో పతాక శీర్షికలతో వార్తలుపడ్డాయి. కనుక నూతన మంత్రివర్గం అప్రమత్తతతో వుండాలి. రెండు రూపాయలకు కిలో బియ్యం సరఫరా చేయడం కష్టంకాదు. మధ్య దలారీలను తొలగించి, మిల్లర్లందరినీ సంఘంగా ఏర్పరచి వారిద్వారా సరాసరి బియ్యం సరఫరా చేయిస్తే కిలో రెండు రూపాయల పథకం అమలు కావడంలో అవాంతరాలుండవు. విద్యను జాతీయం చేస్తే, డొనేషన్ల బెడద తప్పిపోతుంది. లేకపోతే నర్సరీ తరగతులకు వేయిరూపాయల విరాళమిచ్చి నెలకు 60 జీతం చెల్లించే దుర్గతి నుంచి తెలుగుజాతి తప్పుకోడం కష్టం. ప్రైవేటు విద్యాసంస్థలు ఇదివరకే లక్షలు తిన్నాయి గనుక వాటిని నష్టపరిహారం ఇవ్వకుండానే స్వాధీనం చేసుకోవచ్చును. అన్యాయంకాదు. ఒకటి రెండు నెలలలోపల సంఘ శ్రేయస్కరపథకాలు ప్రారంభించి ప్రజలకు విశ్వాసం కలిగించాలి. వారి అభిమానం దూరమయ్యే పనులు ఎంతమాత్రమూ చేయరాదు.

నూత్న సంవత్సరం వేడుకలు :

రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక వ్యవహారాలశాఖ నూత్న సంవత్సరం వేడుకలను 1983 జనవరి 1 వ తేదీన రవీంద్ర భారతిలో నిర్వహించింది. విద్యాశాఖ కార్యదర్శి శ్రీ కె. ఎస్. ఆర్. మూర్తి అధ్యక్షత వహించిన ఈ వేడుకలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. ఎన్. రామన్ ముఖ్య అతిథిగా వున్నారు. రోమన్ కాథలిక్ చర్చి ప్రతినిధి ఫాదర్ ధనరాజు, చర్చి ఆవ్ సౌతిండియా పక్షాన రైట్ రెవరెండ్ పి. విక్టర్ ప్రేమ్‌సాగర్, మెథడిస్ట్ చర్చి ప్రతినిధి బిషప్ కరియప్ప శామ్యూల్, హైదరాబాద్ చర్చి ప్రతినిధి డాక్టర్ ఎ. బి. మాసిలామణి, ఫాదర్ సుగంధ తమ సందేశాలలో అంతర్జాతీయ నూతన సంవత్సరం మానవ జాతికి కల్యాణకరం కావాలని, ప్రకృతి అనురాగాలను మానవుడు పొందుతూ నూతన ప్రయత్నాలు జరుపాలని, న్యాయంతోనే శాంతి నెలకొంటుంది. గనుక అలాటి శాంతి కోసం అందరూ ప్రయత్నించాలని, భగవంతుడు శాంతిని ప్రసాదించాలని, విశ్వమానవుల ఎడల ప్రేమ వెల్లివిరియాలని, ఇది అంతర్జాతీయ సంవత్సరాది అని, కాలం అమూల్యమైనదని, క్రైస్తవులు మత సామరస్యానికి కృషి చేయాలని, ప్రతివారు తమ కర్తవ్యాన్ని నిర్వహించినప్పుడే న్యాయం, శాంతి నెలకొంటాయని, కొత్త సంవత్సరం నూత్న క్రియా రూపకమైన ప్రయత్నాలకు అవకాశం కలిగించాలని, మానవుడు నూతనుడు కావాలని, దైవమానవ భాగస్వామ్యం ఏర్పడాలని, విశ్వంలో నైతిక మూల్యాలు ఏర్పడడానికి ప్రయత్నాలు జరుగాలని కోరారు. ప్రారంభంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ పి. ఎస్. ఆర్. అప్పారావు స్వాగతం చెపుతూ, అంతర్జాతీయ నూతన సంవత్సరం వేడుకలు ఏర్పాటు చేయడంలోని పరమార్థం అన్ని మత వర్గాల సామరస్యం కోసమేనని అన్నారు. చివరన సాంస్కృతికశాఖ నాట్యనాటిక విభాగం డైరెక్టరు శ్రీ సోమయాజులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదంతా ఎన్నికల్లో క్రైస్తవుల వోట్లకోసం వేసిన ఎత్తులని ప్రేక్షకులలో గుసగుసలు బయలుదేరాయి. పిదప, ఆర్. బిల్‌మోరియా కెరోల్ బృంద గానం సమర్పించారు. హైదరాబాద్ క్రిస్టియన్ డ్రెమెటిక్స్‌వారు 'జాన్‌ది బాప్టిస్ట్' అనే ఆంగ్ల నాటకం ప్రదర్శించారు.



కార్టూన్‌లు పంపేవారికి మనవి

కార్టూన్‌లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరుపెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6 నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కానీ, టపాలోగాని వీటిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్‌లు 'టపా' లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకునిబాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్‌లు పంపేవారు కవరుమీద ఆ సంచిక పేరు ఉదహరించాలి. ఈకార్టూన్‌లకి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

—సం.

'ఉత్తరాలు' శీర్షికకి రాసేవారు తమపేరు, పూర్తి చిరునామా తెలుగు లిపిలో రాయాలని మనవి చేస్తున్నాము.

— సంపాదకుడు

హైదరాబాద్ నోట్ బుక్

నృత్యోదయవారు కుమారి ప్రసన్నరాణి బృందం 'ప్రియం వేంకటేశం' నృత్య నాటికను ప్రదర్శించింది.

హరిజన వాడలలో రామాలయాలు :

శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ ఆంధ్రప్రదేశ్‌లోని హరిజన వాడలలో 108 రామాలయాలు నిర్మిస్తున్నారు. ఒక్కొక్క దానికి 25 వేల రూపాయలు ఖర్చవుతుంది. ఈ ఖర్చులో 90 వంతులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తుంది. తక్కిన దానికి శ్రీ జీయర్ చందాలు పోగుచేస్తారు. ఇంతవరకు ఐదు రామాలయాలు నిర్మించారు. తక్కినవి మూడు సంవత్సరాలలోగా పూర్తి కాగలవని ఆయన జనవరి 13న పత్రికా ప్రతినిధులతో అన్నారు. దైనందిన పూజలు చేయడానికి ఆయా ప్రాంతాల హరిజనులకు తగుశిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు

తిరుప్పావు ప్రవచనాలు :

శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ సెలవిచ్చినట్టు ఆండాళ్ అనుగ్రహించిన తిరుప్పావై విశిష్టాద్వైత వైష్ణవ సిద్ధాంత పరిమళాలు ప్రసరింపజేసే మధురాతి మధుర కవిత. అలాటి తిరుప్పావు ప్రవచనం జంటనగరాలలో మూడుచోట్ల ధనుర్మాసంలో జరిగి, భక్తులను విశేషంగా ఆకర్షించింది. రామానుజ మిషన్ పక్షాన సిద్దింబర్ బజార్‌లోని బేహతి భవన్‌లో సుప్రసిద్ధ విద్వాంసులు శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్యులు తెలుగులోను, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ హిందీలోను ఈ ప్రవచనం జరిపారు. ఆళ్వారుచార్య వైభవ ప్రవర్తి ప్రచార సభ పక్షాన ప్రముఖ విద్వాంసులు శ్రీ మరింగంటి శ్రీ రంగాచార్యులు శంకరమఠంలోని (నల్లకుంట) ప్రవచనాచార్యులు శ్రీ ముక్కూర్ లక్ష్మీ నరసింహాచార్య సికిందరాబాద్‌లోని కీస్ హైస్కూలులోను ప్రవచనం చేశారు. వీరు ముగ్గురు తిరుప్పావును రామాయణంలోని ప్రపత్తి సిద్ధాంతంతో తులనాత్మకంగా సమీక్షిస్తూ ప్రవచించారు.

ఉపశ్రుతి :

“ఇద్దరు రాముళ్ళే దిక్కయ్యారు!” అన్నారు మిత్రులు కేశవపంతుల నరసింహశాస్త్రిగారు. “ఎవరు, ఒంటిమిట్ట కోదండరాముడు, భద్రాచల సీతారాముడూనా ?” అన్నాను. “కాదండీ, ఒకరు ఆంధ్రరాష్ట్రం సాధించిన పొట్టి శ్రీరాములు, మరొకరు తెలుగువారి గౌరవం నిలిపిన నందమూరి తారక రాముడు”—అన్నారు ఆయన.

—తిరుమల రామచంద్ర

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-2. Editor : S. Radhakrishna.

సంపూర్ణ పోషకాహారంలో అన్ని పోషక పదార్థాలు సరియైన పాళ్ళలో వుండాలి...



సిరిలాక్ సంపూర్ణ పోషకాహారాన్ని సిద్ధం చేస్తుంది— రుచికరమైన విధంగా.

మీ పాపకి నాలుగు నెలలు నిండి ఘన పదార్థాలు తీసుకోడానికి సిద్ధంగా వున్నప్పుడు, సిరిలాక్ గురించి మీ డాక్టర్‌ని సంప్రదించండి. మీ పాపకి సిరిలాక్ ఆహారంగా యిచ్చిన ప్రతి పర్యాయము సంపూర్ణ పోషకాహారం యిచ్చామనే నమ్మకం మీకు మరొకసారి కలుగుతుంది.

అనగా సిరిలాక్ యిచ్చిన ప్రతి పర్యాయము ఒక ఘన ఆహార పదార్థం నుంచి అవసరమైన అన్ని పోషకాలు. మాంసకృత్తులు, కాలరీలు, పాపకి లభిస్తున్నట్లే. అది యిస్తూ పోషక పదార్థాల లోపం తొలగించడానికి మరొకటి ఇవ్వవలసిన అవసరం లేదు.

గోధుమ పిండి, పూర్తి మీగడ పాలు, పంచదార రుచికరంగా కలిపి వుండడం చేత సిరిలాక్‌కి ఈ సంపూర్ణ పోషకత్వం, రుచి లభించాయి. శరీర నిర్మాణానికి మాంసకృత్తులు, శక్తికి పిండి పదార్థాలు, క్రొవ్వు పదార్థాలు, అన్ని విధాల పెరుగుదలకి అత్యంత అవసరమైన విటమిన్లు, ఖనిజాలు సిరిలాక్ అందచేస్తుంది.

మీ పాపకి సిరిలాక్ యివ్వండి—పాప బాగుగా, ఆరోగ్యంగా పెరగడానికి.



సిరిలాక్®

పాలు వుండనే వున్నాయి



సిరిలాక్ తయారు చెయ్యడం ఎంతో సులభం. దీనిని ముందుగా మరగబెట్టిన, గోరువెచ్చని నీటిలో చేర్చండి. కలపండి వడ్డించండి.

SAA/FSL/C/2670 TEL

NESTLÉ.